ప్రజలే ప్రభువులు

# జనబలం

ఆగస్టు 2025 లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక రూ.10/-



## లోక్‌సత్తా భావజాలానికి బలముంది




## ఎన్నికల సంఘం @ 75

## ప్రపంచ శాంతికి కొత్త సవాళ్లు

## పాఠశాల విద్యపై రెండు కీలక జాతీయ సర్వేలు



## భారత్‌కి ఇంకా జనాభా అవసరమా?



# Historic Independence Day Greetings



***50 ఏళ్ల ఎమర్జెన్సీ***
***75 ఏళ్ల భారత రాజ్యాంగం***
***75 ఏళ్ల సుప్రీంకోర్టు***
***75 ఏళ్ల ఎన్నికల సంఘం***

లక్ష్యం 2047 @ సమ్మిళిత ఆర్థికాభివృద్ధి 8 -10%

**రోడ్ మ్యాప్:**

**నాణ్యమైన పాఠశాల విద్య, ఉన్నత విద్యలో ఐఐటీల ప్రమాణాలు, మంచి ప్రమాణాల ఆరోగ్యం, అప్పుల డబ్బు సంక్షేమానికి వినియోగించకపోవటం, పెట్టుబడులకు ప్రోత్సాహం, నైపుణ్యాలు, గ్రామీణులకు చిన్న పట్టణాల్లోనూ ఉపాధి, ఎన్నికల సంస్కరణలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత, చట్టబద్ధపాలన మొదలైనవి.**

***2025 ప్రత్యేక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు***

## Let Us Make India Great Again (MIGA)

**– డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,**
**ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు**

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

ప్రజలే ప్రభువులు

ఆగస్టు
2025

సంపుటి 27 సంచిక 08


## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్



*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

### కార్టూన్ కార్నర్




ఏ దేశాధినేత అంటే మీరేనని అర్థం చేసుకోండి! పేరు చెప్పలేదు సంతోషించండి!


05 ప్రపంచక్రమం – అంతర్జాతీయ సమాజానికి కొత్త సవాళ్లు

07 దశాబ్దాలు గడిచినా లోక్‌సత్తా భావజాలానికి బలముంది

13 భారత్‌కి కావలసింది ఎక్కువ నైపుణ్యాలు, ఆర్థికాభివృద్ధి ... ఎక్కువ జనాభా కాదు

29 జాతీయోద్యమ కాలం నుండి సమీక్షించుకోవాల్సిన స్వాతంత్ర్య దినోత్సవమిది!

32 75 ఏళ్ల భారత ఎన్నికల సంఘం మరింత పారదర్శకత అవసరం



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిబువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949
Email: accountsdept@loksatta.org

# స్వతంత్ర భారతం- సమస్యల"తో"రణం"

సంపాదకీయం

2025 ఆగస్టు 15 నాటికి మనకు స్వతంత్రం వచ్చి సరిగ్గా 78 సంవత్సరాలు పూర్తవుతాయి. 60 సంవత్సరాల క్రితం వెలుగునీడలు అనే తెలుగు సినిమా కోసం మహాకవి శ్రీశ్రీ రాసిన ఒక పాట ప్రస్తుత సందర్భానికి తగ్గట్టుగా గుర్తుకు వస్తుంది. "స్వాతంత్రం వచ్చెననీ సభలే చేసి సంబర పడగానే సరిపోదోయి సాధించిన దానికి సంతృప్తిని పొంది అదే విజయమనుకుంటే పొరబాటోయి"అంటూ అక్కడికి ఆగకుండా ఉండాలని చెబుతూ ఒక శుభ సందేశాన్ని ఆ పాటలో అందిస్తారు. ఆగకోయి భారతీయుడా కదలి సాగవోయి ప్రగతిదారులా" అంటూ దేశ ప్రజలకు ఒక పిలుపునిస్తారు.

స్వాతంత్రం వచ్చి సుమారు 8 దశాబ్దాలు కావస్తుంటే దేశంలో ఏమీ జరగలేదా అంటే పొరపాటు. అన్నీ జరిగాయా అంటే అది కూడా సరైనది కాదు. జరగాల్సినంత పని జరగలేదు అనేది మాత్రం నిజం. గ్లాసులో సగం నీళ్లు ఉన్నాయి అది వాస్తవం. మరో సగం నీళ్లు లేవు అన్నది కూడా వాస్తవమే. సకారాత్మకంగా ఆలోచించే వారు గ్లాసులో సగం నీళ్లు ఉన్నాయని చెబుతారు. ఇంకా మిగతా సగం కూడా నిండాలని అనుకునేవారు సగం నీళ్లు లేవు కదా అనే నిష్ఠుర సత్యాన్ని కూడా వెల్లడిస్తారు. అందుకనే భారతదేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత శాస్త్ర, సాంకేతిక రంగాలలో అనేక అద్భుతాలు సాధించాం. రాజకీయాల్లో మాత్రం అధ:పాతాళానికి దిగ జారిపోతున్నాము. రాజకీయాలు మినహాయిస్తే ఒకటి కాదు రెండు కాదు అనేక రంగాలలో మంచి విజయాలు సాధిస్తున్నాం. దేశంలోని ఇప్పటి యువత మన భుజాల మీద నిలబడి సుదూర లక్ష్యాలను ఛేదిస్తున్నారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు వెళుతున్నారు. కానీ దేశంలో ఉన్నవారు మరింత ఉన్నవారిగా ఎగబాకుతుంటే లేనివారు మరింత లేనివారుగా తయారవుతున్నారు. "ఒక వంక అన్నపురాసులు మరొక వంక ఆకలి కేకలు" అన్న ప్రజా కవి కాళోజీ నారాయణరావు గారి పలుకులు అక్షర సత్యాలు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అసమానతలు మరింత పెరుగుతున్నాయి. సంపద కేంద్రీకృతం అవుతుంది. దీనికి విరుగుడు రాజకీయాలలోనే ఉంది. కానీ సమాజానికి చెదపురుగులు పట్టినట్లు రాజకీయాలకు కూడా చెద పట్టింది. అందుకే శ్రీశ్రీ గారు రాసిన పాడవోయి భారతీయుడా ఆడి పాడవోయి విజయ గీతిక అనే పాటలో పేర్కొన్నట్లు "పదవీ వ్యామోహాలు కులమత భేదాలు భాషా ద్వేషాలు చెలరేగే నేడు అవినీతి బంధుప్రీతి చీకటి బజారు అలుముకున్న ఈ దేశం ఎటు దిగజారు అంటారు. ప్రతి మనిషి మరియు ఒకని దోచుకునే వాడే తమ స్వార్థం చూసుకునే వాడే అంటూ దేశంలో ఆనాటి పరిస్థితులను కళ్ళకు కట్టినట్టే శ్రీశ్రీ ఆ పాటలో వివరించారు. దానికి పరిష్కారం కూడా ఆయనే చూపించారు. "స్వార్థమే అనర్థదాయకం దాన్ని విడిచిపెడితే క్షేమదాయకమని" మంచి పరిష్కారం చూపిస్తారు.

శ్రీశ్రీ ఆనాడే పాటలు రాసినట్లే నేటి పరిస్థితులు అలాగే ఉన్నాయి. దేశంలో ఉన్న రెండు ప్రధాన జాతీయ పార్టీలలో ఒకటి మతం పునాదుల మీద సమాజాన్ని చీలుస్తుంటే, మరొక పార్టీ కులం కుళ్ళును ప్రేరేపిస్తూ కులాల పరంగా ప్రజలను చీలుస్తున్నాయి. ఆనాటి విభజించు పాలించు సిద్ధాంతం బ్రిటిష్ వారు పాటించారని విమర్శిస్తున్నాం. కానీ అంతకంటే దుర్మార్గంగా సమాజాన్ని కుల మత భేదాలు సృష్టించి ఓటు బ్యాంకు రాజకీయాలు పాటిస్తూ ఈ రాజకీయ పార్టీలు తమ పబ్బం గడుపుకుంటున్నాయి. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని దానికి ఎంతకైనా తెగించాలని పార్టీలు అనుకుంటున్నాయి. దానికి తోడు ఎన్నికలలో ప్రజలు డబ్బులకు సారాకు అమ్ముడుపోతున్నారని విమర్శిస్తున్నారు. ప్రజలు ఎప్పుడూ కూడా నిందితులు కారు.'చచ్చిన వారికి వచ్చిందే కట్నం' అంటూ ఎన్నికలప్పుడు అన్ని పార్టీల దగ్గర డబ్బులు తీసుకున్నా కూడా వారు ఓటు వేసే వారికే వేస్తున్నారు. "సబ్ కా సున్ నా" "అప్ నా కర్ నా అంటూ" తాము చేయాల్సిన పని చేస్తున్నారు. ఓటు వేయకపోతే చనిపోయినట్లు అని భావించే పేదల ఆశల మీదనే నేటికీ కూడా ప్రజాస్వామ్యం మన గలుగుతుంది. చదువుకున్న వారు పెద్దలుగా చలామణి అవుతున్న వారు చాలామంది ఓటు వేయడం లేదు. పైగా సమాజాన్ని నిందిస్తూ పడక కుర్చీ రాజకీయాలు చేస్తున్నారు.

ఈ పరిస్థితిని చూసి కలత చెంది ఈ పరిస్థితి మార్చడానికి మనతో ఏం కాదులే అనుకునే బదులు నిర్లిప్తకు తావివ్వకుండా శ్రీశ్రీ ఆ పాట లో ప్రజలకు మరొక మంచి సందేశాన్ని ఇస్తారు."కాంచవోయి నేటి దుస్థితి ఎదిరించవోయి ఈ పరిస్థితి" అంటూ ప్రజలను కార్యోన్ముఖుల్ని చేస్తారు. సమస్యల "తోరణం" తో మనం కునారిల్ల కూడదని సమస్యలతో "రణం" చేయాలని శ్రీశ్రీ భావన."సకల జనుల సౌభాగ్యమే నీ ధ్యేయం సమ సమాజ నిర్మాణమే నీ లక్ష్యం" అంటూ భవిష్యత్తు కార్యాచరణను ఆ పాటలో శ్రీశ్రీ పురిగొల్పుతారు. "ఏకతాటిగా గమ్యం చేరిన నాడే లోకానికి మన భారతదేశం అందించునులే శుభసందేశం" అంటూ ముక్తాయిస్తారు. చీకటిని తిడుతూ కూర్చోవడం కంటే చిరు దీపం వెలిగించాలన్న మాట మంచిది. భారతదేశంలోని సమస్యల పరిష్కారం కోసం ప్రజలందరూ ఏకధాటిగా నిలవాలని సమస్యలను ఎదుర్కోవాలని వాటి పరిష్కారానికి పూనుకోవాలని ఆశిద్దాం !!!.

స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలతో...

-బండారు రామ్మోహనరావు

# ప్రపంచక్రమం - అంతర్జాతీయ సమాజానికి కొత్త సవాళ్లు

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ -

ఇరవై నాలుగు గంటల టెలివిజన్ ప్రసారాల్ని, నిరంతర సోషల్ మీడియా పోస్టుల ప్రవాహాన్నీ గమనిస్తుంటే ఒక అభిప్రాయం కలగక మానదు. ప్రపంచం ఈవేళ హింస, క్రూరత్వాలమయమైంది.

ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ, అక్టోబర్ 7, 2003న హమాస్ ఉగ్రదాడి, దాంతో గాజాపై ఇజ్రాయిల్ బాంబుల వర్షం, హిజబుల్లా-ఇజ్రాయిల్ అనిశ్చిత కాల్పుల విరమణ ఒప్పందం, ఎర్ర సముద్రంలో, ఏడెన్ జలసంధిలో వాణిజ్య నౌకలపై హూతీల దాడులు, పహల్గాం ఉగ్రవాద కాల్పుల తర్వాత భారత్-పాకిస్తాన్ ఉద్రిక్తతలు, ఇరాన్ అణు స్థావరాలపై ఇజ్రాయిల్, అమెరికా దాడులు - ఇవన్నీ ప్రపంచం సంక్షోభంలో ఉందన్న భావం కలిగిస్తాయి.

కానీ వాస్తవాన్ని పరిశీలిస్తే, ఈ హింస, రక్తపాతం, సంఘర్షణ ఉన్నప్పటికీ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత, గత 80 ఏళ్లుగా ప్రపంచం ఎంతో శాంతియుతంగా, స్థిరంగా ఉంది. సాయుధ ఘర్షణలు, దాడులకు దారితీస్తున్న అనేక అపరిష్కృత అంశాలు, ఉద్రిక్త పరిస్థితులు ఉన్నమాట నిజం. మొత్తంగా మాత్రం, ఒక స్థిరత్వం, ప్రపంచ నియమ నిబంధనల పట్ల స్థూల అంగీకారం, వాటిని పాటించడం కనిపిస్తుంది. అయినా కూడా ఉక్రెయిన్ పై రష్యా దండ యాత్ర, ఇరాన్ అణు సదుపాయాలపై ఇజ్రాయిల్, అమెరికా దాడుల్ని మారుతున్న ప్రపంచక్రమానికి సంకేతాలుగా గుర్తించాలి. ఈ వేళున్న అంతర్జాతీయ వ్యవస్థ 1648 లోని వెస్ట్ ఫేలియా శాంతి పునాదులపై నిర్మితమైంది. ఐరోపాలో ఎడతెగని ఘర్షణలు, రక్తపాతం అనంతరం ఈ శాంతి వ్యవస్థ మొదలైంది.

ఒక దేశ సార్వభౌమత్వం పట్ల ఆధునిక అభిప్రాయాలు, ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోక పోవటం, సార్వభౌమ దేశాలన్నిటినీ సమాన ప్రతిపత్తి కలిగినవిగా పరిగణించడం వెస్ట్ ఫేలియా వ్యవస్థతోనే రూపుదిద్దుకున్నాయి. కాలక్రమేణా మనం ఇప్పుడు చూస్తున్న జాతి - రాజ్య వ్యవస్థకి ఇది దారితీసింది. రెండు ప్రపంచ యుద్ధాల ముగింపు, యుద్ధాంతం వలస రాజ్యాల విముక్తి చివరికి, మనం ఈవేళ ఏదైనా సాధారణమని భావిస్తున్నామో ఆ ప్రపంచ క్రమాన్ని సృష్టించింది.

ఒక దేశంపై మరో దేశం బల ప్రయోగానికి పాల్పడటం, కాలం చెల్లిన గతమనే అభిప్రాయం వేళ్ళునుకోవటం యుద్ధా నంతర ప్రపంచ క్రమంలో ప్రధానాంశం. ఒక దేశ సరిహద్దుల్ని సైనిక బలంతో మార్చటం లేదా ఆ దేశాన్ని ఆక్రమించటం గడచిన సహస్రాబ్దిల్లో సాధారణం



కావచ్చుగానీ, ఆధునిక ప్రపంచంలో అవి ఉల్లంఘనలు!

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి (యూఎన్ఎస్సీ) ఆమో దిస్తే తప్ప ఒక దేశంపై బలప్రయోగం చేయకూడదనేది ఈవేళ ప్రపంచమంతా స్థూలంగా అంగీకరించే సూత్రం. అంతర్జాతీయ శాంతి, భద్రతల పరిరక్షణ కోసం భద్రతా మండలి ఈ రకమైన అనుమతినివ్వొచ్చు. ఆత్మరక్షణకు, అవతలి దేశం తక్షణదాడికి దిగే అవకాశముందన్న సమాచారం, అంచనాతో ముందు జాగ్రత్తలో భాగంగా లేదా మరీ తీవ్ర సందర్భాలయితే, అమాయక ప్రజలను కాపాడే మానవీయ జోక్యం కోసం కూడా దాడులు నిర్వహించవచ్చు. అయితే ముందస్తు జాగ్రత్త దాడి ఎప్పుడు న్యాయమైనది అనేది అంతర్జాతీయ సంబంధాల్లో నిజమైన సవాలు. 'కరోలిన్ పరీక్ష' ద్వారా ఈ నిర్ధారణ జరగాలని అమెరికా విదేశాంగ మంత్రి డేనియల్ వెబ్ స్టర్ (1837) అప్పట్లో వాదించారు. కరోలిన్ అనే అమెరికా నౌక బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తున్న కెనడావారికి ఆయుధాల్ని సరఫరా చేస్తుంటే, దానిపై బ్రిటన్ దాడి చేసింది.

మరో దేశం ఖాయంగా దాడికి పాల్పడేటప్పుడు, తక్షణ స్వీయరక్షణ అత్యంత ప్రాధాన్యంగా మారినప్పుడు, ఇంకేం మార్గమూ లేనప్పుడు, చర్చలకు అవకాశం కొరవడినప్పుడు - ముందస్తు ఆత్మరక్షణ దాడులు న్యాయమని వెబ్ స్టర్ స్పష్టీకరించారు. ఈ ప్రమాణం సుమారు 150 ఏళ్ల పాటు కాలపరీక్షకు నిలబడింది.

ఇజ్రాయిల్, అరబ్ దేశాల మధ్య ఆరు రోజులు యుద్ధం



(1967), ఇరాక్‌లోని ఓసిరక్ అణు రియాక్టర్ పై ఇజ్రాయిల్ దాడి (1981), పశ్చిమ బెర్లిన్‌పై ఉగ్రవాద బాంబుల తర్వాత లిబియాకు వ్యతిరేకంగా అమెరికా వైమానిక దాడులు (1986), సామూహిక జనహనన ఆయుధాల్ని కలిగివుందనే అనుమానంతో (నిరాధారమని ఆ తర్వాత రుజువైంది) 2003లో ఇరాక్ పై అప్రతిష్టకర యుద్ధం, సిరియాలో అణు రియాక్టర్ ఉందనే అనుమానంతో 2007లో ఇజ్రాయిల్ చేసిన బాంబు దాడి - ఇవన్నీ అనుమానంతో శత్రువు చొరబాటును నిరోధించేందుకు చేసిన ముందు జాగ్రత్త దాడులు.

అటువంటి రెచ్చగొట్టే, ప్రమాదకర పరిస్థితులేవీ లేకుండా జరిగింది ఉక్రెయిన్ యుద్ధం. బలహీనమైన పొరుగు దేశంపై రష్యా దురాక్రమణకు పాల్పడిందని స్పష్టంగా అర్థం అవుతుంది. ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని అంతం చేసేయటం లేదా నామమాత్రపు స్వాతంత్ర్యంతో రష్యా కనుసన్నుల్లో కొనసాగేలా చేయటం కోసం బరితెగించిన దాడి ఇది. ఒక ప్రధాన అణ్వస్త్ర దేశం, యూఎన్ఎస్సీలో శాశ్వత సభ్యత్వం గల దేశం ఇటువంటి దురాక్రమణకు పాల్పడటం దిగ్భ్రాంతికరం. కనీవినీ ఎరుగనిది.

1979లో చైనా వియత్నాంపై దండెత్తింది. అయితే ఆ దేశాన్ని ఆక్రమించుకోవటం కోసం కాదు. నెలరోజుల వ్యవధిలో 1979 మార్చిలో చైనా తన బలగాలను వియత్నాం భూభాగం నుంచి ఉపసంహరించుకుంది. యుద్ధానంతర కాల అంతర్జాతీయ క్రమంలో ఉక్రెయిన్ యుద్ధం ఒక తీవ్ర ఉల్లంఘన.

రష్యా విజయం సాధించి, నేరభావం, శిక్ష లేకుండా ఉక్రెయిన్‌ను విలీనం గావించుకుంటే దండయాత్ర, విస్తరణ, ఆక్రమణల పూర్వకాలానికి ప్రపంచం మళ్లటానికి నాంది వాక్యం అనుకోవాలి. బడితె ఉన్నవాడిదే బర్రె. ఉక్రెయిన్ యుద్ధం ఇప్పటికీ రకరకాల మలుపులు తిరుగుతోంది. చివరికి ఫలితం ఎలా ఉంటుందో వేచిచూడాలి.

***యుద్ధానంతర కాల అంతర్జాతీయ క్రమంలో ఉక్రెయిన్ యుద్ధం ఒక తీవ్ర ఉల్లంఘన. రష్యా విజయం సాధించి, నేరభావం, శిక్ష లేకుండా ఉక్రెయిన్‌ను విలీనం గావిం చుకుంటే దండయాత్ర, విస్తరణ, ఆక్రమణల పూర్వ కాలానికి ప్రపంచం మళ్లటానికి నాంది వాక్యం అనుకోవాలి.***

జూన్‌లో ఇరాన్ అణు స్థావరాలపై బాంబుదాడి చాలా స్పష్టంగా ముందు జాగ్రత్త ఆత్మరక్షణ. కానీ కరోలిన్ ప్రమాణాలకు తగినట్టుగా లేదు. ఎందుకంటే ఇజ్రాయిల్ పై ఇరాన్ అణుదాడి ఎప్పుడు జరుగుతుందనే విషయంలో కచ్చితత్వం లేదు. నిజానికి, అణ్వస్త్ర బెదిరింపు అనేది దేశ ఉనికికి సవాలు చేస్తున్న కొత్త తరహా ప్రమాదం. ఇటువంటి అసాధారణ సవాలును ఎదుర్కోవటానికి కరోలిన్ పరీక్ష సరిపోదు. ఇరాన్ గొప్ప నాగరికత గల ప్రాచీన దేశం. కానీ తాను స్వచ్ఛందంగా సంతకం చేసిన ఒప్పందాన్నే ఉల్లంఘిస్తూ అణ్వాయుధాల్ని తయారుచేసే ప్రయత్నంలో ఉందనేది వాస్తవం. అణు విద్యుత్ కేంద్రాలకు 3-5 % యురేనియం శుద్ధి చాలు. కానీ ఇరాన్ పెద్ద మొత్తాల్లో యురేనియంను 60% దాకా శుద్ధి చేసింది. ఆ స్థాయి శుద్ధికున్న ఒకే ఒక్క ప్రయోజనం అణ్వాయుధాలు! 1979 తర్వాత ఇరాన్ ప్రభుత్వం తాము ఇజ్రాయిల్‌ను నాశనం చేస్తామని మళ్లీ మళ్లీ బహిరంగంగా ప్రకటిస్తూ వస్తుంది. 'ఇజ్రాయిల్‌కు మరణం', 'అమెరికాకు మరణం' అంటూ శాపనార్థాలు జపి స్తోంది! ఈ నేపథ్యంలో, అమెరికా, ఇజ్రాయిల్ దాడులపై ప్రపంచ దేశాలు మౌనం వహించటమో, సమర్థించటమో చేశాయి.

ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ, ఇతర దేశాలను నాశనం చేయడమే ధ్యేయంగా కొన్ని దేశాలు అణ్వాయుధాల తయారీకి వెంపర్లాడటం ఈవేళ ప్రపంచం ఎదుర్కొంటున్న కొత్త సవాళ్లు. ఈ జంట సవాళ్లను ప్రపంచం ఎదుర్కొనే తీరు రేపటి ప్రపంచ క్రమాన్ని నిర్దేశిస్తుంది. ✶

# దశాబ్దాలు గడిచినా లోక్‌సత్తా భావజాలానికి బలముంది



-బండారు రామ్మోహనరావు -

ప్రజల ధన మాన ప్రాణ రక్షణ ప్రధాన కర్తవ్యాలుగా రాజ్యం, రాజు యొక్క మౌలిక లక్షణాలుగా రాజ్యావతరణ సిద్ధాంతం చెబుతుంది. అది పాలన చేసే చక్రవర్తులైనా రాజులైనా నియంతలైనా ప్రజాస్వామ్య పాలకులైనా రాజ్యం కర్తవ్యం ప్రజల ధన మాన ప్రాణ రక్షణ చేయడమే. కానీ రాజుల్లో మనం మౌర్యవంశం రాజు అశోకుడి గురించి చెప్పు కుంటాం. ఎందుకంటే ప్రజల ధన ప్రాణ,మాన రక్షణ చేయ డంతో పాటు ప్రజల మౌలిక వసతులు తీర్చే ప్రక్రియ ఆయన చేపట్టారు. అశోకుడు రహదారులు వేయించెను, బావులు తవ్వించెను చెట్లు నాటించెను సత్రములు కట్టించెను అని మనం చిన్నప్పుడు చరిత్ర పుస్తకాల్లో చదువుకున్నాం కదా!. రాజు కర్తవ్యాలను అశోకుడు మరింత విస్తృత పరిచారు. అలాగే నేటి ప్రజాస్వామ్యంలో ఈ ప్రక్రియ మరిం త కొనసాగి ప్రజల వ్యక్తిగత జీవితాల్లోకి కూడా ప్రభుత్వాలు చొరబడి తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో అనుచిత ఉచితాలు, అలవి గాని వాగ్దానాల వైపుగా ప్రభుత్వాలు వెళుతున్నాయి. చివరికి ఆ వాగ్దానాలు నెరవేర్చలేక వెల్లకిలా పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒకసారి సుమారు మూడు దశాబ్దాల వెనక్కి వెళితే రాజకీయాల్లో ఇప్పుడు ఉన్నంత దుర్మార్గం లేదు కానీ ఆనాడు ఎన్నికల్లో మద్యం డబ్బు చలామణి ప్రాథమిక స్థాయిలోనే ఉంది. కానీ 1996లో డాక్టర్ జయప్రకాశ్ నారా యణ గారు తన ఐఏఎస్ పదవికి రాజీనామా చేసి ప్రజాస్వామ్య పీఠం నెలకొల్పిన నాటి పరిస్థితులు వేరు. ఆనాడు ఉన్న నైతిక విలువల నేపథ్యంలో రాజకీయాలలో వలువలూడిన దుర్మార్గాన్ని ఎత్తిచూపి రాజకీయ, ఎన్నికల పాలనా సంస్కరణల కోసం ఎలుగెత్తి చాటిన లోక్‌సత్తా భావజాలం నేటి పరిస్థితులకు మరింత అవసరమైన సంగతి మనం గుర్తించవలసిన అవసరం ఉంది. అందుకే ఒక మాటలో చెప్పాలంటే లోక్‌సత్తా భావజాలానికి ఇప్పటికీ బల ముంది. ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ఎలా అన్నదే మిలి యన్ డాలర్ల ప్రశ్న.

ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ప్రజాస్వామ్య సంస్కరణల పీఠం) ఈ పదాలు చాలా పెద్దవి. కానీ చాలా అర్థమంతమైనవి. సామాన్య జనానికి నోరు తిరగని పద బంధాలుగా మిగిలిపోయాయి. డాక్టర్ జయప్రకాష్ నారాయణ తన సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాయడానికి ముందే ఒక మెడికల్ డాక్టర్‌గా విజయవంతంగా కోర్సు పూర్తి చేసుకొని కేవలం మెడికల్ డాక్టర్‌గా మాత్రమే తన సర్వీసులను పరిమితం చేసుకుంటే రోగులకు మాత్రమే సేవలు అందించడం లేక అవసరమైన రోగులకు శస్త్ర చికిత్సలు చేయడం మాత్రమే చేయగలిగే వారు. కానీ జేపీ గారు ఎంచుకున్న మార్గం వేరు. సమాజానికి శస్త్ర చికిత్స అవసరమైనప్పుడు డాక్టర్‌గా పరిమితం కావడమా? లేక నవ సమాజ నిర్మాణ డాక్టర్‌గా.. ప్రజా సేవకుడుగా మారడమా ? అనే మీమాంస వచ్చినప్పుడు సివిల్స్ రాసి ఐఏఎస్ సాధించి ఆఫీసంగా రాష్ట్రవ్యాప్తంగా ఏ జిల్లాలో పనిచేసిన కూడా తనదైన మార్పును, మార్కును చూపించిన ఘనత డాక్టర్ జయప్రకాశ్ నారాయణ గారిది. సుమారు 17 సంవత్సరాలు సివిల్ సర్వీసెస్‌లో ఉండి ఆంధ్రప్రదేశ్ లోని అనేక జిల్లాలకు కలెక్టర్లుగా ఆ తర్వాత విశాఖ ఉక్కు కర్మాగారం స్పెషల్ ఆఫీసర్‌గా తదనంతరం అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అలాగే అప్పటి గవర్నర్ కృష్ణ కాంత్‌ల వద్ద స్పెషల్ ఆఫీసర్లుగా పనిచేశారు. అంతటితో ఆగకుండా సమాజంలో రాజకీయాలు పాలనా వ్యవస్థ అధోగతిలో ఉన్నప్పుడు ఒక విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. అదే 1996లో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత లోక్‌సత్తా స్థాపనకు ముందు ఒక ఉద్యోగిగా కాకుండా ఒక దేశ పౌరుడిగా ప్రజా జీవితంలోకి రాకముందు ఒక సంవత్సరం పాటు మేధో మదనం జరిగింది. అందులో ఎంతోమంది శ్రేయోభి లాషులను ప్రజాస్వామ్య ప్రియులను సంప్రదించి చివరికి ఒక నిర్ణయం తీసుకున్నారు. అదే లోక్ సత్తా ఉద్యమ సంస్థ ఆవిర్భావానికి కారణమైంది.

1997 ఆగస్టు 3 ఇది క్యాలెండర్‌లోని ఒక తేదీ మాత్రమే కాదు. ప్రజాస్వామ్య పాలనా సంస్కరణల కోసం లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఆవిర్భవించిన రోజు. అంతకుముందు ఎఫ్‌డీఆర్ ద్వారా కొంత మేధోపరమైన కృషి జరిగినా కూడా అది ప్రజలలోకి పోవడానికి ఒక ఉద్యమ సంస్థ రూపం తీసుకుంటే తప్ప ముందుకు పోలేమని డాక్టర్ జయప్రకాశ్ నారాయణ భావించి మరి కొంత మంది మిత్రులతో కలిపి

హైదరాబాదులో నౌబత్ పహాడ్ గా పిలవబడి ప్రస్తుతం బిర్లా మందిర్ ఆ పక్కనే ఉన్న బిర్లా సైన్స్ సెంటర్ హాలులో ఒక ఆత్మీయ సమావేశం జరిగింది. ఆత్మీయ సమావేశంలో లోక్ సత్తా భావజాలానికి ఒక ఉద్యమ రూపం ఇవ్వడానికి అవసరమైన ఉద్యమ సంస్థ ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చింది. ఏ ఉద్యమానికైనా ఒక సంస్థాగత రూపం ఉండాలి. దానికి ఒక ప్రజాస్వామికంగా ఎన్నికైన కమిటీ ఉండాలి. దాని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సంఘాలు ఏర్పాటు చేయాలి. అనే ఒక ఆలోచన కలిగింది. అంతకంటే ముందు సంస్థకు ఒక రూపం ఇవ్వాలంటే దానికి ఒక పేరు కావాలి. పేరు మీద కూడా చాలా మేధో మధనం జరిగింది. అలా ఆహూతుల నుండి సంస్థ పేరు ఖరారు చేయడానికి ఒక మూడు నాలుగు పేర్లు పరిశీలనకు వచ్చాయి. వాటినన్నిటిని పరిశీలించగా చివరికి రెండు పేర్లు మిగిలాయి. ఉద్యమానికి ఏ పేరు పెట్టాలి అని అంశంలో ఎక్కువ ఓట్లు పడ్డ పేరు "జనబలం" ఈ తెలుగు పేరుకు కొన్ని అవరోధాలు ఉన్నాయి. తెలుగు పేరు కనుక కేవలం తెలుగు రాష్ట్రాలలో కానీ దేశవ్యాప్తంగా తెలుగు తెలిసిన వారికి మాత్రమే అర్థమవుతుంది. కానీ దేశవ్యాప్తంగా మార్పు కోరుకుంటున్న మనం కేవలం తెలుగు రాష్ట్రాలకు పరిమితం కావద్దని దూరదృష్టితో ఆలోచిస్తే అలాంటి పేరు మరొకటి తోచింది. ఆ పేర్లు అర్థం "జనబలం" రావాలి. కానీ దేశమంతా అర్థం కావాలి. అలా జనాన్ని "లోక్" గా బలాన్ని "సత్తా" గా మార్చుకొని లోక్‌సత్తాగా ఉద్యమ సంస్థకు నామకరణం జరిగింది. చర్చలో జనబలానికి ఓటు పడ్డాయి కానీ జనబలం అనే పేరు కంటే కొన్ని తక్కువ ఓట్లు పడ్డా కూడా చివరికి దేశవ్యాప్తంగా ఉద్యమ సంస్థ పేరు జనాల నోళ్లలో నానాలంటే హిందీ పదమైనా సరే లోక్ సత్తా గా నామకరణం జరిగింది. కానీ జన బలానికి ఎక్కువ ఓట్లు వచ్చాయి. కదా అందుకే ఆరోజు నుండి జనబలం అనే మాసపత్రికను లోక్‌సత్తా అధికార మాసపత్రికగా ప్రకటించారు. అంటే మెజారిటీ భావజాలాన్ని అభిప్రాయాన్ని గౌరవించి పత్రికకు "జనబలం" అనే పేరు పెట్టి అందరి అభిప్రాయాలకు గౌరవాన్ని ఇచ్చారు. ఇది లోక్‌సత్తా ఆవిర్భావ చరిత్ర. అంతటితో ఆగితే అన్ని స్వచ్ఛంద సంస్థల లాగానే లోక్‌సత్తా కూడా ఉండేది. కానీ "ముహూర్తం ఆసన్నమైన భావాలను ఏ శక్తి ఆపలేదనే విధంగా ఆనాడు అంత వేగంగా, అంత విసురుగా ప్రజల్లోకి వెళ్ళడానికి భావజాల పునాదే కారణం.

ప్రజలే ప్రభువులు(People power)అనే ట్యాగ్‌లైన్‌తో ప్రజాస్వామ్య పాలనా సంస్కరణల కోసం ఆవిర్భవించిన ఉద్యమం లోక్‌సత్తా ..అనే నినాదంతో మొదలైన ప్రయాణం అవిశ్రాంతంగా సుమారు మూడు దశాబ్దాలుగా కొనసాగు



తూనే ఉంది. లోక్‌సత్తా ఉద్యమ ఆశయాలని ఉద్యమ సారాన్ని రంగరించి రెండవ స్వతంత్ర పోరాటం అనే పుస్తకాన్ని రూపొందించడం జరిగింది. అలాగే దానికి అనుగుణంగానే గ్రామ లేక మున్సిపల్ వార్డు స్థాయి నుండి ప్రజా సంఘాల ఏర్పాటు నుండి మొదలుకొని రాష్ట్రస్థాయి వరకు సంస్థాగతం నిర్మాణం ఎలా ఉండాలో ఆ పుస్తకంలో రాసుకున్నాము. అంతమాత్రాన ఉద్యమం ముందుకెళు తుందా ప్రజలను మమేకం చేసి ఒక అంశంపై వారిని ఉద్యమ ఉద్యమానికి ప్రేరేపిస్తే తప్ప సంస్థకు అర్థం లేదనే లోతైన అవగాహనతో లోక్‌సత్తా ఆనాటి నాయకత్వం మరింత ఆలోచించి "సురాజ్యం" అనే పుస్తకాన్ని ప్రచురించింది. ప్రస్తుత సమాజంలో ముఖ్యంగా రాజకీయాలలో పరిపాలనలో ఎలాంటి లోపాలు ఉన్నాయి ఆ లోపాలను పరిహరించడానికి ఎలాంటి మార్గాలు ఉన్నాయి అని ఆలోచించింది "సమస్య వర్ణన కాదు సమస్య పరిష్కారం కావాలని"ఒక మంచి పరిష్కారం చూపి "లోక్‌సత్తా ఇది మీ సత్తా"అంటూ ఒక స్లోగన్ తయారుచేసి, ప్రఖ్యాత తెలుగు నటుడు అక్కినేని నాగార్జునతో ఆనాటి ప్రచార, ప్రసార మాధ్యమాలలో విస్తృతంగా ప్రచారం చేసి అది ప్రజల నినాదంగా మార్చింది.

ఓటు మనది..పన్నుల నోటు మనది..., ప్రజలే ప్రభువులు–పాలకులు సేవకులే అనే నినాదాన్ని ఆ తర్వాత లోక్‌సత్తా ఉద్యమ సంస్థ అందిపుచ్చుకుంది. ఆ నినాదాల్ని ప్రజల్లోకి తీసుకెళ్ళింది. మన ఓటుతో ప్రభుత్వాలను ఎన్నుకుంటున్నాము. మన పన్నుల డబ్బులతో ప్రభుత్వాలు నడుస్తున్నాయి అనే టాక్స్ పేయర్ సూత్రాన్ని ప్రజలతో మమేకమై ప్రతిపాదించింది. పన్నుల డబ్బులు సద్వినియోగం కావాలంటే రాజకీయ ఎన్నికల పాలనా సంస్కరణలు రావాలని దానికి తోడు ప్రజాస్వామ్యంలో ఉన్న మూల సూత్రాలు స్వేచ్ఛ, ప్రజల నిర్ణయాధికారం, ప్రజల భాగస్వామ్యం, చట్టబద్ధ పాలన, స్వయందిద్దుబాటు అనే ప్రజాస్వామిక భావనలు సాకారం కావాలంటే న్యాయ, పోలీసు సంస్కరణలు కూడా రావాలని లోక్‌సత్తా భావించింది. ఉన్నతమైన ఆశయం నెరవేరాలంటే అంతకంటే




ఉన్నతంగా ఆలోచించే ప్రజలు దీనితో మమేకం కానిదే ఇది ముందుకు పోదు అని ఆనాడే లోక్‌సత్తా భావించింది. అందుకే ఏదైనా ఒక కార్యాచరణకు పూనుకుంటే తప్ప ప్రజలలో లోక్‌సత్తా భావజాలానికి ఆచరణాత్మకంగా ఒక రుజువు చూపించాలి అనే భావన కలిగింది. అదే 1998 పెట్రోలు బంకులలో కల్తీ, తూకంలో మోసాల గురించి ప్రశ్నించే ఉద్యమంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. ఆనాడు 1998 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కేవలం 1500 పెట్రోల్ బంకులు మాత్రమే ఉన్నాయి. బ్రిటిష్ వారి వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన జాతీయ ఉద్యమంలో "పిడికెడు ఉప్పే నిప్పు" అయినట్లు రాష్ట్రంలోని పెట్రోల్ బంకులలో కల్తీ , తప్పుడు తూకాలపై ఉద్యమం రాష్ట్రమంతా వ్యాపించింది. ఆనాడు ఉన్న చట్టాల పరిధిలోనే ప్రతి పెట్రోలు బంకులో కల్తీని తనిఖీ చేయడానికి ఉన్న రాష్ట్ర ప్రభుత్వ తూనికలు కొలతల శాఖ చేసిన నిబంధనలను వాడుకొని ఒక టిష్యూ పేపర్‌పై నాలుగు చుక్కలు పెట్రోలు లేక డీజిల్ డ్రాప్స్ వేసి అందులో కల్తీ ఉందా లేదా అని తెలుసుకోగలిగాము. అలాగే ప్రతి పెట్రోల్ బంకులో ఒక లీటర్ క్యాన్‌తో పాటు రెండు, ఐదు లీటర్ల క్యాన్లు తప్పనిసరిగా ఉండాలని అమలు చేయగలిగిన సత్తా లోక్‌సత్తాదే!. అలా హైదరాబాదు నగరంతో పాటు ప్రతి జిల్లాలో కేవలం నాలుగైదు పెట్రోల్ బంకుల్లోనే ఈ ఉద్యమాన్ని కొనసాగించడం ద్వారా అప్పటి తూనికలు కొలతల శాఖ వారు రాష్ట్రవ్యాప్తంగా పెట్రోలు బంకులపై దాడి చేసి లోక్‌సత్తా ఉద్యమానికి మరింత ప్రేరణ కలిగించారు. అక్రమార్కుల పని పట్టారు. ఆనాడే పెట్రోల్ కొలతలు కల్తీపై ప్రభుత్వం కూడా లోక్‌సత్తా ఉద్యమ సంస్థతో సహకరించి ఆనాడే వేలకోట్ల రూపాయల ధనాన్ని వినియోగదారులకు లాభం చేకూర్చింది.

**అవినీతిపై సమరం**

సమాజంలోని అవినీతి మూలాలను బయటకు తీయడం మొదలు పెట్టింది. అవినీతిపరులను కేవలం ఏసీబీకి పట్టించడం మాత్రమే కాదు వారిలో మౌలిక మార్పుకు దారి తీయాలంటే అవినీతి చేస్తే ఉద్యోగం పోవడమే కాదు తమ భార్యాపిల్లలు రోడ్డున పడాల్సి వస్తుందనే భయం కలిగేలా అవినీతి నిరోధక చట్టాన్ని తయారుచేసి ఇంప్లిమెంట్ చేయాలని కోరింది. ఇంతలోపే 1999లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు వచ్చాయి. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల రణరంగంలో హోరా హోరీగా పోరాడడానికి మమేకమై పని చేస్తుంటే అదే అదనుగా లోక్‌సత్తా ఉద్యమ సంస్థ "ఆటగాళ్లు మారడం కాదు ఆట నియమాలు మారాలి" అనే నినాదంతో ఆనాటి ఎన్నికల రణరంగంలో ఒక అంపైర్ పాత్ర వహించింది. ఎన్నికలంటే వన్డే క్రికెట్ మ్యాచ్ కాదు ప్రజల జీవితానికి సంబంధించిన అంశం అంటూ నినదించింది. ఒక స్వచ్ఛంద సంస్థ రాజకీయాలలో మార్పుకు ఏం కృషి చేస్తుందనే ఆలోచన పటాపంచలు చేస్తూ ఒక వినూత్నమైన కార్యక్రమానికి ఆనాడే లోక్‌సత్తా తెరలేపింది. అదే ఎన్నికల నిఘా వేదిక రూపంలో బయటకు వచ్చింది. ఈ వేదిక ద్వారా ఒక కొత్త కార్యక్రమానికి రూపకల్పన చేసింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థుల మధ్యన ప్రజా వేదికల ద్వారా ప్రసార మాధ్యమాల ద్వారా ఆరోగ్యకరమైన చర్చ ఎలా సాగుతుందో అలాగే రాజకీయ పార్టీల అభ్యర్థులతో మనం ఉమ్మడి వేదిక అనే ఒక వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేసుకున్నాము. 1999లో ఆనాడు రాష్ట్రంలో ఉన్న 294 అసెంబ్లీ నియోజకవర్గాలలో సుమారు సగానికి పైగా నియోజకవర్గాలలో ఉమ్మడి వేదికల ద్వారా ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులను ఒకే వేదిక మీదికి పిలిచి ప్రజలతో ప్రశ్నలు సంధింపచేసి దానికి అవసరమైన ఏర్పాట్లు చేసి రాజకీయ పార్టీలతో ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ప్రజల విరాళాలతో ఉమ్మడి వేదికలు నిర్వహించి విజయవంతం చేసిన ఖ్యాతి లోక్‌సత్తా

ఉద్యమ సంస్థకే చెందుతుంది.
చివరికి రాజకీయ పార్టీలు కూడా ఏదైనా ఒక సమస్య వస్తే లోక్ సత్తా మధ్యవర్తిత్వాన్ని కోరే విధంగా ఆనాడు రాష్ట్రంలో ఒక కొత్త వరవడిని, సరి కొత్త నమ్మకాన్ని నెలకొల్పింది. ఆ నమ్మకం సడలకుండా లోక్‌సత్తా తనదైన రీతిలో ఉద్యమాలను రూపొందించింది. రాజకీయ పార్టీలలో పారదర్శకత ఉండాలని సంస్థాగతంగా పార్టీలో వాటి కార్యకలాపాలలో సభ్యులకు అంతర్గత ప్రజాస్వామ్యం ఉండాలని పార్టీల ప్రక్షాళన కార్యక్రమం చేపట్టింది. ఎన్నికల్లో మనీ పవర్, లిక్కర్ పవర్ పోవాలని ఎన్నికల్లో అక్రమాలు తొలగాలని ఎన్నికల సంస్కరణలకు పూనుకుంది. అందుకు అనుగుణంగా మీ అభ్యర్థుల గురించి తెలుసుకోండి. “నో యువర్ క్యాండిడేట్” అనే నినాదంతో అభ్యర్థుల చరిత్రలు తెలుసుకోవాలి అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కాలరాసిన అప్పటి జాతీయ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ సుప్రీంకోర్టు తీర్పును తిరగరాసి రాష్ట్రపతి ఇచ్చిన ఆర్డినెన్స్ ను వ్యతిరేకిస్తూ ఆ ఆర్డినెన్స్ కాపీని తగలబెట్టి ప్రజాస్వామ్య బద్ధంగా తమ నిరసనను ప్రభుత్వాలకు తెలియపరిచింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మొట్టమొదటి ప్రజాస్వామ్య ఉద్యమాన్ని ఆ ఆర్డినెన్స్ దగ్ధం ద్వారా లోకసత్తా ప్రజల ధర్మాగ్రహాన్ని ప్రదర్శించింది. చట్టసభలకు పోటీ చేసే అభ్యర్థులతో పాటి స్థానిక ప్రభుత్వాలకు పోటీ చేసే వారితో సహా అభ్యర్థుల ఆస్తులు అప్పులు, విద్యార్హత నేర చరిత్రతో సహా అభ్యర్థుల సమగ్ర సమాచారం గురించి తెలుసుకునేలా ఒక కొత్త మార్పుకి ఆ ఆర్డినెన్స్ దహనం ఉపకరించింది. ఇప్పుడు మనం అనుభవిస్తున్న హక్కులు ఏ ఉద్యమాల ద్వారా వచ్చాయో ఇప్పటి తరానికి తెలియకపోవచ్చు కానీ దాని వెనుక చరిత్రను దాచిన దాగని సత్యాన్ని లోక్‌సత్తా ఆచరణాత్మకంగా నిరూపించింది. అదేవిధంగా న్యాయ, పోలీసు సంస్కరణ విషయంలో అనేక నూతన ప్రతిపాదనలు ముందుకు తెచ్చింది. ప్రభుత్వం ముందు ఆ ప్రతిపాదనలు ఉంచింది. ప్రతి దానికి ప్రజా ఉద్యమం అవసరం లేదు కొన్నిసార్లు రాజకీయ పార్టీలతో లాబీయింగ్ ద్వారా “అడ్వకసి” ద్వారా కూడా సంస్కరణలను సాధించవచ్చు. అని 93వ రాజ్యాంగ సవరణ చట్టసభల ద్వారా రావడానికి దోహద పడింది. పార్టీ ఫిరాయింపుల చట్టం నుంచి మొదలుకొని అవినీతి నిరోధక చట్టాల వరకు అనేక రాజ్యాంగ సవరణల ద్వారా రాజకీయ పాలనా సంస్కరణలకు లోక్‌సత్తా దారి చూపించింది. అదొక్కటే కాదు రెండవ పాలనా సంస్కరణల దిశలో సోనియాగాంధీ చైర్ పర్సన్‌గా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశంలో ఏర్పడిన అప్పటి యూపీఏ 1 గవర్నమెంట్ లోని న్యాయశాఖ మంత్రి వీరప్ప మొయిలీ ఆధ్వర్యంలో ఏర్పడిన రెండవ పాలనా



సంస్కరణల కమిటీలో డాక్టర్ జయప్రకాష్ నారాయణ సభ్యులుగా ఉన్నారు. దేశవ్యాప్తంగా నిశ్శబ్దంగా క్రమశిక్షణతో ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకొని రెండవ పాలన సంస్కరణల ఉద్యమానికి కూడా లోక్‌సత్తా దోహద పడింది. అందులోంచి వచ్చిన సారమే గ్రామీణ న్యాయాలయాల వ్యవస్థ.కానీ ఆ సంస్కరణను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైన సందర్భంగా ఇంకా ఆ సంస్కరణ జరగాల్సిన ఆవశ్యకత బాకీ ఉంది. అలాగే న్యాయ సంస్కరణలలో భాగంగా హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జిల నియామక ప్రక్రియను సవాలు చేస్తూ దానికి ఒక చక్కటి పరిష్కారాన్ని సూచిస్తూ “జ్యుడీషియరీ అపాయింట్మెంట్ కమిషన్” ఏర్పాటుకు ప్రతిపాదించింది. నిష్పక్షపాతంగా అవినీతి లేకుండా స్వతంత్ర వ్యవస్థ ద్వారా న్యాయమూర్తుల నియామక కమిషన్ ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా సూచించింది. దానికి అనుగుణంగానే కేంద్ర ప్రభుత్వం చట్టం చేసి పెడితే దుర్మార్గంగా ఆనాటి సుప్రీంకోర్టు ఆ చట్టాన్ని తిరస్కరిస్తూ తమ నియామకాన్ని స్వయంగా తామే చేసుకుంటామని తేల్చి చెప్పింది. ఇది సరి అయింది కాదని సుప్రీంకోర్టు తీర్పును కూడా వ్యతిరేకించి ప్రజల పక్షాన లోక్‌సత్తా నిలబడింది. ప్రస్తుతం ఆ దుష్పరిణామాలను మన దేశం అనుభవిస్తుంది. ఇటీవల ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వర్మ ఇంట్లో తగలబడ్డ అంతులేని నోట్ల కట్టల కేసు న్యాయ వ్యవస్థలోని రాచపుండుకు ఒక బహిర్గతమైన ప్రత్యక్ష ఉదాహరణ. న్యాయమూర్తుల నియామకం గురించి ఒక స్పష్టమైన అవగాహనతో లోక్‌సత్తా ప్రతిపాదించిన స్వతంత్ర న్యాయమూర్తుల నియామక సంఘాన్ని ఏర్పాటు చేసే క్రమంలో ఇలాంటి సంఘటనలు మన ప్రతిపాదనలకు మరింత ఊతమిస్తాయి. అందుకే ఏ సంస్కరణకైనా రాజకీయ పార్టీల స్వార్థం కూడా పనికి వస్తుంది. అందుకే ఇప్పటిదాకా మనం ప్రతిపాదిస్తున్న దామాషా పద్ధతిలో ఓటింగ్ అనే అంశం కూడా మళ్లీ తెరపైకి వస్తుంది. దేశవ్యాప్తంగా జరుగుతున్న ‘ఒకే దేశం..ఒకే ఎన్నిక’ అనే

నినాదంతో జమిలి ఎన్నికల చర్చ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ఫస్ట్ ఫాస్ట్ ద పోస్ట్(FPTP) విధానంలో ఎన్నికల వల్ల అభ్య ర్థులే ప్రాధాన్యత వహిస్తారని పార్టీల సిద్ధాంతాలకు తక్కువ ప్రాధాన్యత ఉంటుందని తేటతెల్లం చేస్తూ దామాషా పద్ధతిలో ఎన్నికలు జరిగితే ఎన్నికల్లో మద్యం డబ్బు ప్రమేయం తగ్గించవచ్చని అనేక ఉదాహరణలు ఇస్తూ ఒక సంస్కరణల పత్రాన్ని ప్రతిపాదన రూపంలో దేశవ్యాప్తంగా లోక్‌సత్తా చర్చకు పెట్టింది. ఎన్నికల సంస్కరణలకు రాజ్యాంగ సవరణలు అవసరం లేదని కేవలం ప్రస్తుతం మనకు ఉన్న రెప్రజెంటిటీ ఆఫ్ పీపుల్స్ యాక్ట్ ప్రజా ప్రాతినిధ్య చట్టంలో చిన్న మార్పు ద్వారా ఎన్నికలు ఏ విధంగా జరపాలి అని సవరణ చేసుకోవచ్చని చిన్న కీలకమైన అంశాన్ని కూడా లోక్‌సత్తా ప్రస్తావించింది. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే పెత్తనం చేయవద్దని గాంధీ మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యం నెరవేరాలంటే స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు కావాలని ఫంక్షన్స్,ఫంక్షనరీస్, ఫండ్స్ అనే మూడు "F"ల సిద్ధాంతాన్ని లోక్‌సత్తా ప్రతి పాదించింది. అందుకు అనుగుణంగానే స్థానిక ప్రభుత్వాల సాధికారత ఉద్యమాన్ని 2001లో ప్రారంభించి దానికి మద్దతుగా ఉద్యమించి రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా ఒక కోటి తొమ్మిది లక్షల సంతకాలను సేకరించింది. ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు ఆనాటి ప్రతిపక్షంలో ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి లను ఒప్పించి వచ్చే ఎన్నికల తర్వాత స్థానిక ప్రభుత్వాలకు సరైన అధికా రాలు ఇస్తామని వాగ్దానాన్ని 2004 ఆయా పార్టీల ఎన్నికల మేనిఫెస్టోలలో పెట్టించగలిగింది.

ఏ ఉద్యమాలకైనా కేవలం వీధి పోరాటాలు మాత్రమే తగవని రాజకీయ పార్టీలను ప్రజాస్వామ్య ఉద్యమాల ద్వారా మెడలు వంచి ఆయా సంస్కరణలను సాధించవచ్చని లోక్‌సత్తా నిరూపించింది. అందుకే భారత జాతీయ ఉద్యమంలో మనం బ్రిటిష్ వారితో పోరాడిన పోరాట రూపాలను పద్ధతులను స్వతంత్ర భారతదేశంలో మన పాలకుల మీద ఆ పోరాట రూపాలను అనుసరించడం మంచిది కాదని లోక్ సత్తా ప్రతిపాదించింది. న్యాయమైన ప్రజా సమస్యల మీద ప్రభుత్వాలతో పోరాడాలంటే రాస్తారోకోలు, ఆస్తుల విధ్వంసాల ద్వారా సాధ్యం కాదని ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని సాధించాలంటే అంతకంటే ఉన్నతమైన మార్గాన్ని అనుసరించాలనే గాంధీ సూక్తిని లోక్‌సత్తా మరోసారి వల్లిం చింది. నేటి ప్రజాస్వామ్య ప్రభుత్వాలపై పోరాట రూపాలను కొత్తగా తయారు చేసుకోవాలని నిరసన కార్యక్రమాలని సరికొత్తగా రూపొందించుకోవాలని ఆచరణాత్మకంగా రుజువు చేసింది. అందుకే తమ న్యాయమైన కోరికలను వ్యక్తం చేయడానికి ప్రజా బహుళ్యంలోకి తీసుకెళ్లడానికి




రోడ్డు పక్కన క్రమశిక్షణతో ఇద్దరు జట్టు కట్టి తమ న్యాయ మైన డిమాండ్లను ప్ల కార్డుల ద్వారా ప్రదర్శిస్తూ రోడ్డు పక్కన ఒకే వైపు నడుస్తూ ట్రాఫిక్‌కి అలాగే ప్రజా జీవితానికి సామాన్య ప్రజల హక్కులకు ఎలాంటి అనంతరాయం కలగకుండా తమ నిరసనను వ్యక్తం చేయవచ్చని ఆచరణా త్మకంగా లోక్‌సత్తా రుజువు చేసింది.

"విషయ పరిజ్ఞానం' సంఘటితం- ఉద్యమం" అనే నినాదంతో ప్రజలలో ఆయా సమస్యల పట్ల విషయపరిజ్ఞానం కల్పించి వారిని సంఘటితం చేసి దానికి ఉద్యమ రూపమిస్తే ఆ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని లోక్‌సత్తా భావిస్తుంది. దీనికి అంబేద్కర్ స్ఫూర్తి ఎందుకంటే ఆనాడు "బోధించు సమీకరించు పోరాడు" అనే అంబేద్కర్ సూక్తిని లోక్‌సత్తా ఈ విధంగా విషయపరిజ్ఞానంతో ప్రజలను సంఘటిత పరచి ఉద్యమానికి సమర్థం చేస్తే సరైన ఫలితాలు వస్తాయని అనేక ఉద్యమాలను విజయవంతం చేయడం ద్వారా రుజువు చేసింది.

లోక్‌సత్తా ఉద్యమ సంస్థకు చాలా సార్లు అనేక సవాళ్లు ఎదురయ్యాయి. 1999లో రాష్ట్రంలోని అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థుల నేర చరిత్రను శాస్త్రీయంగా పోలీసు కేసుల రుజువులతో సహా బయట పెట్టినప్పుడు పెద్ద ఎత్తున లోక్ సత్తా మీద విమర్శలు వచ్చాయి. కానీ ఆ ప్రక్రియ ఎంత శాస్త్రీయంగా జరిగిందో రుజువులతో సహా చూపించిన తర్వాత ఒక్కరు కూడా తాము నేర చరిత్ర నిరూపించ లేకపోవడంతో పాటు ఇంకా మాలాంటి వారు చాలామంది బయట ఉన్నారు వారి పేర్లు ఎందుకు పెట్టలేదు అని లోక్ సత్తాను ప్రశ్నించారు. దానికి మీరు ఎవరి పేర్లు బయట పెట్టలేదని ఆరోపిస్తున్నారో వారికి సంబంధించిన నేర చరిత్రను మీరు ఆధారాలు సమర్పిస్తే తప్పక వారి గురించి కూడా బయటపెడతామని ఆయా విమర్శలకు విమర్శ కులకు సవినయంగా లోక్‌సత్తా ప్రతి సమాధానమిచ్చింది. లోక్‌సత్తా ఏర్పడిన మొదటి 10 ఏళ్లలో ఒకే ఒక్క ప్రశ్న ఎదురయ్యేది రాజకీయాలు పవిత్రమైన వ్యాసంగం అంటున్న మీరే ఆ రాజకీయ ప్రక్షాళన కోసం రాజకీయాలలోకి ఎందుకు దిగరు అని కొందరు ప్రశ్నించేవారు. అవును నిజమే రాజకీయ పార్టీలు అతిపెద్ద స్వచ్ఛంద సంస్థలు అని రాజకీయ పార్టీల నాయకులు ఈ విషవలయంలో చిక్కుకొని

ఊపిరాడక బయటకు రాలేకపోతున్నారని రాజకీయాన్ని అసహ్యించుకునే దానికంటే రాజకీయాన్ని ప్రేమించాలి అనే లోక్‌సత్తా ఉద్యమ భావజాలాన్ని మనం ప్రేరేపించాం కనుక ప్రజల నుంచి కూడా అలాంటి ప్రశ్నలు వచ్చాయి. రాజకీయాలపై గట్టున కూర్చుని రాళ్లు వేయడం కాదు మీరు అందులో దిగితే తెలుస్తుందని కొంతమంది రాజకీయ నాయకులు, పార్టీలు మనల్ని ప్రశ్నించాయి. దానికోసం కాదు గాని రాజకీయాలు మార్పు చెందాలంటే రాజకీయ పార్టీని మనమే ఎందుకు స్థాపించకూడదనే ఆలోచన లోక్ సత్తా ఉద్యమ సంస్థ వర్గాలలో ఉదయించింది. దాంతో 2006లో అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా లోక్ సత్తా రాజకీయ పార్టీగా అవతరించింది. రాజకీయ పార్టీ ఏ సిద్ధాంతాల ప్రకారం పని చేస్తుందో వెల్లడించడమే కాకుండా దేశ స్వాతంత్ర ఉద్యమాన్ని సామాజిక ఉద్యమాలను ప్రేరేపించిన ఇద్దరు నాయకులు ఒకరు గాంధీ మరొకరు అంబేద్కర్. వీరిద్దరిని ఆదర్శంగా తీసుకొని వ్యవస్థ మారాలంటే వ్యక్తితో పాటు వ్యవస్థలో మార్పు రావాలని కోరిన గాంధీ అంబేద్కర్ ఫోటోలను పార్టీ లెటర్ ప్యాడ్ లోగో మీద ముద్రించింది. లోక్ సత్తా ఉద్యమ బావుటా లోగో లో ఎలాంటి లక్ష్యాలు పెట్టుకున్నామో అవే లక్ష్యాలతో మరింత విస్తృతపరచుకున్న లోక్‌సత్తా పార్టీ లోగోను కూడా తయారు చేసుకున్నాము. మనం లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని సాకారం చేసుకోవాలంటే దగ్గరగా ఉన్న మినుగురు పురుగుల సహాయంతో కాదు దూరంగా ప్రకాశిస్తున్న నక్షత్రాలను లక్ష్యంగా చేసుకొని వెళ్ళాలి అని ప్రతిపా దించుకొని ప్రజాస్వామ్యంలోనే స్వేచ్ఛ ప్రజల నిర్ణయా ధికారం ప్రజల భాగస్వామ్యం చట్టబద్ధ పాలన స్వయం నిర్ణయాధికారం అనే ఐదు మూల సూత్రాలకు గుర్తుగా ఐదు కోణాలతో ఉన్న నక్షత్రం గుర్తును పెట్టుకొని లోగోను తయారు చేసుకున్నాము. దానికి తోడు అర్థవంతమైన ఆలో చనలకు రంగుల ప్రభావం ఉంటుంది కనుక నూతన ఆలో చనకు గుర్తుగా సముద్రపు నీలం రంగును మనం ఉద్యమ సంస్థతోపాటు పార్టీ లోగోలో కూడా పెట్టుకుని ఆ లక్ష్యంతో ముందుకు సాగాం. అలా లక్ష్యాలకు అనుగుణంగా అటు ఉద్యమ సంస్థ ఇటు పార్టీ లోగోలను తయారు చేసుకొని ప్రజా ఉద్యమాలలో తనదైన రీతిలో ముందుకు సాగిన లోక్ సత్తా పార్టీ ఎన్నికల గుర్తును కూడా అదే రకంగా విజిల్ బ్లోయర్ గా ప్రజలను అభివర్ణిస్తూ ఈల గుర్తులు పార్టీ ఎన్నికల గుర్తుగా స్వీకరించాము. అలా దేశంలో జరిగిన నాలుగోవ నియోజకవర్గాల పునర్విభజన తర్వాత 2009 వచ్చిన అసెంబ్లీ ఎన్నికల్లో 254 అసెంబ్లీ నియోజకవర్గాలలో పోటీ చేసి హైదరాబాదులో కూకట్‌పల్లి అసెంబ్లీ నియో జకవర్గం నుండి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ గారిని




గెలిపించుకున్నాము. మిగతా నియోజకవర్గాల్లో గౌరవ ప్రదమైన ఓట్లు వచ్చాయి. కానీ గెలుపునకు అవసరమైన ఓట్లు పడలేదు. దానికి ఓటర్లను ప్రజలను నిందించకుండా ప్రజలకు లోక్‌సత్తా లక్ష్యాలను ఆశయాలను సరిగ్గా వివరించలేకపోయాము అని పార్టీ వైఫల్యంగా మాత్రమే చూశాము కానీ దానికి ప్రజలను బాధ్యులను చేయలేదు. అయినా సరే ఆనాటి ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా లోక్‌సత్తా పార్టీకి రాష్ట్రవ్యాప్తంగా పోటీచేసిన అన్ని నియోజకవర్గాలలో కలిపి వచ్చిన ఓట్లు ఎంఐఎం, ఉభయ కమ్యూనిస్టు పార్టీలకు వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ. ఆ ఓట్లు అన్ని నియోజక వర్గాలలో కలిపి వచ్చినవి కనుక సీట్లు రావడానికి అవకాశం రాలేదు. అలా రెండవసారి 2014 ఎన్నికల్లో కూడా పరిమిత స్థానాల్లో పోటీ చేసిన కూడా అనుకున్న ఫలితాలను సాధించ లేకపోయాము. కానీ ఆ తర్వాత వచ్చిన ఎన్నికలలో మన బలం సరిపోవడం లేదు కనుక ప్రజలలో ఇంకా మమేకమై పని చేసిన తర్వాత మాత్రమే ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయం తీసుకొని 2018, 2023-24 ఎన్నికల్లో మనం పోటీ చేయలేదు. ప్రజలలో మన భావజాలం ఇంకా విస్తరించే దాకా మనం మన పరిమిత శక్తుల్ని వనరులను ఈ రాజకీయ పోటీలో పెడితే వ్యక్తులుగా మాత్రమే కాదు ఉద్యమంగా కూడా నష్టపోతామని భావించి ఎన్నికల రాజకీయాలకు దూరంగా ఉన్నాము. కానీ ప్రజా ఉద్య మాలకు కానీ ప్రజాబాహుళ్యంలో లోక్‌సత్తా భావజాలాన్ని విస్తరించడంలో గాని లోక్‌సత్తా ఎప్పుడు వెనుకకు పోలేదు, వెనకడుగు వేయలేదు. ఇప్పటికీ ముందుకే పోతున్నాం. అందుకే లోక్‌సత్తా భావజాలానికి బలం ఉంది. ఆ బలాన్ని ప్రజల వద్దకు తీసుకుపోయే వాహ కాలుగా ప్రజలను తయారు చేయడమే తరువాయి. ప్రజా స్వామ్యంలో చాలా సమస్యలు ఉన్నాయి. ప్రజాస్వామ్యం తప్పు కాదు ప్రజా స్వామ్యంలో సమస్యలకు మరింత ప్రజా స్వామ్యమే మంచి మందుగా లోక్‌సత్తా భావిస్తుంది. కనుక ప్రజాస్వామ్యం లోని లోపాలను పరిహరించడానికి మరింత ప్రజాస్వామ్యం మంచి మందుగా ముందుకు పోతున్నాము. ✴

# భారత్‌కి కావలసింది ఎక్కువ నైపుణ్యాలు, ఆర్థికాభివృద్ధి ... ఎక్కువ జనాభా కాదు

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



భారత్‌లో జననాల సంఖ్య పెంచాలని దేశంలోని రాజకీయ ప్రముఖులు కొందరు ఇటీవల పదేపదే విజ్ఞప్తి చేస్తున్నారు. 'ఇంకా ఎక్కువమంది పిల్లల్ని కనండి' అంటూ కుటుంబాల్ని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, ఎంకె స్టాలిన్ కోరుతున్నారు. ఎక్కువమంది పిల్లల్ని కంటే, ప్రభుత్వం తరపున ప్రోత్సాహకాల్నీ అందిస్తున్నారు. తమ రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేట్లు (ఒక మహిళ సంతానోత్పత్తి వయసులో కనే పిల్లల సంఖ్య) భర్తీ చేయగల స్థాయి 2.1 కంటే తగ్గిపోయాయని, దీనివల్ల కాలక్రమంలో పనిచేసే వయసు జనాభా తగ్గిపోయి ఆర్థికాభివృద్ధిని దెబ్బతీయవచ్చుని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ రకమైన భయాల నుంచే ఎక్కువమంది సంతానం అనే ప్రచారం మొదలైంది. వీరు తమ పిలుపుకి మద్దతుగా చెబుతున్న మరో వాదన .. జనాభాలో తమ రాష్ట్రాల వాటా తక్కువగా ఉంటే జాతీయ స్థాయి చట్టసభలో ప్రాతినిధ్యం తగ్గుతుంది, యూనియన్ ప్రభుత్వం నుంచి వచ్చే వనరులు తగ్గుతాయి అని. సంతాన సాఫల్య రేట్లని, తద్వారా జనాభాని పెంచాలన్న ఈ విజ్ఞప్తులు తీవ్ర, దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశమున్నందున జాగ్రత్తగా విశ్లేషించటం అవసరం.

50ఏళ్లక్రితం నేను వైద్య విద్యార్థిగా ఉన్నప్పుడు మా తరంలోని అనేకమంది అడ్డూ అదుపులేని జనాభా పెరుగుదల గురించి తీవ్రంగా మథనపడే వాళ్లం. జన విస్ఫోటనంపై పీడకలలు వస్తుండేవి.

1976 లెక్కల ప్రకారం భారతదేశ జనాభా 54.8 కోట్లు. కేవలం 54 ఏళ్లలో ఈ సంఖ్య 146 కోట్లకు చేరింది. మా భయాలు రుజువయ్యాయి. మన దేశ జనాభా 2.7 రెట్లు పెరిగింది! ఇదే సమయంలో, ప్రపంచ జనాభా 369 కోట్లు (1970) నుండి 820 కోట్లకు (2024) పెరిగింది. అంటే, 2.2 రెట్లు. నిజానికి, అంతకు ముందెన్నడూ లేనిస్థాయి జనాభా పెరుగుదలను 20వ శతాబ్దం ప్రపంచవ్యాప్తంగా చూసింది. 1900 సంవత్సరంలో 160 కోట్లున్న ప్రపంచ జనాభా 2000 నాటికి 617 కోట్లకు చేరింది. ఒక శతాబ్ద కాలంలో నాలుగు రెట్ల న్నమాట. 2000 సంవత్సరం నుండి కేవలం 24 ఏళ్లలో మరో 200 కోట్ల జనాభాను మనం మానవాళికి జత చేసుకున్నాం.

**కాలక్రమంలో ప్రపంచ జనాభా (అంచనా)**

| సంవత్సరం | జనాభా |
|---|---|
| క్రీ.పూ. 1,00,000 | 2,50,000 |
| క్రీ.పూ. 70,000 | 10,000 |
| క్రీ.పూ. 10,000 | 40 లక్షలు |
| క్రీ.పూ. 1000 | 5 కోట్లు |
| క్రీ.శ. 1500 | 50 కోట్లు |
| క్రీ.శ. 1800 | 90 కోట్లు |
| క్రీ.శ. 1900 | 160 కోట్లు |
| క్రీ.శ. 2000 | 617 కోట్లు |
| క్రీ.శ. 2024 | 830 కోట్లు |

జనాభా పెరుగుదల తీరుని చరిత్ర ముందుకాలం నుండి స్థూలంగా పరిశీలిస్తే, జనాభా విస్ఫోటనంపై మనకు కొంత స్పష్టమైన అంచనా వస్తుంది. 1900 నాటికి మనం కేవలం 160 కోట్లకు చేరుకున్నాం. 20వ శతాబ్దం ఆరోగ్య సంరక్షణ రంగంలో అద్భుత ప్రగతిని సాధించటంతో జీవిత కాలాలు పెరిగాయి. శిశు మరణాల్ని నివారించగలిగారు. కానీ జననాల రేటు మాత్రం అత్యధిక స్థాయిలో కొనసాగాయి. ఫలితంగా ఒక శతాబ్ద కాలంలో జనాభా నాలుగు రెట్లు విస్ఫోటనం చెందింది. కనీవినీ ఎరగని స్థాయి అది.

భవిష్యత్తులోనూ ఎప్పుడూ పునరావృతంకాని స్థాయి. జనాభా పెరుగుదల కోణం నుంచి చూస్తే 20వ శతాబ్దం అత్యంత ప్రత్యేకమైనది. అటువంటి విస్ఫోటక వృద్ధి వల్ల - భారత్ లో కావచ్చు, ప్రపంచవ్యాప్తంగా కావచ్చు - జనాభా మనుగడ అసాధ్యమవుతుంది.

భూతాపం పెరుగుతోంది. వాతావరణ మార్పులు తీవ్రమవుతున్నాయి. 75 ఏళ్ల పాటు ప్రపంచం చూసిన అసాధారణ వృద్ధి, ప్రగతి అదే స్థాయిలో కొనసాగుతాయని ఆశించటం ఈ నేపథ్యంలో మూర్ఖత్వమవుతుంది. మానవాళి ప్రస్తుతం భూగోళంపై ఆధిపత్యం చెలాయి స్తోంది. భూమ్మీద ఉన్న క్షీరద జీవరాశులన్నిటిలో మనుషులు, వారు పెంచే జంతు జీవాలే 96% మేర ఉన్నాయి. దిగ్భ్రాంతికర వాస్తవమిది. మిగిలిన క్రూరమృగాలు, వగైరా క్షీరదాలన్నీ కలిపినా 4% వరకు మాత్రమే ఉంటాయి!. మనం ఇప్పటికే పర్యావరణ పరంగా పెను అస్తిత్వ సంక్షోభ దశను ఎదుర్కొంటున్నాం.

భారత్ గత 40 ఏళ్లకు పైగా కుటుంబ నియంత్రణ, జననాలు, సంతానోత్పత్తి రేట్లను స్వచ్ఛందంగా తగ్గించుకోవడంలో సమర్థతను కనబరిచింది. 1976లో 5.2 స్థాయిలో ఉధృతంగా ఉన్న మన సంతానోత్పత్తి రేటు, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1.94 సగటుకు పడిపోయింది. ప్రతి రాష్ట్రం, ప్రతి వర్గం కులం, మతం, భాష, తెగలకు అతీ తంగా - తక్కువ సంతానోత్పత్తి రేట్లను నమోదు చేస్తు న్నాయి.

కేవలం బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్‌లు 2.1 కంటే ఎక్కువ సంతానోత్పత్తి రేట్లను కలిగి ఉన్నాయి. ఆ రాష్ట్రాల్లో కూడా వచ్చే కొన్నేళ్లలో మనం 2.1 రేటు స్థాయిని చేరుకోబోతున్నాం. తాము కనాలనుకుంటున్న పిల్లల సంఖ్యను కుటుంబాలు ప్రపంచవ్యాప్తంగా స్వచ్ఛందంగా తగ్గించుకుంటున్నాయి. మహిళలకు మరింత స్వేచ్ఛ, మెరుగైన అక్షరాస్యత, ప్రగతి, ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు, పెరుగుతున్న ఆకాంక్షలు, పర్యావరణ ఆందోళనలు సంతానోత్పత్తి రేట్ల తగ్గుదలకు దారి తీస్తున్నాయి. ఈ విజయాన్ని మనం ఘనతగా భావించాలి, సంబరంగా జరుపుకోవాలి. వనరుల పరిమితిని, పర్యావరణ సంక్షోభాన్ని గుర్తించకుండా మానవ జనాభాను అనేక రెట్లు పెంచుకుంటూ పోవాలని కోరుకోవటం ఎంత అహేతుకమో ఇంగితజ్ఞానానికి సైతం అర్థమవుతుంది. అలాంటి దురాశ పెను వినాశకరం.

మనం నాగరిక మానవ స్థాయిలో ఆలోచించకుండా, గత శతాబ్దంలా 21వ శతాబ్దంలోనూ వేగంగా పెరిగితే.. ఊహించలేని, మనుగడ సాగించలేని, వినాశకర 2000 కోట్ల జనాభా సంఖ్యకు చేరుకుంటాం. ఇప్పుడు కూడా మనం 1040 కోట్లకు చేరుకోవచ్చు. ఈ సంఖ్య కూడా ఊహకందనంత ఎక్కువ. ప్రపంచ వనరుల్ని పలుచబార్చి, ప్రకృతిని కొల్లగొట్టి, పర్యావరణ విధ్వంసం కలిగించే స్థాయి సంఖ్య. భారతదేశంతో పాటు మానవాళి కూడా జనాభా (నియంత్రణ)లో అద్భుత విజయం సాధించే దశకు చేరుకున్నాయి. విజయం కోరల్లో నుంచి అపజయాన్ని లాగే మూర్ఖత్వాన్ని ప్రదర్శించటం తగదు.

సంతానోత్పత్తి రేట్లు మరీ తగ్గిపోతే, పనిచేసే వారి సంఖ్య తగ్గిపోవచ్చు. ఆధారపడేవారి సంఖ్య భవిష్యత్తులో పెరగొచ్చు. కానీ భారత్ అలాంటి స్థితిలో లేదు. ఏ రకంగా చూసినా.

ఒక్కటంటే ఒక్క రాష్ట్రంలో మన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించలేకపోతున్నాం. స్వతంత్రం వచ్చి ఇన్ని దశాబ్దాలయ్యాక కూడా, ఈ దేశంలోని 80 శాతం మంది బిడ్డల భవిష్యత్తు, వారు పుట్టిన పరిస్థితుల్ని బట్టే నిర్ణయం అవుతోంది, తప్పు వారిలో దాగివున్న ప్రతిభ, వారుపడే కష్టాన్ని బట్టి కాదు. వృథా అవుతున్న మానవ సహజ సామర్థ్యాల్ని వెలికి తీయటం మన ముందున్న గొప్ప సవాలు. నాణ్యమైన విద్యను అందించి, నైపుణ్యాన్ని సమకూర్చటంలో రాజ్య వ్యవస్థ పూర్తిగా విఫలమైన తరుణంలోే ఇంకా ఎక్కువ మంది పిల్లల్ని కనండి అంటూ ప్రభుత్వాలు ప్రోత్సహించటం అర్థరహితం. విపరీత పరిణామాలకు దారితీస్తుంది.

నైపుణ్యం ఉన్న కొద్దిమంది కూడా ఈవేళ తమ అర్హతకు తగినన్ని ఉద్యోగాలు పొందలేకపోతున్నారు. మన పాలనా వైఫల్యాలు, రాజకీయ సవాళ్లు ఆర్థికాభివృద్ధిని కుంటు పరుస్తున్నాయి. డిమాండ్‌కి తగ్గ ఉపాధి సృష్టి లేదు. దీనికి పార్టీల స్పందనను ఇంకా ఎక్కువమందిని ప్రభుత్వ ఉద్యోగాలకి తీసుకోవటం. మిగతా సమాజంతో పోలిస్తే భారీ జీతభత్యాల్ని, సౌకర్యాల్ని పన్ను చెల్లింపుదారుల డబ్బుతో ఫలితాలతో సంబంధం లేకుండా ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వటం - కేవలం పేదరికాన్ని కొనసాగిస్తుంది, దేశాన్ని దివాళా తీయిస్తుంది. ఈ నేపథ్యంలో, మరింత ఎక్కువమంది పిల్లల్ని కనండంటూ ప్రచారం, ప్రోత్సాహకాలు ఆర్థికంగా ఆత్మహత్యా సదృశ్యం, పర్యావరణపరంగా విధ్వంసకరం.

కార్మికుల కొరతలు ఉంటే అంతర్గత వలసల్లో, ఉత్పాదకత పెంపుదలలో సమాధానం ఉంది. కార్మిక డిమాండ్‌కు తగ్గట్టు కాకుండా, అతి తక్కువమంది భారత్‌లో వలసలు సాగిస్తుంటారు. వలసల్ని సులభతరం చేసే పరిస్థితుల్ని మనం కల్పించాలి. చిన్న పట్టణాల్ని ఆర్థిక కేంద్రాలుగా గ్రామాల మధ్య అభివృద్ధి చేయాలి. ఈవేళ మనకు విద్య, నైపుణ్యాలు, ఉత్పాదకత, మౌలిక వసతులు, పెట్టుబడులు, ఉద్యోగాల సృష్టి కావాలి తప్ప - ఇంకా ఎక్కువ జనాభా, దుష్పరిపాలన కాదు.

# పీజీఐ 2.0 పాఠశాల విద్యా సూచిక
# చివరి నుండి 2,3 స్థానాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్

**దేశవ్యాప్తంగా పాఠశాలల పనితీరు స్థాయిపై యూనియన్ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 'పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ 2.0' (పీజీఐ 2.0) లో చండీగఢ్ మొదటి స్థానంలో నిలువగా, మేఘాలయ చివరి స్థానంలో ఉంది. ఒకటి నుంచి పది వరకు గ్రేడులను నిర్ణయించగా మొత్తం 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఏ ఒక్కటీ తొలి నాలుగు గ్రేడ్‌లనూ అందుకోలేకపోయాయి.** పీజీఐని 2017లో ప్రారంభించారు. జాతీయ విద్యా విధానాన్ని (ఎన్ఈపీ) అమల్లోకి తెచ్చాక కొన్ని మార్పులు చేసి పీజీఐ 2.0 గా రూపొందించారు. పీజీఐ 2.0ను 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించి యూనియన్ విద్యా విద్యాశాఖ విడుదల చేసింది. 2017 నాటికి, ఇప్పటికీ విద్యలో ఫలితాలు కాస్త మెరుగై, రాష్ట్రాల మధ్య అంతరం కొంత తగ్గినా, మొత్తంగా ఇంకా చాలా మెరుగవ్వాల్సి ఉందని విద్యాశాఖ పేర్కొంది.

పీజీఐ 2.0 లో 73 సూచికల్ని (ఇండికేటర్లను) తీసుకున్నారు. దీన్ని మళ్లీ రెండు విభాగాలుగా చేశారు. అందులో మళ్ళీ సమాచార సేకరణకు వీలుగా ఆరు భాగాలుగా విభజించారు.

అభ్యసన ఫలితాలు ఒక విధానం కాగా పాలన, నిర్వహణ అంశాల్ని రెండో విభాగంలో చేర్చారు. వీటిల్లో అన్నిటికంటే అత్యంత ముఖ్యమైనదిగా అభ్యసన ఫలితాల్ని పరిగణించారు. ఈ విభాగంలో- విద్యా ప్రమాణాలు, అందుబాటు, మౌలిక వసతులు, సమానావకాశాలను చేర్చారు. అదే విధంగా, పాలన, నిర్వహణ విభాగంలో - పాలనా ప్రక్రియలు, ఉపాధ్యాయ విద్య, శిక్షణల్ని చేర్చారు. మొత్తంగా గ్రేడులకు 1000 పాయింట్లను గరిష్ట స్కోర్ గా నిర్ణయించారు. మొత్తం 73 ఇండికేటర్లలో చాలా సమాచారాన్ని యూడీఐఎస్ఈ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్) ప్లస్, ఎన్ఏఎస్ (జాతీయ అచీవ్‌మెంట్ సర్వే), పీఎం పోషణ్ పోర్టల్, ప్రబంద్ పోర్టల్, విద్యాంజలి పోర్టల్ ల నుంచి తీసుకున్నారు ఎన్ఈపీ అత్యధిక ప్రాధాన్యత నిచ్చిన విద్యా ప్రమాణాల కనుగుణంగా సంక్లిష్ట సమాచారాన్ని సమ్మిళితం చేసి సులభతర పద్ధతుల్లో నమోదుకు వీలు కల్పించారు. ఇందులో పెద్దగా కొత్త సమాచారం కనిపించక కనిపించదుగానీ కొత్త దృక్కోణం, 2017తో ఫలితాల్ని పోల్చి చూసుకోవటానికి అవకాశం లభిస్తాయి. విద్యారంగంలో రాత్రికి రాత్రి మార్పులు కనిపించవని, అయితే సక్సెస్ కి నిర్వచనం మార్చి అందుకు తగ్గ పునాదిని, మార్గాన్ని వేస్తే క్రమంగా మంచి మార్పులు మొదలవు తాయని తాజా 'అసర్' సర్వే కూడా తెలియచెప్తున్న నేపథ్యం లో పీజీఐ 2.0 ఫలితాలు ప్రాధాన్యత కలిగినవి.

మన దేశంలో మొత్తం 14.72 లక్షల పాఠశాలలుండగా, 98 లక్షల మంది టీచర్లు, 24.8 కోట్లమంది విద్యార్థులు ఉన్నారు. ఈ విద్యార్థుల సంఖ్య ఓ దేశ జనాభా అయితే ప్రపంచంలో 10వ స్థానంలో ఉంటుంది. ఈ నేపథ్యంలో, తమ నివేదికను చాలా పకడ్బందీగా, స్కూలు విద్యలో లోపాల్ని వెంటనే గుర్తించి రాష్ట్ర ప్రభుత్వాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, సమాజం సరిదిద్దుకోవటానికి వీలుగా రూపొందించామని పీజీఐ 2.0 వర్గాలు చెబుతున్నాయి. ఈ నివేదికల్లోని సమాచారాన్ని ఆయా రాష్ట్రాలు, యూటీల ప్రాజెక్టు డైరెక్టర్ల ఆమోదం కూడా తీసుకున్నాకే ఖరారు చేశారు.

ప్రతి ఇండికేటర్ కి 5 నుంచి 20 వరకు పాయింట్లు ఉండగా, ప్రతి విభాగానికి సంబంధిత పరిధిల్లో (డొమైన్) 80 నుంచి 200 పాయింట్లు వరకు కేటాయించారు. సాధ్యమైనంత వాస్తవికంగా, విద్యా ప్రమాణాల్ని,

| విభాగాలు | పరిధి | సూచికలు | మొత్తంపాయింట్లు |
|---|---|---|---|
| 1. అభ్యసనఫలితాలు | విద్యాప్రమాణాలు-నాణ్యత<br>అందుబాటు<br>మౌలికసదుపాయాలు, వసతులు<br>సమానావకాశాలు | 12<br>7<br>15<br>16 | 240<br>80<br>190<br>260 |
| 2. పాలన, నిర్వహణ | పాలనాప్రక్రియలు<br>ఉపాధ్యాయవిద్య, శిక్షణ (టిఈ&టి) | 15<br>8 | 130<br>100 |
| మొత్తం | | 73 | 1000 |

విద్యాసంస్థల పాలనాంశాల్ని నమోదు ప్రయత్నం చేశారు. పీజీఐ 2.0 లో ఈ స్కోరులను వివిధ గ్రేడ్ ల కింద విభజించారు. అత్యధిక స్థాయి స్కోర్ గ్రేడ్ ని 'దక్ష్' గా పేర్కొన్నారు. ఇందులో శాతం పరంగా చూస్తే, 91 % నుంచి 100% రావాలి. పాయింట్లు పరంగా, 941 నుంచి 1000. మొత్తం పది గ్రేడ్ ల వివరాలు:

**ఏ రాష్ట్రం గ్రేడ్ ఏమిటి? పీజీఐ 2.0 సారాంశం**

పీజీఐ 2.0 లో అత్యుత్తమ రాష్ట్రం/యూటీ ప్రచష్ట-1 పరిధిని

| మొత్తం పాయింట్లలో స్కోరు (%) | స్కోరు పరిధి | గ్రేడ్ |
|---|---|---|
| 91% నుండి 100% | 941-1000 | దక్ష్ |
| 81% నుండి 90 | 881-940 | ఉత్కర్ష్ |
| 71 నుండి 80 | 821-880 | అతి - ఉత్తమ్ |
| 61 నుండి 70 | 761-820 | ఉత్తమ్ |
| 51 నుండి 60 | 701-760 | ప్రచష్ట-1 |
| 41 నుండి 50 | 641-700 | ప్రచష్ట-2 |
| 31 నుండి 40 | 581-640 | ప్రచష్ట-3 |
| 21 నుండి 30 | 521-580 | ఆకాంక్షి-1 |
| 11 నుండి 20 | 461-520 | ఆకాంక్షి-2 |
| 10% వరకు | 401-460 | ఆకాంక్షి-3 |

దాట లేకపోయింది (701–760). పైన 1000 వరకు

**2023-24లో రాష్ట్రాలు/యూటీలు సాధించిన గ్రేడ్లు**

| గ్రేడ్- స్కోర్ పరిధి | ఆయా గ్రేడ్ లు సాధించిన రాష్ట్రాలు/యూటీలు | మొత్తం రాష్ట్రాలు/ యూటీల సంఖ్య |
|---|---|---|
| దక్ష (941-1000) | ఏ రాష్ట్రమూ లేదు | సున్నా |
| ఉత్కర్ష్ (881-940) | ఏ రాష్ట్రమూ లేదు | సున్నా |
| అతి-ఉత్తమ్ (821-880) | ఏ రాష్ట్రమూ లేదు | సున్నా |
| ఉత్తమ్ (761-820) | ఏ రాష్ట్రమూ లేదు | సున్నా |
| ప్రచష్ట-1 (701-760) | చండీగడ్ | 1 |
| ప్రచష్ట-2 (641-700) | ఏ రాష్ట్రమూ లేదు | సున్నా |
| ప్రచష్ట-3 (581-640) | పంజాబ్, ఢిల్లీ, గుజరాత్, ఒడిషా, కేరళ, దాద్రానగర హవెలి అండ్ దాద్రా, హర్యానా, గోవా, మహారాష్ట్ర, రాజస్థాన్ | 10 |
| ఆకాంక్షి-1 (521-580) | పుదుచ్చేరి, హిమాచల్ ప్రదేశ్, అండమాన్, నికోబార్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, లక్షద్వీప్, పశ్చిమ బంగ, మధ్యప్రదేశ్, సిక్కిం, ఉత్తరప్రదేశ్, జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, లడక్ | 14 |
| ఆకాంక్షి-2 (461-520) | తెలంగాణ, అస్సాం, జార్ఖండ్, త్రిపుర,మణిపూర్, ఛత్తీస గడ్, బీహార్, నాగాలాండ్, మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్ | 10 |
| ఆకాంక్షి-3 (401-460) | మేఘాలయ | 1 |

ఇంకా నాలుగు స్థానాలు న్నాయి. ప్రచష్ట–1లో ఉన్నది కూడా ఒక్క యూటీ మాత్రమే. ప్రచష్ట–2లోకి కూడా ఏ ఒక్క రాష్ట్రం చేరుకోలేకపోయింది.

చండీగఢ్ మాత్రమే ప్రచష్ట–1 గ్రేడ్ ను సాధించగా, 10 రాష్ట్రాలు/ యూటీలు ప్రచష్ట–3 గ్రేడ్ లో ఉన్నాయి. 14 రాష్ట్రాలు/ యూటీలు ఆకాంక్షి–1 గ్రేడ్ లో, 10 రాష్ట్రాల ఆకాంక్షి–2లో, ఒక్క రాష్ట్రం మాత్రం ఆకాంక్షి–3లో ఉన్నాయి. మొత్తంగా, 2022–23తో పోలిస్తే పీజీఐ స్కోర్ 2023–24లో 24 రాష్ట్రాలు/యూటీలకు మెరుగుపడింది. మిగిలిన 12 రాష్ట్రాలు, యూటీలకు దిగజారింది. రాష్ట్రాలు/ యూటీల వారీగా ఆ ఫలితాలు:

**2022–23తో పోలిస్తే 2023–24లో పీజీఐ స్కోర్ దిగజారిన రాష్ట్రాలు/ యూటీలు**

| రాష్ట్రం/యూటీ | దిగజారిన పాయింట్లు |
|---|---|
| జారండ్ | 4 |
| తమిళనాడు | 4 |
| లడక్ | 6 |
| మిజోరాం | 7 |
| కేరళ | 8 |
| ఉత్తరాఖండ్ | 12 |
| బీహార్ | 12 |
| పశ్చిమ బెంగాల్ | 14 |
| లక్షద్వీప్ | 33 |
| ఛత్తీస్‌గఢ్ | 39 |

**అండమాన్, నికోబార్ దీవులు 43**

2022–23లో గరిష్ట స్కోరు 678.8 పాయింట్లు కాగా 2023–24లో 703 పాయింట్లు. కనిష్ట స్కోరు రెండు విద్యా సంవత్సరాల్లో 401.6, 417.9 పాయింట్లుగా ఉంది.

**డొమైన్ల వారీగా** –మొత్తం 73 ఇండికేటర్లను రెండు విభాగాలుగా, ఆరు రకాల పరిధిల్లోకి (డొమైన్లు) విభజించారని ముందు అనుకున్నాం కదా! వాటిలో కీలకమైన విద్యా ప్రమాణాలకు సంబంధించిన డొమైన్లలో రాష్ట్రాలవారీ ప్రగతిని చూద్దాం.



**అభ్యసన ఫలితాలు:** అత్యంత కీలకంగా, పాఠశాలల, ఉపాధ్యాయుల, ప్రభుత్వాల, తల్లిదండ్రుల, మొత్తం సమాజం లక్ష్యంగా భావించే ఈ డొమైన్లలో ఛండీగఢ్, పంజాబ్, పుదుచ్చేరి ముందున్నాయి. ముందు వరుసలో అంటే తొలి స్థానంలో కాదు ు ప్రచష్ట–2లో, 6వ గ్రేడ్ లో ఉన్నాయి. వీటి తర్వాత ఏడవ గ్రేడ్ లో హర్యానా, జమ్ముకశ్మీర్ ఉన్నాయి (ప్రచష్ట–3). మిగతా అన్ని రాష్ట్రాలూ దిగువ స్థాయిలో ఉన్నాయి.

**అందుబాటు:** పాఠశాలలో అందుబాటు (ఎన్ రోల్ మెంట్, విద్యార్థుల కొనసాగింపు, తర్వాతి తరగతులకు ప్రమోషన్, బడి బయట ఉన్నవారిని గుర్తించి బడిబాటలోకి తీసుకురావటం) లో పుదుచ్చేరి అత్యుత్తమ స్థానంలో 941–100 పాయింట్లతో దక్ష్ గ్రేడ్ లో నిలిచింది. మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, ఒడిషా, తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, గోవా, కేరళ, లక్షద్వీప్ తదితర రాష్ట్రాలు/ యూటీలు 881–940 పాయింట్లతో తర్వాత స్థానంలో, ఉత్కర్ష్ గ్రేడ్ లో ఉన్నాయి. బీహార్, జార?ండ్ ఈ విభాగంలో గణనీయ ప్రగతిని సాధించి 2022–23లో ఉన్న అయిదవ స్థానం నుంచి 2023–24లో నాలుగో స్థానానికి, ఉత్తమ్ గ్రేడ్ లోకి చేరాయి.

**మౌలిక వసతులు:** ఉపయోగించుకోగలిగిన మరుగుదొడ్లు, సురక్షిత మంచినీరు, పరిశుభ్రత, విద్యుత్తు, కంప్యూటింగ్ పరికరాలు, ఇంటర్నెట్, గ్రంథాలయాలు, క్రీడా వనరులు, తగినన్ని తరగతి గదులు మొదలైన మౌలిక సదుపాయాలలో లింగ వివక్ష, దివ్యాంగుల పట్ల చిన్నచూపు లేకుండా అందుబాటులోకి తేవటంలో ఛండీగఢ్ 821–880 స్కోర్ తో అతి– ఉత్తమ్ గ్రేడ్ లో నిలిచింది. ఢిల్లీ, దాద్రా నగర్ హవేలీ 761–820 స్కోర్ తో ఉత్తమ్ గ్రేడ్ లో నిలిచాయి.

**సామాజిక న్యాయం, సమానావకాశాలు:** వివక్ష లేకుండా ప్రతిబిడ్డా ఎదిగేందుకు కీలకమైన ఈక్విటీ విభాగంలో దాదాపు ప్రతి రాష్ట్రం 881–940 స్కోర్ తో ఉత్కర్ష్ గ్రేడ్ లో నిలిచింది.

**ఉపాధ్యాయ విద్య–శిక్షణ:** నాణ్యమైన విద్యను పిల్లలకు అందించడంలో కీలకమైన ఉపాధ్యాయుల విద్య శిక్షణలో 91% – 100% తో కేరళ అగ్రస్థానంలో దక్ష్ గ్రేడ్ లో నిలిచింది. 81%–90% స్కోర్ తో గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ఉత్కర్ష్ గ్రేడ్ లో నిలిచాయి. 71% నుండి 80.9% అతి– ఉత్తమ్ గ్రేడ్ లో పంజాబ్, రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిషా నిలవగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా ఎక్కువ రాష్ట్రాలు 61% నుంచి 70% స్కోర్ తో ఉత్తమ్ విభాగంలో ఉన్నాయి. అస్సాం, నాగాలాండ్ అయిదవ గ్రేడ్ లో, మేఘాలయ ఆరవ గ్రేడ్ లో అతి తక్కువ స్థాయిలో ఉన్నాయి.

**తెలుగు రాష్ట్రాల పనితీరు**

పీజీఐ 2.0లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ 2022–23, 2023–24లో ఒకే గ్రేడ్ లో కొనసాగుతున్నాయి. మొత్తం పది గ్రేడుల్లో 489.3, 511.9 స్కోర్ లతో దిగువ నుంచి రెండో గ్రేడ్ 'ఆకాంక్షి–2'లో తెలంగాణ కొనసాగుతోంది. 544.4, 562.2 స్కోర్ లతో ఆంధ్రప్రదేశ్ దిగువ నుంచి మూడవ గ్రేడ్ 'ఆకాంక్షి–1'లో కొనసాగుతుంది.

**డొమైన్ల వారీగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ స్కోర్**

| రాష్ట్రం | సంవత్సరం | విద్యాప్రమాణాలు నాణ్యత (240) | అందు బాటు (80) | మౌలిక వసతులు (190) | సమానా వకాశాలు (260) | పాలన (130) | టీచర్ల శిక్షణ (1000)) |
|---|---|---|---|---|---|---|---|
| తెలంగాణ | 2022-23 | 36.6 | 60.5 | 52.9 | 215.9 | 58.1 | 65.2 |
| | 2023-24 | 36.6 | 67.1 | 74.7 | 219.4 | 44.7 | 69.4 |
| ఆంధ్రప్రదేశ్ | 2022-23 | 47.8 | 68.1 | 85.9 | 229.2 | 45.9 | 67.5 |
| | 2023-24 | 47.8 | 69.2 | 99.3 | 226.5 | 50.0 | 69.4 |

మొత్తంగా చూస్తే, తెలంగాణ, ఏపీ సహా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో విద్యా ప్రమాణాల పెరుగుదలకు ఎంతో కృషి అవసరమనిబీ ఈశాన్య రాష్ట్రాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని 2022–23, 2023–24 పీజీఐ 2.0 గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో ఇతర దేశాల నుండి చాలామేర, మన దేశంలోనే రాష్ట్రాలు పరస్పరం కొంతమేర

నేర్చుకోవాల్సిన అంశాలున్నాయని స్పష్టమవుతుంది. అదేవిధంగా, ఇందులోని డేటా కొంత ఇప్పటికే వెలువడిన ప్రామాణిక సర్వేలలోదే అయినా, డేటా విశ్లేషణ, విభాగాలవారీ విభజన జాతీయ విద్యా విధానం, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యాల సాధనకు అనుగుణంగా వినూత్నంగా, విద్యా ప్రమాణాల పెంపు లక్ష్యంగా ఉండటంతో– గత సర్వేలతో యధాతథంగా పోల్చి చూడలేం. యూనియన్ విద్యాశాఖ స్పష్టంగా చెప్పినట్లు ఎప్పటికప్పుడు పాఠశాల విద్యలో లోపాల్ని సరిదిద్దుకునేందుకు 91% నుండి 100% (941–1000 స్కోర్) స్థాయిలోకి అంటే మొత్తం పది విభాగాల్లోని మొట్టమొదటి గ్రేడ్ లోకి.. బట్టీ పట్టకుండా, కాపీ కొట్టకుండా, కాన్సెప్ట్ ల పట్ల నిజమైన అవగాహన, పరిజ్ఞానంతో ప్రతి రాష్ట్రం, యూటీ వచ్చేందుకు ప్రభుత్వాలు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, సమాజం చిత్తశుద్ధితో కృషి చేసేందుకు ఈ సర్వేని ఉపయోగించుకోవాలి.

## చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఏపీలో 'విద్యాశక్తి'




భావితరాలకు మెరుగైన భవిష్యత్తు అందించే లక్ష్యంతో 'విద్యాశక్తి' పథకాన్ని ప్రవేశ పెడుతున్నట్టు ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ తెలిపింది. విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాల ఎస్–జె కేంద్రంలో అయిదు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రం లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యలో వెనుకబడిన విద్యార్థులకు అదనంగా పాఠశాల వేళల తర్వాత ఆన్ లైన్ బోధనకు రూపొందించిన కార్యక్రమమే విద్యాశక్తి. గణితం, సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులలో రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలలు, 567 కేజీబీవీ, రెసిడెన్షియల్, మోడల్ స్కూళ్లల్లో విద్యాశక్తి అమలు చేస్తారు.

**10, 12 తరగతులకు కామన్ బోర్డు ఏర్పాటు చేయాలి**

పరీక్షల్లో విద్యార్థులు ఫెయిల్ శాతం ఎక్కువగా ఉన్న ఏడు రాష్ట్రాలు 10, 12 తరగతులకు కామన్ బోర్డు ఏర్పాటు చేసుకోవాలని యూనియన్ విద్యాశాఖ సూచించింది. గతేడాది ఆంధ్రప్రదేశ్, అస్సాం, కేరళ, మణిపూర్, ఒడిషా, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ లలో అనుత్తీర్ణతా శాతం ఎక్కువగా ఉందని తెలిపింది. 10, 12 తరగతులకు ఉమ్మడి బోర్డు ద్వారా ఉత్తమ ఫలితాలను సాధించుకోవచ్చుని పేర్కొంది.

## జిందాల్ రైతులకు ఉపాధి కల్పించాలి

జిందాల్ కర్మాగారం ఏర్పాటుకు 2008 లో సేకరించిన భూముల్లో చిన్న పరిశ్రమలు, రైతు కుటుంబాలకు వెంటనే ఉపాధి కల్పించాలని లోక్ సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సమస్యలపై జిందాల్ యాజమాన్యం కూడా న్యాయంగా వ్యవహరించాలన్నారు. లోక్‌సత్తా బృందంతో ఆయన కిల్తంపాలెం, చిన ఖండేపల్లి, ముసిడిపల్లి, చీడిపాలెం, పెద ఖండేపల్లి గ్రామాల్లో పర్యటించి రైతుల నుండి వినతి పత్రం స్వీకరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ లో లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ చొరవతో వేల మంది నిర్వాసితులకు శిక్షణనిచ్చిమరీ ఉద్యోగాల్లోకి తీసుకున్న విషయాన్ని బాబ్జీ గుర్తు చేశారు. 375 రైతు కుటుంబాలకు జిందాల్ యాజమాన్యం ఉపాధి కల్పించాలన్నారు. రైతుల ఆందోళనను ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యే కోళ్ల లలిత, ఇంఛార్జి మంత్రి అనిత పట్టించుకోకపోవటం విచిత్రమన్నారు.

**ప్రత్యేక అధికారి పర్యటన పట్ల హర్షం**

ఎస్.కోట మండలంలోని జిందాల్ అల్యూమిన కర్మాగార భూసేకరణలో అవకతవకలపై భీశెట్టి బాబ్జీ ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ అంబేద్కర్ ఏర్పాటు చేసిన ప్రత్యేక అధికారి పర్యటన పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని లోక్‌సత్తా నియోజకవర్గ అధ్యక్షుడు కాండ్రేగుల ప్రసాద్ తెలిపారు. స్థానిక రెవెన్యూ అధికారులకు రాజకీయ నేతలు వత్తాసు పలికినా, లోక్‌సత్తా మాత్రం వీటిపై లోకాయుక్త, ఏసీబీ స్థాయిలో పోరాడిందన్నారు. కార్యక్రమాల్లో విజయనగరం జిల్లా నేతలు తాత్రాజు రాజారావు, తుమ్మగంటి రామ్మోహన్, పౌర వేదిక కార్యదర్శి ఇప్పలవలస గోపి తదితరులు పాల్గొన్నారు.

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

# Good governance Vote Jugaad August 2025

## Jugaad Bharat United Voters

## Simplifying Democracy - Strengthening Unity

## స్వజాతీయ నమూనా మార్పు - Model Political System

**అత్తమీద కోపం దుత్తమీద అన్నట్టు, భారతప్రధాని కూడా తనలాటి మొండిఘటమేనని తెలియని అమెరికా అధ్యక్షులవారు భారతదేశం ఎగుమతి చేస్తున్న సరుకులపై దిగుమతి సుంకాన్ని భారీగా వడ్డించారు. ఇది అంతర్జాతీయ వాణిజ్య రంగంలో అమెరికన్ డాలర్ విలువను (తమ బంగారు-అమెరికా కోసం) స్థిరీకరించడానికి ప్రయోగించిన అమెరికా-రాజకీయ చతురనీతి. (ఎత్తుగడకాదు).** (strategy) **వ్యూహంగా భావించాలి. దీనిని సవాలుగా స్వీకరించి, (మన బంగారు-భారతదేశం కోసం) మరొక మిత్రదేశమైన రష్యానుండి డాలర్లకి-బదులు-రూబుల్స్** (Rubles) **ఇచ్చి క్రూడ్-ఆయిల్ దిగుమతి చేసుకోవడం-ద్వారా, అమెరికా షరతులకు లొంగకుండా చక్కని రాజనీతిని** (diplomacy) **ప్రదర్శించి, "ధైర్యే సాహసే లక్ష్మి" అని భారత ప్రధానిగారు నిరూపించారు. ఇది మన దేశం ఆర్థిక-స్వావలంబన దిశలో అభివృద్ధిచెందడానికి ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయం. మనదేశంలోని రెండు పార్టీలకు** (Congress & BJP) **ప్రత్యామ్నాయంగా సుపరిపాలన కోసం ప్రతిపాదిత జుగాడ్ ద్విపక్ష పార్టీ రాబోతున్నది. అందుకోసం ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి, 25 మంది భారత భాగ్య విధాతలుగా నమోదు కావాలి. అధికారపక్షం, విపక్షం రెండూ మన పార్టీలో ఉంటాయి. అదే ప్రతిపాదిత నమూనా మార్పు. మన ఓటుహక్కుకి అత్యంత రహస్యంగా, సంపూర్ణంగా రక్షణ ఉంటుంది.**

MLA **నియోజకవర్గం ప్రాతిపదికగా, భారత ఎన్నికల కమిషను చే గుర్తించబడిన ఓటర్లే క్రమశిక్షణతో పార్టీని పారదర్శకంగా నిర్వహించుకుంటారు. చట్టబద్ధపాలన, అధికార-వికేంద్రీకరణ, ఆర్థిక-వికేంద్రీకరణ పార్టీలోనే జరిగి తీరుతుంది.** Jugaad **పార్టీ కార్యకర్తగా నమోదు చేసుకోవాలంటే జీవితంలో ఒకేసారి తన కష్టార్జితమైన 10,000/ రూపాయిలు విరాళమివ్వగలిగి ఉండాలి. అంత స్తోమతులేనివారు జుగాడ్ ఓటరుగా ఒకేసారి రూ. 5,000 కానీ రూ. 2,000 కానీ ఇచ్చి మీ వంతు బాధ్యత మీరు స్వీకరించండి. ఈ సాహసోపేత నిర్ణయం జుగాడ్ ఓటర్లమైన మనం తీసుకోవాలి. నిరుద్యోగ సమస్యలేని ప్రణాళిక సిద్ధంగా ఉంది..**

**జుగాడ్ భావి భారత భాగ్య విధాతలు :** (Rs/-10,000 donors)

**Sarvasri: (1) M.PARTHASARATHY (2) K.SUBRAHMANYAM (3) Col.P.V.RAMANA RAO (4) U.SUBBA RAO (5) Prof.C.K.MURTHY (6) SYED ANSARI (7) Smt. D.KASTURI (8) K.SRINIVAS MURTHY (Rajahmundry AP) (9) Dr. VAMSI RAJ (Kakinada AP) (10) Dr.G.ABBAIAH (Kakinada AP)(11)KOTIKALAPUDI TARAKESH**

**జుగాడ్ ఓటర్లు : Sarvasri (1) JVL. NARAYANA (Nellore AP) (2) S.D.BABU (Tamilnadu) (3) T.SURYANARAYANA (Vizag AP) (4)Smt.D. SUBHADRA (5) M.RANGA RAO (6) M.SAI SUBBARAO (7) Smt.D.JANAKI (8) J.VENKATA RAO (Vijayawada AP) (9) P.NARASIMHA RAO (10) SAI SURYANARAYANA (Karnataka) (11) MSS KUMAR (12) Dr.U.V.KRISHNA MURTHY (13) M.RAMA RAO (14) NANDAN SRIDHAR (15) Smt.K.RAJESWARI (16) Smt.K.LAKSHMI (17) Justice CHANDRAKUMAR (18) K. VASUDEVA RAO (19) NARAGONI (20) D.KONDALA RAO (21) M.S. Narayana Rao (22) Sriram (Amalapuram AP) (23) P.Sunil (Bhimavaram AP) (24) Amaranath (25) B.Poorna Kumar Das (26) KHS Sarma (27) Metta Ramarao (Vizag, AP) (28) IR Rao (29) S Madhavarao (30) DRK Rao (31) Smt.P Amulya (32) pallela Devaraju (33) YSN MURTY (Kakinada, AP) (34) DV KOTESWARA RAO (35) Santosh M.Tech(36)Somanchi Radhakrishna**

**Contact: Jugaad Parthasarathy (9866416798) with (1) MLA Constituency name (2) your name and gender (3) your age (4) your. Cell No:**

advt

# స్కూలు విద్యలో భారత్ కి మరో వార్నింగ్ బెల్ 'పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్'

భారతదేశంలో పాఠశాల విద్యార్థుల అభ్యసన ప్రమాణాల్ని విస్తృతస్థాయిలో, వ్యవస్థీకృతంగా అంచనావేసిన 'పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ 2024' నివేదికను 2025 జూలై 2న విడుదల చేశారు. 'పరఖ్ (పెర్ఫార్మెన్స్ అసెస్ మెంట్, రివ్యూ అండ్ ఎనాలిసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హొలిస్టిక్ డెవలప్ మెంట్') ఆర్ఎస్ ను అంతకు ముందున్న 'జాతీయ అచీవ్ మెంట్ సర్వే' (ఎన్ఏఎస్) స్థానంలో తీసుకొచ్చారు. ఎన్ ఏఎస్ ప్రతి మూడేళ్లకోసారి స్కూల్ పిల్లల విద్యా ప్రమా ణాలను అంచనా వేసేది కాగా పరఖ్ ఆర్ఎస్ జాతీయ విద్యా విధానాన్ని (ఎన్ఈపీ 2020) అనుసరించి అభ్యసన ఫలితాల్ని అంచనా వేస్తుంది. మూడేళ్లకోసారి కాకుండా తరచూ పాఠశాల విద్యా ప్రమాణాల్ని మౌలిక స్థాయి నుంచి అంచనా వేస్తుంది. ఈ మొదటి పరఖ్ ఆర్ఎస్ డిసెంబర్ 4, 2024న దేశవ్యాప్తంగా జరిగింది. ఇందులో 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల (యూటీ) 781 జిల్లాలలోని 74,229 పాఠశాలల నుండి 21.15 లక్షల మంది పిల్లలు పాల్గొన్నారు. ఎన్ఏఎస్ 3, 6, 8 తరగతులకు సంబంధించి జరగ్గా పరఖ్ 3,6,9 తరగతుల విద్యార్థుల సామర్థ్యాల్ని పరీక్షించింది. జాతీయ విద్యా విధానం ప్రమాణాల కనుగుణంగా జరుగుతుండటంతో పరఖ్ 2024లోని 3వ తరగతి విద్యా ప్రమాణాల్ని మాత్రమే ఎన్ఏఎస్ 2017, 2021 ఫలితాలతో పోల్చవచ్చని (చివరి ఎన్ఏఎస్ 2021లో జరిగింది) 6,9 తరగతుల వివరాల్ని పోల్చటం వల్ల అంచనాలు తప్పే అవకాశముందని జాతీయ విద్యా సంస్థ పరిశోధన, శిక్షణా మండలి (ఎన్సీఈఆర్టీ) విడుదల చేసిన పరఖ్ నివేదిక స్పష్టంగా హెచ్చరించింది.

**పరఖ్ లో వెల్లడైన కీలకాంశాలు**

సానుకూలాంశాలతో మొదలైతే ఫౌండేషన్ స్థాయిలో పరఖ్ వెల్లడించిన వాస్తవాలు గతంలో కంటే కొంత ఆశాజనకంగా ఉన్నాయి. భాషకు సంబంధించి, బాలురు కంటే బాలికలు కొద్దిపాటి మెరుగుదలను సాధించారు. బాలికల సగటు స్కోరు 65% కాగా, బాలురది 63%. గణితంలో ఇద్దరూ 60% సాధించారు.

**ఆసక్తికరంగా మూడో తరగతి స్థాయిలో గ్రామీణ విద్యార్థులు** పట్టణ ప్రాంత సహచరుల కన్నా కొంత మెరుగైన ప్రదర్శన కనబరిచారు. నిపుణ్ భారత్ మిషన్ (నేషనల్ ఇనీషియేటివ్ ఫర్ ప్రొఫిషియన్సీ విత్ అండర్ స్టాండింగ్ ఇన్ న్యూమరసీ) తొలి స్థాయి విజయానికి ఇది సంకేతంగా భావిస్తున్నారు.



విద్యార్థులు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల చదువులకు వచ్చేసరికి యూనియన్ ప్రభుత్వ పాఠశాలలు గణనీయ ముందంజను కనబరిచాయి. అయితే గ్రామీణ - పట్టణ అంతరం, బాలురు- బాలికల మధ్య సామర్థ్య తేడాలు.. గ్రామాలు, బాలికల విద్యా ప్రమాణాలపై నిర్దిష్ట ప్రణాళికతో ప్రత్యేక శ్రద్ధ అవసరమని స్పష్టపరుస్తున్నాయి.

ఉన్నత పాఠశాల తరగతుల్లో గణితం, సైన్స్ బోధన ప్రమాణాల్ని మెరుగుపరచటం, బాలికల ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా సమ్మిళిత బోధనా పద్ధతుల్ని అనుసరించటం తక్షణావసరమని సర్వే సూచిస్తుంది.

2.7 లక్షల మంది ఉపాధ్యాయులు, స్కూలు లీడర్ల నుండి సేకరించిన సమాచారం డిజిటల్ పరికరాల వినియోగం, విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం చర్యలను కూడా విద్యావసరాల్లో భాగంగా గుర్తించాలని సూచించింది. కౌమార దశలో ఉన్న విద్యార్థులు ఎదుర్కొంటున్న భావోద్వేగ ఒత్తిడిపై పలుచోట్ల ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అదే విధంగా, ప్రత్యేక అవసరాలున్న పిల్లలు (సీడబ్ల్యూఎస్ఎన్) కోసం వ్యవస్థీకృత మార్పుల త్వరితగతి అవసరం కనిపించింది.

**3వ తరగతిలో అభ్యసన ఫలితాలు**

మూడవ తరగతి (గ్రేడ్ 3)లో విద్యార్థుల సామర్థ్యాల్లో గణనీయ ప్రగతి కనిపించింది. అంశం వారీ ప్రతిస్పందన

సూత్రాన్ని (ఐఆర్టీ) బట్టి చూస్తే, 57% విద్యార్థులు పీఆర్ఎస్ (పరఖ్ ఆర్ఎస్)లో గణనీయ సామర్థ్యాన్ని లేదా ఆ పైస్థాయి నైపుణ్యాన్ని కనబరిచారు. ఎన్ఏఎస్ 2021లో పోలిస్తే ఇది మంచి పెరుగుదల. 2021లో భాషలో 39%, గణితంలో 42% సామర్థ్యాన్ని మాత్రమే కనబరిచారు. భాషలో 47%, గణితంలో 53% సామర్థ్యాలు నమోదైన 2017 ఎన్ఏఎస్ తో పోల్చినా పీఆర్ఎస్ 2024 మెరుగ్గా ఉంది. ప్రాథమిక మూడో తరగతి స్థాయిలో పిల్లలు కొవిడ్ నష్టాల్ని అధిగమించినట్లు స్పష్టంగా అగుపిస్తుంది.

జాతీయ సగటు 2017 ప్రమాణాలు కంటే తక్కువగా ఉన్నా అనేక రాష్ట్రాలు, యూటీలు 2024లో రికార్డ్ స్థాయి ఫలితాలు నమోదు చేశాయి. వీటిలో పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, కేరళ, ఉత్తర్ ప్రదేశ్, మధ్యప్రదేశ్ మొదలైనవి ఉన్నాయి. పునాదిస్థాయి అభ్యాసంపై దృష్టి పెట్టటం, ఉపాధ్యాయ శిక్షణలో మెరుగుదల, ఎన్ఈపీ అనుసంధాన మిషన్ నిపుణ్ భారత్ ఈ పెరుగుదలకు కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. విద్యలో భారత్ హామీ ఇచ్చిన అంతర్జాతీయ ప్రమాణాలకు ఈ ప్రగతి బలమైన పునాదిగా పేర్కొనవచ్చు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలోని (ఎస్డీజీ) 4.1.7లో భారత్‌ని ఇది మరింత బలోపేతం చేస్తుంది . బాలబాలికలందరికీ చదవటం, గణితంలో పై చదువులకు తగిన మౌలిక ప్రావీణ్యాల్ని అందిస్తుంది.

**తరగతుల (గ్రేడ్లు) వారీ సామర్థ్యాలు**

**3వ తరగతి ప్రధానాంశాలు–**

**భాష:**

⏭ 67% మంది పిల్లలు సరైన పదాల్ని ఉపయోగించటంలో, కొత్త పదాల్ని ఊహించటంలో ప్రతిభను కనబరుస్తున్నారు.

⏭ 60% మంది చిన్నచిన్న కథల్ని సొంతంగా గ్రహించగలుగుతున్నారు.

⏭ 61% మంది వార్తల్ని, సూచనలు, ఇతర అవసరమైన సమా చారాన్ని చదవగలుగుతున్నారు.

**గణితం:**

⏭ విభిన్న స్వాభావిక ధర్మాలు కలిగిన వస్తువుల్ని 68% మంది సరిగా విభజించగలుగుతున్నారు.

⏭ 55% మంది పిల్లలు 99 వరకు అంకెల్ని వరుస క్రమంలో పేర్చగలుగుతున్నారు.

⏭ కేవలం 54% మంది హెచ్చవేతను పునరావృత కూడికగా అర్థం చేసుకోగలుగుతున్నారు.

⏭ సగం మంది పిల్లలు మౌలిక రేఖా గణితం (జామెట్రీ), సాధారణ ఆర్థిక లావాదేవీల్లో తడబడుతున్నారు.

**6వ తరగతి ప్రధానాంశాలు:**

**గణితం:**

⏭ అంకెల్ని స్థాన విలువ ఆధారంగా అమర్చటం కేవలం 54% మంది విద్యార్థులు చేయగలుగుతున్నారు.

⏭ సాధారణ భిన్నాన్ని కేవలం 29% మంది అర్థం చేసుకొని, సోదాహరణంగా వివరించగలుగుతున్నారు.

⏭ పూర్ణాంకాల వినియోగంతో నిజజీవిత సమస్యల్ని 38% మాత్రమే పరిష్కరించగలుగుతున్నారు.

**పర్యావరణ పరిజ్ఞానం:**

⏭ తమ చుట్టుపక్కల ప్రాకృతిక మూలాంశాల్ని 44% మంది గుర్తించగలుగుతున్నారు.

⏭ ప్రకృతిలో గుర్తించగలిగిన పరిశీలనాత్మక నమూనాలపై ప్రశ్నలు అడగటం, తదుపరి పరిణామాల్ని ఊహించటం కేవలం 38% చేయగలిగారు.

⏭ మార్కెట్లు, పాఠశాలలు, పంచాయతీలు తదితర స్థానిక వ్యవసాయ కార్యక్రమాల్ని 56% మంది వివరించగలిగారు.

**9వ తరగతి ప్రధానాంశాలు–**

**సామాజిక శాస్త్రం:**

⏭ 45% మంది రాజ్యాంగ సూత్రాల్ని, జాతీయోద్యమ ఆదర్శాల్ని అర్థం చేసుకున్నారు.

⏭ కేవలం 54% మంది వార్తా కథనాలు, ఎడిటోరియల్స్ లోని ముఖ్యాంశాల్ని గుర్తించగలిగారు.

గణితం:

⏭ పూర్ణాంకాలు, భిన్నాలు వంటి అంకెల సమాహారాన్ని (నంబర్ సెట్స్) 31% మంది మాత్రమే అర్థం చేసుకున్నారు.

⏭ శాతాలు గణింపుని కేవలం 28% ప్రతిభావంతంగా అన్వయించగలిగారు.

**సైన్స్:**

⏭ గాలి, ఒత్తిడి వంటి ప్రకృతి సూత్రాల్ని కేవలం 37% వివరించగలిగారు.

⏭ సాధారణ సర్క్యూట్లు, విద్యుత్తు వంటి అంశాల్ని మూడోవంతు మంది పిల్లలు మాత్రమే అర్థం చేసుకొని ప్రదర్శించగలిగారు.

⏭ సజీవ, నిర్జీవ పదార్థాల లక్షణాల మధ్య తేడాను 34% గుర్తించగలిగారు.

**రాష్ట్రాలవారీ అభ్యసన సామర్థ్యాల సరళి**

**ఉత్తమ ప్రతిభ కనబరిచినవి:**

⏭ మూడో తరగతి: పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, కేరళ

⏭ ఆరవ తరగతి: కేరళ, పంజాబ్, దాద్రా నాగర్ హవేలీ, డామన్ డయ్యూ

⏭ 9వ తరగతి: పంజాబ్, కేరళ, ఛండీగఢ్

**దిగువస్థాయి ప్రమాణాల జిల్లాలు –**

⏭ 3వ తరగతి: సాహిబ్ గంజ్ (జార్ఖండ్), రియాసీ రాజౌరి (జమ్మూకశ్మీర్)

⏭ 6, 9 తరగతులు: ఉత్తర, దక్షిణ గారో కొండలు సహా మేఘాలయలోని పలు జిల్లాలు.

⏭ పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు కూడా విద్యా ప్రమాణాల్లో నాసిరకంగా ఉన్నాయి.

కేంద్రీయ విద్యాలయాలు 3వ తరగతి గణిత సామర్థ్యంలో తక్కువ ప్రతిభను కనబరిచినా, 9వ తరగతి కొచ్చేసరికి భాషలో ఉత్తమ ప్రతిభను కనబరిచాయి. విద్యాసంస్థల మధ్య అంతరాన్ని ఈ గణాంకాల్ని సూచిస్తున్నాయి.

**విధానపర పర్యవసానాలు, వైఫల్యాలు**

పరఖ్ ఆర్ఎస్ ఫలితాలు ఆందోళనకర పర్యవసానాలు, వైఫల్యాలపై ఓ హెచ్చరికగానే భావించాలి. పై తరగతులకు వెళ్తున్నకొద్దీ విద్యార్థుల్లో అభ్యసన లోపాలు విస్తరిస్తున్నాయి. ముఖ్యంగా గణితం, సైన్స్ వంటి కాన్సెప్ట్ ఆధారిత సబ్జెక్టుల్లో.

**సర్వే సూచిస్తున్న తక్షణ దిద్దుబాటు చర్యలు**

⏭ ప్రాథమిక విద్యలో ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీని ఇంకా బలోపేతం చేయాలి.

⏭ విద్యా ప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నచోట బోధనా పద్ధతుల్ని, ఉపాధ్యాయ శిక్షణను మెరుగుపరచాలి.

⏭ నేర్చుకోవటంలో అంతరాల్ని ముందుగానే గుర్తించటానికి వీలుగా ఫార్మేటివ్ అసెస్ మెంట్ సాధనాల్ని సంధానించాలి.

⏭ సందర్భానుసార అవగాహన, సమస్యా పరిష్కార శక్తిని పెంపొందించే రీతిలో స్కూల్ పాఠ్యాంశాలను ఆధునీకరిస్తుండాలి. ❖

# జాతీయ సగటు కంటే దిగువన 'పరఖ్' తెలంగాణ



తరగతికి తగిన అభ్యసన సామర్థ్యాలు సాధించడంలో తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యార్థులు వెనుకబడుతూనే ఉన్నారని 'పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ 2024' విస్తృత సర్వే తాజాగా వెల్లడించింది.

3, 6, 9 తరగతుల్లో మొత్తం తొమ్మిది సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించగా ఎనిమిదింటిలో రాష్ట్ర విద్యార్థులు జాతీయ సగటు కంటే తక్కువ సాధించారు. ఒక్కదాంట్లో మాత్రమే జాతీయ సగటుకు సమాన స్కోరు సాధించారు.

ఎన్సీఈఆర్టీ విడుదల చేసిన పరఖ్ ఆర్ఎస్ జాతీయ స్థాయి సర్వేలో భాగంగా తెలంగాణలో 3,342 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. 78,464 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

⏭ మూడో తరగతిలో మాతృభాష, గణితంలో జాతీయ సగటు స్కోరు కంటే రాష్ట్ర విద్యార్థులు 6 శాతం తక్కువ సాధించారు. ఆరో తరగతి మాతృభాషలో 4 శాతం, గణితంలో రెండు, పరిసరాల విజ్ఞానం (ది వరల్డ్ ఎరౌండ్ అజ్)లో 5 శాతం వ్యత్యాసంతో రాష్ట్ర విద్యార్థులు వెనుకబడ్డారు. 9వ తరగతిలో గణితం, సైన్స్ లలో ఒక శాతం, సోషల్ లో రెండు శాతం తక్కువ స్కోరు సాధించారు. మాతృభాషలో మాత్రం జాతీయ స్థాయి సగటుతో సమాన స్థాయిలో నిలిచారు.

⏭ 3, 6, 9 మూడు తరగతుల్లోనూ ఉత్తమ జిల్లాల్లో జనగామ చోటు దక్కించుకుంది. వెనుకబడిన జిల్లాల్లో మూడో తరగతిలో వనపర్తి, ఆరో తరగతిలో కొత్తగూడెం, ములుగు ఉన్నాయి.

⏭ గతంలో పోలిస్తే 3వ తరగతిలో 36 నుంచి 26 స్థానానికి చేరుకున్నామని తెలంగాణ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తెలిపారు. ఆరో తరగతిలో 26వ స్థానం, 9వ తరగతిలో 17వ స్థానంలో నిలిచామన్నారు.

ఆరో తరగతి లోనూ అభ్యసన సామర్థ్యాలు మెరుగు పడ్డాయని, ఏ తంగతిలోనూ అట్టడుగు పది రాష్ట్రాల్లో తెలంగాణ లేదన్నారు. నాణ్యమైన విద్యను అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి దృఢ సంకల్పంతో ఉన్నారని, పాఠశాల అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు మరింత కృషి చేస్తామని తెలిపారు.

# పరఖ్ ఆర్ఎస్: 6,9 తరగతుల్లో ఏపీ పేలవం



**ఆరు, తొమ్మిది తరగతిలో చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల్లో జాతీయ సగటు కంటే ఆంధ్రప్రదేశ్ వెనుక బడింది. ఎన్సీఈఆర్టీ విడుదల చేసిన మొదటి 'పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ 2024' నివేదికలో ూ తొమ్మిదో తరగతి పిల్లలు అభ్యసనలో జాతీయ స్థాయిలో 29, ఆరో తరగతికి సంబంధించి 33 స్థానాల్లో ఏపీ నిలిచింది. మూడో తరగతిలో జాతీయ సగటు కంటే కొంచెం మెరుగ్గా ఉండటంతో 13వ స్థానం దక్కింది.**

**మూడో తరగతిలో మాతృభాష, గణితం ఆరో తరగతిలో మాతృభాష, గణితం, ఈవీఎస్‌బీ తొమ్మిదో తరగతిలో మాతృభాష, గణితం, సాంఘిక, సామాన్య శాస్త్రం సబ్జెక్టులలో పరీక్షలు నిర్వహిం చారు. మూడు తరగతిల్లోనూ జాతీయ స్థాయిలో మొదటి 10 ర్యాంకుల్లో  ఏపీకి స్థానం దక్కలేదు.**

ఇటీవల విడుదల చేసిన పరఖ్ ఆర్ఎస్ ను రాష్ట్రవ్యాప్తంగా 2,723 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలల్లో నిర్వహించారు. 3,6,9 తరగతులకు చెందిన 75,758 మంది విద్యార్థులు, 9,699 మంది టీచర్లు పాల్గొన్నారు. మూడో తరగతిలో మాతృభాష, గణితం ఆరో తరగతిలో మాతృభాష, గణితం, ఈవీఎస్‌బీ తొమ్మిదో తరగతిలో మాతృభాష, గణితం, సాంఘిక, సామాన్య శాస్త్రం సబ్జెక్టులలో పరీక్షలు నిర్వహించారు. మూడు తరగతిల్లోనూ జాతీయ స్థాయిలో మొదటి 10 ర్యాంకుల్లో  ఏపీకి స్థానం దక్కలేదు.

❖ మూడో తరగతికి సంబంధించి నంద్యాల, కృష్ణా, పల్నాడు, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలు మొదటి వరుసలో నిలువగా ూ అనంతపురం, శ్రీకాకుళం, కాకినాడ, కర్నూలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలు అడుగున ఉన్నాయి.

❖ ఆరో తరగతికి సంబంధించి జాతీయ సరాసరి కంటే మంచి ప్రతిభ చూపిన అమ్మాయిల జాబితాలో విశాఖపట్నం ఒకటే నిలిచింది. జాతీయ సరాసరి కంటే ఎక్కువ స్కోరు సాధించిన గ్రామీణ విద్యార్థులు కలిగిన జాబితాలో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి ఒక్క జిల్లా కూడా లేదు.

❖ 9వ తరగతిలో జాతీయ సరాసరి కంటే బాలికల అభ్యసన తీరు బాగున్న జిల్లాల జాబితాలో విశాఖపట్నం, విజయనగరం నిలిచాయి. జాతీయ సరాసరి కంటే ఎక్కువ స్కోరు సాధించిన గ్రామీణ విద్యార్థులు కలిగిన జాబితాలో విజయనగరానికి స్థానం దక్కింది.

❖ బాల బాలికల వారీగా చూస్తే బాలురు 47% స్కోరు సాధించగా- బాలికలు 51 %  సాధించారు.

❖ పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు మెరుగైన అభ్యసన సామర్థ్యాలు కలిగివున్నారు. పట్టణ ప్రాంతాల్లో 44- గ్రామీణ ప్రాంతాల్లో 56% స్కోర్లు నమోదయ్యాయి.

❖ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మధ్య అభ్యసన సామర్థ్యాల్లో పెద్ద తేడా లేదు. ప్రైవేట్ పాఠశాలలు 38% స్కోరు పొందగా - ప్రభుత్వ స్కూళ్లు 37% సాధించాయి. ఎయిడెడ్ బడుల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇక్కడ స్కోరు 19%.

❖ రాష్ట్రంలోని కేంద్రీయ విద్యాలయాలు 69% స్కోర్ తో అభ్యసన సామర్థ్యాల్లో మెరుగ్గా ఉన్నాయి. నవోదయ విద్యాలయాలు వెనకంజలో ఉన్నాయి. ఇక్కడ 21% స్కోరే నమోదైంది. ✦

# ఆరు నెలల్లో
# జనగామ జిల్లా సక్సెస్ స్టోరీ ఎలా సాధ్యమైంది?

**ఎన్సీఈఆర్టీ మొదటి 'పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్' నివేదికలో ఒక రాష్ట్రంగా తెలంగాణ వెనకబడినా, జనగామ జిల్లా జాతీయస్థాయిలో మెరిసింది. మన సమాజంలో విద్యకు ఉన్న డిమాండ్ ను, పిల్లల్లో కష్టపడి తత్వాన్ని, వారి తెలివితేటల్ని ఉపయోగించుకుని ఈ రంగంలో ఖర్చు చేసే ప్రతి రూపాయినీ సద్వినియోగం చేసేలా బోధనా ప్రమాణాలు, పరీక్షల పద్ధతి ఉంటే చాలా తక్కువ సమయంలో విద్యలో నాణ్యమైన ప్రమాణాల్ని తీసుకురావచ్చనే ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్డీఆర్) లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ మాటలకు రుజువుగా నిలిచింది.**

అభ్యసన సామర్థ్యాల్లో దేశవ్యాప్తంగా 50 ఉత్తమ జిల్లాలను ఎంపిక చేయగా తెలుగు రాష్ట్రాల నుంచి కేవలం జనగామకు మాత్రమే చోటు దక్కింది. ఈ ఘనతకు ప్రధాన కారణం అక్కడ కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్. ఆయన ఆరు నెలల పాటు వివిధ కార్యక్రమాల్ని అమలు చేస్తూ పర్యవేక్షించారు. దీంతో జనగామ 3వ తరగతిలో 16వ స్థానం, ఆరులో 35, 9వ తరగతిలో 33వ స్థానం సాధించి 50 ఉత్తమ జిల్లాల్లో స్థానం సంపాదించింది. దక్షిణ భారత్ లో కేరళలోని కొన్ని జిల్లాల్ని పక్కన పెడితే – ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటకల్లోని ఏ ఒక్క జిల్లా ఇందులో స్థానం సంపాదించలేదు.

**ఆరు నెలలు– 25 కార్యక్రమాలు అమలు**

2024 జూన్ లో విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి అభ్యసన సామర్థ్యాలపై కలెక్టర్ రిజ్వాన్ భాషా దృష్టి సారించారు. ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ప్రశ్నల నిధి తయారు చేశారు. పీఆర్ఎస్ పై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. జిల్లా రిసోర్స్ పర్సన్ తో ప్రత్యేక మెటీరియల్ రూపొందించారు. సీనియర్ హెచ్ఎంలు, జిల్లా రిసోర్స్ పర్సన్లతో కమిటీలు నియమించి పాఠశాలలను సందర్శించారు. నమూనా పరీక్షలు నిర్వహించారు. గూగుల్ మీట్ ద్వారా విద్యార్థులతో కలెక్టర్ సంభాషించారు. 2024 నవంబర్ నుంచి అన్ని పాఠశాలల్లో ప్రత్యేక స్టడీ అవర్ నిర్వహించారు. ఈ రకంగా మొత్తం 25 రకాల కార్యక్రమాలు జరిపారు.



**అవగాహన తెచ్చాం – పట్టుదల పెంచాం**

జనగామ సక్సెస్ స్టోరీపై కలెక్టర్ స్పందిస్తూ "నేను 2020లో ఆదిలాబాద్ జిల్లాలో అదనపు కలెక్టర్‌గా ఉన్నాను. అంతకుముందు 2017లో ఆ జిల్లా అభ్యసన సామర్థ్యాల్లో అట్టడుగున ఉంది. దాంతో 2021 సర్వే కోసం కొన్ని కార్యక్రమాల్ని అమలు చేయడంతో పురోభివృద్ధి సాధించాం. జనగామకు వచ్చిన తర్వాత ఆదిలాబాద్ అనుభవంతో 25 కార్యక్రమాలు చేపట్టాం. దాంతో పిల్లలకు ప్రశ్నలపై అవగాహన పెరిగింది. టీచర్లలోనూ పట్టుదలను పెంచి– విభిన్నంగా ఆలోచించి ప్రశ్నలు రూపొందించేలా చేశాం. దీనివల్ల కాన్సెప్ట్‌లపై అవగాహన పెరిగి – ఎన్ని రకాలుగా ప్రశ్నల్ని మార్చి అడిగినా జవాబు రాసే స్థాయికి చేరుకున్నారు. ఆ ఫలితమే ఉత్తమ జిల్లాగా జనగామ నిలిచింది. పదో తరగతిలోనూ జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది" అని తెలిపారు.

పూర్తిస్థాయి నాణ్యమైన విద్యా ప్రమాణాల సాధనకు జనగామ సైతం ఇంకా చాలా దూరం ప్రయాణించవలసి ఉందనటంలో సందేహం లేదు. కానీ మనకు సంకల్పం ఉంటే, విద్యలో సక్సెస్‌కి నిర్వచనం మారిస్తే, ఇప్పుడు చేస్తున్న ఖర్చుతోనే సులభంగా ప్రతి బిడ్డకూ మంచి విద్యను అందించవచ్చని జనగామ జిల్లా నిరూపిస్తోంది.

# విద్యారంగం పిల్లల చదువు కోసమా, టీచర్ల రిక్రూట్‌మెంట్ కోసమా?

***2025-26 విద్యా సంవత్సర సీజన్ ప్రారంభమవుతుండగా ఆసక్తికరంగా, అదే సమయంలో షాకింగ్‌గా ఉన్న కొన్ని వార్తలు వెలువడ్డాయి. వాటిలో మచ్చుకు రెండు పరిశీలిద్దాం.***

మొదటిది, తెలంగాణ మహబూబాబాద్ జిల్లా నడివాడ గ్రామ పంచాయతీ పరిధిలోని రంగశాయిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సంబంధించినది. ఆ స్కూల్ లో ఒక్క విద్యార్థీ లేదు. ఊళ్లో ఉన్న 10మంది బడి ఈడు పిల్లలూ మహబూబాబాద్ లోని ప్రయివేట్ స్కూల్ కి వెళ్తున్నారు. ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలో ఇక్కడ ఇదే దృశ్యం కనిపిస్తుందట. పిల్లలు రాకపోవటం వల్ల ఉపాధ్యాయుడు డిప్యూటేషన్ పై మరో పాఠశాలకు వెళ్తుంటారు. నాలుగేళ్లుగా ఇలా జరుగుతోందని గమనించిన న్యూస్ రిపోర్టర్ విద్యాశాఖ ఉన్నతాధికారిని ప్రశ్నించగా, మండలస్థాయి అధికారిని పంపించి విషయం కనుక్కుంటానని చెప్పారట. ఇన్నేళ్లుగా ఈ విషయం తెలియదా? అధికారులు హేతుబద్ధీకరణ చర్యలు తీసుకోకుండా ఏ చేస్తున్నట్లు? అంటే జవాబు లేదు.

రెండో ఉదంతం, ఉత్తరాఖండ్ నైనిటాల్ జిల్లా భద్రకోట్ లోని ప్రభుత్వ పాఠశాలకు సంబంధించినది. అక్కడ పదో తరగతికి ఒకే ఒక్క విద్యార్థి ఉన్నాడు. అతనికి వివిధ సబ్జెక్టులు బోధించటానికి ఏడుగురు ఉపాధ్యాయులున్నారు. అయినా ఆ ఒక్కగానొక్క విద్యార్థి ఇటీవలి తుది పరీక్షల్లో ఫెయిలయ్యాడట. సమీప గ్రామాల నుంచి అయిదో తరగతి పాసైన పిల్లలను పాఠశాలకు తీసుకు రావాలని, విద్యా ప్రమాణాలు పెంచాలని భద్రకోట్ ఉపాధ్యాయులకు కఠిన హెచ్చరికలు జారీ చేశామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

**ఒక్క విద్యార్థీ లేని పాఠశాలల్లో తెలంగాణ 3వ ర్యాంకు**

ఒక్క విద్యార్థీ లేని అత్యధిక ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలున్న రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలో మూడో స్థానంలో నిలిచింది. పశ్చిమ బెంగాల్ (3,254), రాజస్థాన్ (2,187) ఈ కేటగిరీలో తొలి రెండు స్థానాల్లో ఉండగా



తెలంగాణ 2,097 బడులతో మూడో స్థానంలో నిలిచింది. ఒకటి నుంచి 12వ తరగతి వరకు పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సంబంధించి 2023-24 విద్యా సంవత్సరం ఏకీకృత జిల్లా పాఠశాల విద్యా సమాచారం (యూడైస్) గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా విద్యార్థులు లేని పాఠశాలలు 12,954 ఉన్నాయి.

తెలంగాణ లోని 2,097 'జీరో పాఠశాలల్లో' 2 వేలమంది టీచర్లు పని చేస్తున్నారు. కాకపోతే ఇంతకుముందు మహబూబాబాద్ పాఠశాల ఉపాధ్యాయుడిలా వారిని సమీప బడుల్లోకి డిప్యూటేషన్ పై పంపుతుంటారు. వారిస్థాయికి తనిఖీలు వంటి బాధ్యతలు అప్పచెబితే మళ్లీ తగాదాలు. ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడిగా ఉన్న సీనియర్ ని ఎలా ప్రశ్నిస్తారని ఆందోళనలు. అంతకు ముందు సంవత్సరం, అంటే, 2022-23 విద్యా సంవత్సరంలో, తెలంగాణలో విద్యార్థులు లేని బడుల సంఖ్య 1,672 మాత్రమే కావటం గమనార్హం. ఈ గణాంకాలన్నీ జాతీయ నూతన విద్యావిధానాన్ని అనుసరించి హేతుబద్ధంగా రూపొందించినవి. రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 5,895 ఉండగా అంతకు ముందు ఏడాది (2022-23)లో ఆ సంఖ్య 6,054గా ఉంది. వీటిలో 88,429 మంది చదువుతున్నారు. ఈ కేటగిరీ బడుల విషయంలో తెలంగాణ తొమ్మిదో స్థానంలో ఉంది. ఇంకొన్ని ఇదే తరహా ఆందోళకర అంశాలు:

❖ తెలంగాణలో ప్రభుత్వ ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలలు

42,901 ఉండగా, సగటున ఒక్కో పాఠశాలలో 170 మంది విద్యార్థులు, 8 మంది టీచర్లు ఉన్నారు.

❖ 10 మంది లోపు విద్యార్థులున్న పాఠశాలలు 11.60 శాతం ఉన్నాయి. ఈ అంశాలలో జాతీయ సగటు 4.6 శాతమే. అయిదు రాష్ట్రాల్లో మాత్రం పరిస్థితి తెలంగాణ కంటే అధ్వాన్నంగా ఉంది.

❖ ఒకటో తరగతిలో తెలంగాణలో 6.06 లక్షలమంది ప్రవేశాలు పొందగా వారిలో ప్రభుత్వ పాఠశాలల్లోనివారు 1,97,842 మంది మాత్రమే. ఎయిడెడ్ పాఠశాలల్లో మరో 6,594 మంది ఉన్నారు. మొత్తం ఒకటో తరగతి విద్యార్థుల్లో 4.01 లక్షలమంది ఎల్ కేజీ, యూకేజీ లాంటి ప్రీస్కూల్ విద్య చదివి వచ్చినవారున్నారు.

❖ గత పదేళ్లలో తెలంగాణ పరిధిలోని ప్రభుత్వ, స్థానిక ప్రభుత్వాల స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య ఏకంగా 32 శాతం తగ్గింది. రాష్ట్రం ఆవిర్భవించిన 2014-15 విద్యా సంవత్సరంలో 24.85 లక్షలమంది ప్రభుత్వ బడుల్లో చదువుతుండగా- 2024-25లో ఆ సంఖ్య 16.86 లక్షలకు పడిపోయింది. కొవిడ్ సమయంలో 2021-22లో అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 17.85శాతం మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లలో పెరిగినా, ఆ తర్వాత మళ్లీ భారీగా తగ్గుతూ వచ్చారు. ప్రయివేటు పాఠశాలల్లో మాత్రం 2022-23తో పోల్చుకుంటే, 2023-24లో 1.53 లక్షలమంది పిల్లలు పెరిగారు.

**2025-26 విద్యా సంవత్సరంలో
ఏపీ, తెలంగాణ తొలి గణాంకాలు**

యుడైస్ లెక్కలు 2023-24వి గదా, రెండు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలూ విద్యాశాఖను ఇటీవల కొంత పట్టించుకుంటున్నాయిగదా, ఈ ఏడాది పరిస్థితి మారి ఉండొచ్చన్న అభిప్రాయం కలగవచ్చు. కానీ ఈసారీ ట్రెండ్ పెద్దగా మారలేదని తొలి గణాంకాలు చెబుతున్నాయి. ఇవి విద్యాశాఖ అధికారులు మీడియాకు చెప్పినవే. (ప్రారంభంలో పేర్కొన్న రెండు స్కూళ్ల ఉదాహరణలూ ఈ విద్యా సంవత్సరం లోనివే). తెలంగాణలో బడిబాట కార్యక్రమం ద్వారా 20% మంది దాకా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య పెరిగారని చెప్తున్నారు. వీరి సంఖ్య మొత్తం 1,89,000 దాకా ఉండగా, ఒకటో తరగతిలో చేరిన సుమారు 88,000 మందీ కొత్తవారు. పై తరగతుల్లో చేరిన 31, 096 మంది ప్రైవేట్ స్కూళ్ల నుంచి వచ్చినవారుగా చెప్తున్నారు. ఇలా సంఖ్య పెరిగినా, జులై రెండవ వారం దాకా చెప్పిన లెక్కల ప్రకారం ప్రభుత్వ స్కూళ్లలో ఒకటో తరగతిలో 2025- 26లో 2023-24 కంటే తక్కువగానే విద్యార్థులు కనిపిస్తున్నారు. 2023-24లో ఒకటో తరగతిలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో కలిపి 2,04,36 (1,97,842+6,594) కాగా ఈ ఏడాది సంఖ్య 1.08

*యుడైస్ లెక్కలు 2023-24వి గదా, రెండు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలూ విద్యాశాఖను ఇటీవల కొంత పట్టించుకుంటున్నాయిగదా, ఈ ఏడాది పరిస్థితి మారి ఉండొచ్చన్న అభిప్రాయం కలగవచ్చు. కానీ ఈసారీ ట్రెండ్ పెద్దగా మారలేదని తొలి గణాంకాలు చెబుతున్నాయి. ఇవి విద్యాశాఖ అధికారులు మీడియాకు చెప్పినవే.* **తెలంగాణలో బడిబాట కార్యక్రమం ద్వారా 20% మంది దాకా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య పెరిగారని చెప్తున్నారు.**

లక్షలు మాత్రమే.

❖ ప్రభుత్వ స్కూళ్లలో చేరికలలో కొద్దిపాటి పెరుగుదల ఉన్నా .. ప్రయివేటు పాఠశాలల్లో పిల్లల సంఖ్య ఈ ఏడాది తెలంగాణలో 61% మేర ఉండే అవకాశముందని, ప్రభుత్వ పాఠశాలల్లో 38%దాకా ఉండొచ్చని చెబుతున్నారు. 1%ను కొంత మార్జిన్ గా భావించవచ్చు.

ఇక ఆంధ్రప్రదేశ్‌లో 2020-21 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని పిల్లల సంఖ్య 41.17 లక్షలు కాగా, 2024-25కి 36 లక్షలకు తగ్గింది. ప్రయివేటు స్కూళ్లలో ఈ సంఖ్య 42.7 లక్షలని స్థూల అంచనా.

❖ ఏపీలో 2023-24లో మొత్తం పాఠశాల విద్యార్థులు యుడైస్ ప్లస్ ప్రకారం 87.4 లక్షలు కాగా ఆ సంఖ్య 2024-25లో 78.70 లక్షలకు తగ్గిందని అంచనా. ఆధార్ ని కఠినంగా అమలు చేయటం వల్ల అంతకుముందు పెంచిచూపిన సంఖ్యల్లో ఎక్కువ కచ్చితత్వం వచ్చింది.

❖ 2023-24లో ప్రభుత్వ స్కూళ్లలో 46 శాతం, ప్రయివేటు పాఠశాలల్లో 52 శాతం, ఎయిడెడ్ స్కూళ్లలో 2 శాతం ఉన్నట్లు అంచనా. మొత్తం పాఠశాలల్లో ప్రభుత్వ స్కూళ్లు 73 శాతం, ప్రయివేటు 25 శాతం ఉన్నా- విద్యార్థుల చేరికలు ప్రయివేటులోనే ఎక్కువ కొనసాగుతున్నాయి.

❖ అనధికార సమాచారాన్ని, అసర్ 2024 సర్వేను క్రోడీకరిస్తే .. 2024-25లో ఏపీ ప్రభుత్వ స్కూళ్లలో 46.33శాతం మాత్రమే ఎన్ రోల్ మెంట్ వాటా. మిగిలిన విద్యార్థులు ప్రయివేటుకు మళ్లినట్లు భావించవచ్చు.

❖ 2025-26 గణాంకాలు ఇంకా సమగ్రంగా, అధికారికంగా తెలియదుగానీ ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు కలిపి 76,02,854 గా చెబుతున్నారు. అయితే ఏపీ ప్రభుత్వం 'తల్లికి వందనం' కార్యక్రమంలో భాగంగా తాజాగా 67 లక్షలమంది దాకా పిల్లలకే నగదు బదిలీ

చేసింది. ఈ సంఖ్య కొంచెం పెరిగే అవకాశం ఉందనుకున్నా– ఏపీలో అటు ప్రభుత్వం, ఇటు ప్రయివేటులో కూడా పాఠశాల విద్యార్థుల చేరికల నిజ సంఖ్యలు గణనీయంగా తగ్గాయని, ఉన్నవారిలో 52శాతం ప్రయివేటు రంగంలో చదువుతున్నారని సుమారుగా అనుకోవచ్చు. వేచి చూడాలి.

**విద్యార్థులు తగ్గుతున్నారు,**
**ప్రభుత్వ బడ్జెట్, టీచర్లు పెరుగుతున్నారు**

మన అధికారిక గణాంకాలు కూడా పూర్తి కచ్చితమని ఎవరూ చెప్పలేరుగానీ, స్థూలంగా చూస్తే ఈ మొత్తం సమాచారాన్ని బట్టి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తగ్గుతున్నారు. ఈ రకంగానూ బడ్జెట్ పెరుగుతూనే ఉంది. కొత్తగా టీచర్ రిక్రూట్ మెంట్లు జరుగుతూనే ఉన్నాయి. ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ లోనైతే ఇప్పటివరకూ ఉన్న సమాచారం ప్రకారం, ప్రభుత్వ స్కూళ్లతో పాటు ప్రయివేటు



స్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో కూడా విద్యార్థులు తగ్గారు. 2023–24 యూడైస్ ప్లస్ సర్వేలో ఉన్న విద్యార్థులకు, 2025 జులైలో ఇచ్చిన 'తల్లికి వందనం' విద్యార్థులకు మధ్య అంతరం దాదాపు 20 లక్షలు. 2023–24లో 87 లక్షల దాకా ప్రభుత్వ, ప్రయివేటు కలిపి పిల్లలు ఉండగా – తల్లికి వందనం 67 లక్షలమంది దాకా పిల్లలకు (1–12 తరగతులకు) ఇచ్చారు. జాతీయ విద్యావిధానాన్ని అనుసరించి పకడ్బందీ చర్యలు చేపట్టటంతో, విద్యార్థుల నమోదులో దొంగ లెక్కలు ఉన్నట్లు తేలింది. తల్లికి వందనం పథకం అందరికీ వర్తించదు కాబట్టి, నకిలీ గణాంకాల వివ రాలు ఇంకా కచ్చితంగా తెలియదు. 2023–24 యూడైస్ సర్వేలో ఏపీలో ఒక్క విద్యార్థీ లేని స్కూళ్లు 84 మాత్రమే ఉండగా, 2025–26లో 4,700 స్కూళ్లు మూసివేయవచ్చు అని చెబుతున్నారు.

తెలంగాణ ముఖ్యమంత్రి, విద్యామంత్రి రేవంత్‌రెడ్డి ఈ విద్యా సంవత్సరం 1,89,000మంది ప్రభుత్వ స్కూళ్లలో అదనంగా (వీరిలో ప్రయివేటు నుంచి వచ్చినవారు సుమారు 30 వేలు

***2023–24 యూడైస్ ప్లస్ సర్వేలో ఉన్న విద్యార్థులకు, 2025 జులైలో ఇచ్చిన 'తల్లికి వందనం' విద్యార్థులకు మధ్య అంతరం దాదాపు 20 లక్షలు. 2023–24లో 87 లక్షల దాకా ప్రభుత్వ, ప్రయివేటు కలిపి పిల్లలు ఉండగా – తల్లికి వందనం 67 లక్షలమంది దాకా పిల్లలకు (1–12 తరగతులకు) ఇచ్చారు. జాతీయ విద్యావిధానాన్ని అనుసరించి పకడ్బందీ చర్యలు చేపట్టటంతో, విద్యార్థుల నమోదులో దొంగ లెక్కలు ఉన్నట్లు తేలింది. తల్లికి వందనం పథకం అందరికీ వర్తించదు కాబట్టి, నకిలీ గణాంకాల వివ రాలు ఇంకా కచ్చితంగా తెలియదు.***

మాత్రమే) చేరారని మూసేసిన స్కూళ్లు తెరిపించటం, కొత్త తరగతి గదుల్ని కట్టించటం చేస్తున్నారు. ఈ ఏడాది కొద్దిపాటి సంఖ్య ప్రభుత్వ స్కూళ్లలో పెరగటానికి కారణం, ప్రయివేటు స్కూళ్ల ఫీజులు భారమవటమని కొందరు ఉపాధ్యాయులు విశ్లేషిస్తున్నారు. ప్రత్యక్ష బడ్జెట్, తల్లికి వందనం వంటి పథకాలను కలిపి చూస్తే ప్రభుత్వ స్కూల్ లో చదివే ఒక్కో విద్యార్థి మీదా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఏటా రూ.1 లక్షకు పైగా ఖర్చు చేస్తున్నాయి. ఏ ప్రయివేటు స్కూళ్లలో ఫీజులు పెరిగాయని గగ్గోలు పెడుతున్నామో వాటిల్లో చాలా స్కూళ్ల కంటే ప్రభుత్వ స్కూళ్లలో ఉచితం పేరుతో ప్రభుత్వాలు చేస్తున్న ఖర్చు ఎక్కువని, అదికూడా మన పన్నుల డబ్బేనని, ఎక్కువమంది తల్లిదండ్రులు గుర్తించలేకపోతున్నారు. అంటే అటు పన్నుల డబ్బు, ఇటు జేబులో నుంచి డబ్బులు. అసలు అటువంటి చర్చను రాజకీయం, పాలనా యంత్రాంగం, చివరికి మీడియా కూడా పెద్దగా చేయటం లేదు.

మొత్తంగా స్కూల్ పిల్లల సంఖ్య తగ్గటాన్ని అలా ఉంచితే ప్రభుత్వం స్కూళ్లలో అంత భారీగా విద్యార్థుల నమోదు తగ్గుతున్నా, ఇప్పటికే ఉన్న ఉపాధ్యాయుల సంఖ్య, నిష్పత్తి సరిపడా కంటే ఎక్కువే అయినా, ఇంకా ఇంకా టీచర్ రిక్రూట్ మెంట్లు ఎందుకు చేస్తున్నారు? తెలంగాణలో 1.12 లక్షలమంది, ఏపీలో 3.32 లక్షలమంది ప్రభుత్వ టీచర్లు స్థిరంగా కొనసాగుతున్నారు. తెలంగాణలో రేవంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ పేరుతో 11 వేలు, 16 వేలకు పైగా టీచర్లను కొత్తగా నియమించి ఘనంగా ప్రచారం చేసుకున్నారు. ఇంకొన్ని వేలమందిని రిక్రూట్ చేయడానికి, ప్రమోషన్లు వంటి కార్యక్రమాల్ని పొడిగించడానికి సిద్ధమవుతున్నారు.

**కనీసం పాఠశాల అనిపించుకునే సంఖ్య ఉందా?**

విద్యకు అవసరానికి మించి ఖర్చు పెడితే, ఎలాగైనా ప్రభుత్వ స్కూళ్లలోకి పిల్లల్ని చేర్చాలని రంగులు, హంగుల భవనాలు, తరగతి గదులు, ఇంకా ఇంకా టీచర్ల రిక్రూట్ మెంట్లు చేస్తే విద్యలో ప్రభుత్వం తన బాధ్యతను సక్రమంగా నెరవేర్చినట్టు కాదు. విద్య ప్రభుత్వ బాధ్యతే గానీ– ప్రభుత్వ స్కూళ్ల ద్వారానే ఆ లక్ష్యాన్ని నెరవేర్చే దశ దాటిపోయింది. దానికి బదులు, ఉన్న పాఠశాలల్ని విద్యార్థి, టీచర్ నిష్పత్తికి తగ్గట్టుగా హేతుబద్ధీకరించాలి. విద్యార్థులు లేని టీచర్లు, టీచర్లు లేని విద్యార్థుల స్కూళ్ల మధ్య సమతూకం తేవాలి. విద్యలో మనకంటే మంచి ఫలితాల్ని సాధించిన దేశాల్నే తీసుకుంటే చైనాలో ప్రాథమిక పాఠశాలకి సగటున 693 మంది, హైస్కూల్ కి 895 మంది ఉన్నారు. బ్రిటన్ లో ఈ రెంటిలో 281 మంది, 989 మంది ఉంటారు. అమెరికాలో ఒక్కో పాఠశాలకి 514 మంది దాకా పిల్లలుంటారు. అలా కనీసం పాఠశాల అనిపించుకునే ప్రభుత్వ స్కూళ్లని హేతుబద్ధం చేసి, ముఖ్యంగా గణితం, సైన్స్, భాష, ప్రయోగాత్మకంగా తగిన ఆధునిక వసతుల్ని అందుబాటులోకి తేవాలి.

**పూర్వమైనా, అధునాతన సాంకేతికత వచ్చాకైనా టీచర్ పాత్ర కీలకం. టీచర్ బోధకుడు, వల్లె వేయించేవాడు కాదు ఫెసిలిటేటర్ విద్యార్థి తనదైన సృజనాత్మకతతో విషయాన్ని ఆకళింపు చేసుకుని జీవితానికి అన్వయించు కోవడానికి, పూర్తిస్థాయిలో తన శక్తి సామర్థ్యాలను వికసింప చేసుకోవడానికి ఉపాధ్యాయుడు సాంకేతికతతో దోహదపడతాడు.**

హేతుబద్ధీకరణతో హేతుబద్ధీకరణతో క్లస్టర్ ఎఫెక్ట్ వల్ల ఈ ఖర్చు కూడా తక్కువే అవుతుంది. జనాభా విస్ఫోటనం లేకుండా స్కూల్ పిల్లల సంఖ్య నియంత్రణకొచ్చినప్పుడు, అదనపు ఉపాధ్యాయుల నియామకాలు అర్థరహితం. రిటైరైన వారి స్థానంలో కొత్త నియామకాలు అక్కర్లేదు. అయితే ఆ డబ్బును కూడా విద్యా రంగం పెరుగుదలకే వినియోగించాలి. అదే సమయంలో, అదనంగా ఉన్న ఉపాధ్యాయుల్ని నాణ్యతా ప్రమాణాలు పెంచే పర్యవేక్షణలు, ఇతరత్రా బాధ్యతలకు సమర్థంగా, జవాబుదారీతనంతో ఉపయోగించుకోవాలి.

**అసలు టీచర్లు అవసరమా?**

పాఠశాల విద్యను బాగు చేసేందుకు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలోని బృందం విస్తృతస్థాయి కృషి చేస్తోంది. అలాంటి విలువైన ప్రయత్నాలు తమ పరిధిలో చేస్తున్న సంస్థలు, వ్యక్తులు ఈ దేశంలో పలువురు ఉన్నారు. అలాంటివాటిలో ఒకరు కొంతకాలం క్రితం ఓ యూట్యూబ్ ఛానల్ కోసం జేపీని ఇంటర్వ్యూ చేస్తూ, అసలు టీచర్లు అవసరమా? వాళ్ళు లేకుండా చదువు నేర్చుకోవటం సాధ్యం కాదా? అని అడిగారు. ఎడ్యుటెక్ యాప్‌లు, ఏఐ సాంకేతికత వచ్చాక – ఈ ప్రశ్నకు ఇంకా ప్రాధాన్యత ఉంటుంది. అయితే, పూర్వమైనా, అధునాతన సాంకేతికత వచ్చాకైనా టీచర్ పాత్ర కీలకం. టీచర్ బోధకుడు, వల్లె వేయించేవాడు కాదు ఫెసిలిటేటర్ విద్యార్థి తనదైన సృజనాత్మకతతో విషయాన్ని ఆకళింపు చేసుకుని జీవితానికి అన్వయించు కోవడానికి, పూర్తిస్థాయిలో తన శక్తి సామర్థ్యాలను వికసింప చేసుకోవడానికి ఉపాధ్యాయుడు సాంకేతికతతో దోహద పడతాడు.

అలాంటి హైబ్రిడ్ లెర్నింగ్‌ని ఉత్సుకత రేకెత్తించేలా అందించటం వరకే అతను లేదా ఆమె పాత్ర అని జేపీ తెలిపారు. మొబైల్ ఫోన్లు, ఇతర సాంకేతికతల మీదే పూర్తిగా ఆధారపడటం వల్ల 23% దాకా స్కూలు పిల్లల్లో మానసిక ఆందోళనలు పెరుగుతున్నట్లు అంచనా.

పాఠశాలలో చదువంటే టీచర్ల రిక్రూట్‌మెంట్, వారి జీత భత్యాలు, ఈవెంట్ మేనేజ్మెంట్లుగా మార్చేసి.. ప్రభుత్వ స్కూళ్లకు పిల్లలకు ఎందుకు రావడం లేదు? డిగ్రీ కాగితాలు, అవకాశాలు ఉన్నా ఉద్యోగాలు ఎందుకు రావటం లేదు – అని లబలబలాడి ఏం ప్రయోజనం? ఇది కేవలం ప్రభుత్వం తప్పుకాదు, అధికారుల తప్పుకూడా. సుమారు 24.8 కోట్లమంది పిల్లలున్న పాఠశాల విద్యపై ఇప్పటికైనా తెలుగు రాష్ట్రాలు సహా దేశం అంతా కళ్ళు తెరవాలి. విద్యను ఉపాధ్యాయుల చుట్టూ కాకుండా విద్యార్థుల చుట్టూ తిప్పాలి. విద్యా బడ్జెట్ లో ప్రతి రూపాయి విద్యార్థి అభ్యసన ప్రమాణాలు, నైపుణ్యాలు పెంచేందుకు ఉపయోగించాలి. వాటిని బేరీజు వేసేందుకు బట్టీ, కాపీ పద్ధతులకు అవకాశం లేకుండా– జిగ్ జాగ్ పద్ధతుల్లో పరీక్షా పత్రాల్ని రూపొందించి కాన్సెప్ట్‌లు, సృజనాత్మకత, జీవితంలో అన్వయం ద్వారా ఉదాహరణలు చెప్పగలిగేవారికి అంటే, ఒత్తిడి లేకుండా అదే సమయంలో దీర్ఘకాలం కష్టపడే విద్యార్థులకు మాత్రమే మంచి మార్కులు వచ్చేలా చేయాలి. ఎప్పుడో పదో తరగతిలో మాత్రమే కాకుండా – ప్రతి క్లాసులో ఏడాది పొడుగునా నిర్ణీత కాలవ్యవధిలో ఇలా ఒత్తిడి లేని పరీక్షల్ని నిర్వహించాలి. విద్యార్థుల్ని బేరీజు వేయాలి.

అప్పుడు ఈ ప్రభుత్వ ఉద్యోగులే, ఈ మార్కెట్టే అద్భుతంగా, నాణ్యమైన విద్యను అందిస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల మధ్య పోటీ నెలకొని, నచ్చిన స్కూల్ లో చేరి లాభపడే స్వేచ్ఛ పిల్లలకు లభిస్తుంది. మన విద్యార్థులు తెలివితేటల్లో, కష్టపడడంలో ప్రపంచంలో ఎవరికి తీసిపోరు. ప్రభుత్వ పద్ధతులను మార్చి, చేస్తున్న ఖర్చునే సద్వినియోగం గావించాలి. అప్పుడే ఈ దేశంలో ప్రతి బిడ్డ జన్యు సంపదా వికసిస్తుంది. మనకు సంకల్పం ఉండాలే కానీ చాలా తక్కువ సమయంలోఈ మార్పును తేవచ్చు.

# జాతీయోద్యమ కాలం నుండి సమీక్షించుకోవాల్సిన స్వాతంత్ర్య దినోత్సవమిది!




భారత్ సహా ఏ దేశానికైనా స్వాతంత్ర్య వార్షికం ఒక ఉత్సవమే. ఈ పండుగలో చేసే ప్రసంగాల్లో, చర్చల్లో ఎక్కువగా వర్తమాన, భవిష్యత్ అంశాలే ఉంటాయి. వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధిని, సమస్యలను సమీక్షించుకొని, పరిష్కారాన్ని, అవసరమైన విధానపర మార్పుల్ని ప్రతిపాదించటం, రోడ్డు మ్యాప్‌ను ప్రజలు ముందుంచడం జరుగుతుంటుంది. జాతీయోద్యమ నేతల చిత్రపటాలకు దండలు వేయడం, వారికి నివాళులర్పించడం, ఎవరైనా యథాలాపంగా చేస్తుంటారు. విద్యాసంస్థలు, కార్యాలయాలు, ప్రయివేటు సంస్థల్లోనూ ఇదే తీరు. కాస్త ఎక్కువ ఘనంగా జరుపుకోవాలనుకుంటే- స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఏదైనా సంక్షేమ కార్యక్రమాన్ని, పంపిణీ వంటిది ప్రారంభిస్తుంటారు. కానీ 2025 ఆగస్టు 15న జరుపుకునే 79వ స్వాతంత్ర్య దినోత్సవం మాత్రం జాతీయోద్యమ కాలం నాటి చరిత్ర నుంచి మొదలు పెట్టి భవిష్యత్ కార్యాచరణ దాకా సమీక్షించుకోవాల్సింది.

**భిన్నత్వంలో ఏకత్వమే మన ప్రత్యేకత**

మనదేశంలో 22 అధికార భాషలు, వందల అనధికార భాషలు, వేల యాసలు, అనేక మతాలు, ఆచారాలు, మెజారిటీ మతంలోనూ కుల వ్యవస్థ వల్ల అనేక చీలికలు, పేలికలు, వైరుధ్యాలు, రాజకీయాలు ఉన్న భారత్ లాంటి దేశం ప్రపంచంలో మరొకటి లేదు. ఇన్ని వైరుధ్యాలున్నా దేశ రక్షణ, ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో ఆసేతు హిమాచలానికి అర్థాన్ని చాటుతూ మతం, కులం, ప్రాంతం, భాష, తెగలతో సంబంధం లేకుండా ప్రజలంతా ఏకతాటిపైకి వస్తారు. తాజాగా జరిగిన పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఇది మరోసారి రుజువైంది. ముక్తకంఠంతో అన్ని పక్షాలు ఈ దాడిని ఖండించాయి. భారత్ ప్రత్యేకతను ప్రపంచానికి చాటాయి. జాతీయోద్యమ సహచరులు! వారికి స్వాతంత్ర్యోద్యమ వేళ నివాళులర్పించటం, బడ్జెట్లో వారి మాటల్ని సూక్తిముక్తావళిలా ఉటంకించటం మాత్రమే కాకుండా- వారి రాజనీతిని మన రాజకీయంలో భాగం చేసుకోవాలని, ప్రపంచ దేశాలకూ విస్తరింప చేయాలని పహల్గాం ఉదంతం విస్పష్టంగా తెలియబరుస్తోంది. ఈ పాఠాన్ని మన 79వ స్వాతంత్ర్య దినోత్సవం ప్రతిఫలించింది.

**గాంధీ పాత్ర కీలకం**


కుల, మత, ప్రాంత, భాష, తెగలకతీతంగా ప్రపంచంలో మారే దేశంలోనూ లేనిరీతిలో అనేకమంది నాయకుల్ని తయారు చేయటం, అందులోనూ మహిళలకు తగిన ప్రాధాన్యం కల్పించటం, ఈ దేశాన్ని ఏకం చేయటంలోనే కాదు ఎలాంటి స్వరాజ్యం కావాలో కూడా తొలినాళ్ల నుంచే ఆలోచించి, సమాజరీతులతో పోలిస్తే ఒక విప్లవాత్మక, ఉదాత్త, కాలానుగుణ మార్పులకు వీలున్న రాజ్యాంగానికి స్వతంత్ర భారతాన్ని సన్నద్ధం చేయటంలోనూ గాంధీ కీలక

పాత్ర వహించారు.

**రాజ్యాంగానికి 75 ఏళ్లు**

గాంధీ సూచన మేరకు బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ నేతృత్వంలో ఏర్పడిన రచనా సంఘం రూపొందించిన ఆ రాజ్యాంగం అమల్లోకి వచ్చి ఈ స్వాతంత్ర్య దినోత్సవ సంవత్సరానికి 75 ఏళ్లు. ఒక స్వతంత్ర రాజ్యంగా భారత్ మనలేదని, రిపబ్లిక్‌గా దేశాన్ని భారత రాజ్యాంగం కలిపి ఉంచలేదని తొలినాళ్లలో పలువురు సందేహాలను వ్యక్తం చేశారు. అయితే వారందరి అంచనాలనూ తారుమారు చేస్తూ భారత్ ఒక దేశంగా నిలదొక్కుకునేందుకు రాజ్యాంగం దోహదం చేసింది. భారత రాజ్యాంగం, దేశ విభజన

ఈ స్వాతంత్ర్య దినోత్సవం వేళ ఇంకో కీలకాంశాన్నీ మననం గావించుకోవాలి. అది దేశ అంతర్గత ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తి కావటం. ఈ సవాలును కూడా భారత రాజ్యాంగం విజయవంతంగా అధిగమించింది. దేశం లోపల ఎమర్జెన్సీ ప్రకటించిన జూన్ 25 అర్ధరాత్రి, 1975 మరుసటి రోజు నుంచి ప్రజలకు అన్ని రాజ్యాంగ హక్కులూ బంద్ అయ్యాయి. వార్తాపత్రికల్ని ఆపేశారు. లక్ష మందిని రాత్రికి రాత్రి జైళ్లలో పెట్టారు.




నేపథ్యంలో దారుణ మారణకాండను చూసిన ఆందోళనతో యూనియన్‌కి ఎక్కువ అధికారాలనిచ్చినా.. రాష్ట్రాల ప్రాధాన్యతను తగ్గించలేదు. 22 భాషలను అధికారికంగా గుర్తించింది. పలు సంక్షోభాల్లో పరిష్కారాల్ని అందిస్తూ, మార్పులకు తగిన అవకాశమిస్తూ భారత్ ఒక దేశంగా నిల దొక్కుకునేలా చేసింది. ఆర్థిక రంగంలో మౌలిక మార్పులకు రాజ్యాంగం ఎటువంటి అవరోధం కల్పించలేదు. అదే విధంగా, ఈవేళ దేశంలో అవినీతికి, దుష్పరిపాలనకు పెద్ద కారణంగా ఉన్న ఎఫ్పీటీపీ ఎన్నికల వ్యవస్థ (ఒకచోటు ఎక్కువ వచ్చినా గెలిచినట్లే, తక్కువ వస్తే ఎన్నికలు వచ్చినా వృథా)ను ప్రతి ఓటుకూ విలువనిచ్చే దామాషా ఎన్నికల పద్ధతిలోకి మార్చుకోవటానికి కావలసిన వెసులుబాటును కల్పించింది. వీలునుబట్టి మార్చుకోండి అంటూ శాసన మండలి ప్రాతినిధ్యం వంటి అంశాల్ని రాజ్యాంగ నిర్మాతలు తర్వాతి తరాలకు వదిలేశారు. కొన్నిటిపట్ల నిశ్శబ్ద సంకే తాలకే పరిమితమయ్యారు. ఈ రకంగా, భారత్ తో పాటు స్వతంత్రం వచ్చిన అనేక దేశాలకన్నా, పరిణతి చెందిన ప్రజాస్వామ్య దేశాలకన్నా కొన్ని అంశాల్లో భారత్ బలమైన ప్రజాస్వామ్యంగా రూపుదిద్దుకోవటంలో రాజ్యాంగం కీలకపాత్ర వహించింది.

**నియంతృత్వం పట్ల ధిక్కరణ - ఫెడరలిజం విస్తరణ**

ఈ స్వాతంత్ర్య దినోత్సవం వేళ ఇంకో కీలకాంశాన్నీ మననం గావించుకోవాలి. అది దేశ అంతర్గత ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తి కావటం. ఈ సవాలును కూడా భారత రాజ్యాంగం విజయవంతంగా అధిగమించింది. దేశం లోపల ఎమర్జెన్సీ ప్రకటించిన జూన్ 25 అర్ధరాత్రి, 1975 మరుసటి రోజు నుంచి ప్రజలకు అన్ని రాజ్యాంగ హక్కులూ బంద్ అయ్యాయి. వార్తాపత్రికల్ని ఆపేశారు. లక్ష మందిని రాత్రికి రాత్రి జైళ్లలో పెట్టారు. వారిలో లోక్‌నాయక్ జేపీ, వాజపేయి, జార్జి ఫెర్నాండెజ్, అద్వానీ తదితర ప్రతిపక్ష ప్రముఖులూ ఉన్నారు. ఎవరు కాస్త సామాజిక చైతన్యాన్ని ప్రదర్శించినా జైళ్లలో పెట్టటమో, వారిపై నిఘా ఉంచటమో చేశారు. ఇంత జరుగుతున్నా న్యాయవ్యవస్థ (ఈ ఏడాది సుప్రీంకోర్టుకూ 75 ఏళ్లు) కిమ్మనలేదు. హెచ్‌ఆర్ ఖన్నా లాంటి న్యాయమూర్తులు, కొందరు పార్లమెంటు సభ్యులు, రామ్‌నాథ్ గోయెంకా లాంటి ఎడిటర్లు మినహాయించి బయట ప్రతిఘటించేవారే కరువయ్యారు. కానీ ఆ తర్వాత ఎన్నికల్లో 'వ్యక్తులు కాదు వ్యవస్థలే ముఖ్యం, రాజ్యాంగమే దిక్సూచి' అని ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు చాటిచెప్పి రాజ్యాంగం అందించిన ఓటుహక్కు ద్వారా ఈ దేశాన్ని కాపాడారు. అనంతరం జనతా ప్రయోగం విఫలమై తిరిగి ఇందిర అధికారంలోకి వచ్చినా ఎన్.టి రామారావు చొరవతో ప్రాంతీయ పార్టీల నేతలు ఏకమై రాష్ట్రాల హక్కుల కోసం పోరాటంతో ఫెడరలిజం విస్తరణకు రాజ్యాంగం దోహదం చేసింది. కాంగ్రెస్ గుత్తాధిపత్యానికి తెరపడింది. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్

డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ చెప్పినట్లు ఎమర్జెన్సీ తర్వాత ఆటగాళ్లు మారారు తప్ప ఆట నియమాలు మారలేదుగానీ భారత ప్రజాస్వామ్యం పేదరికం, అవిద్య ఉన్నా, నియంతృ త్వాన్ని తట్టుకొని నిలబడింది. లోపం ప్రజల్లో, రాజ్యాంగంలో లేదు రాజకీయ పార్టీల్లో, నేతల్లో ఉందని నిరూపించారు.

మొత్తంగా చూస్తే, ఈవేళ ప్రయత్నించటానికి కూడా సాహసం చేయలేని రీతి రాజ్యాంగాన్ని మన తొలితరం నేతలు ఏకాభిప్రాయంతో అమల్లోకి తెచ్చారు. ఆనాటి పరిస్థితుల్లో లోపాలు, గందరగోళాల్ని సరిదిద్దుకునేలా సజీవ పత్రంలా రాజ్యాంగాన్ని అందించారు. ఇంతటి ప్రజాస్వామి కత ఉండబట్టే రాజ్యాంగ సంస్కృతి, నైతికత ఎక్కువమంది భారతీయుల్లోకి జీర్ణించుకుపోయాయి.

**ప్రజాస్వామ్యం, ఆర్థికాభివృద్ధి రెంటిలో ఏది ముఖ్యం?**

ప్రజాస్వామ్యం, ఆర్థిక బలం రెండూ దేశాభివృద్ధికి ముఖ్యమే. ఆర్థికంగా బలహీనమైన, దివాళా తీసిన దేశంలో ప్రజాస్వామ్యం చర్చే ఉండదు. ప్రజలు సాధికారత అసాధ్య మవుతుంది. అదే సమయంలో, కేవలం ఆర్థికాభివృద్ధి ఉండి, ప్రజాస్వామ్యం లేకుండా ఏదోక రకమైన నియంతృత్వం ఉన్నా, క్రమంగా ఆ దేశం బలహీనపడుతుంది. ఇరాన్ ఇందుకు పెద్ద ఉదాహరణ.


చైనాలో జాతీయస్థాయిలో రాజకీయ నియంతృత్వం ఉన్నా, స్థానిక ప్రభుత్వాలకు అసాధారణ సాధకారత కల్పించడంతో ఆర్థికాభివృద్ధికి మౌలిక ప్రజాస్వామిక బలం సమకూరింది. స్థానిక ప్రభుత్వాల సాధికారతలో భారత్ కి– చైనాకు ఎంత తేడా అంటే.. అక్కడి ప్రభుత్వ నిధుల్లో 50–60 శాతం స్థాని క ప్రభుత్వాలలోనే ఖర్చవుతుంటాయి. ఏ దేశం నుంచి ఏ ప్రముఖుడు చైనాలోని ఏ నగరానికి వెళ్ళినా ముందు ఆ నగర్ మేయర్ తోనే సమావేశం అవుతారు. చాలామేర వాణిజ్య ఒప్పందాల్నీ వారితోనే కుదుర్చుకుంటారు. మన దేశంలో, జాతీయస్థాయి నుంచి రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చేది 3 శాతం. అది కూడా లోక్‌సత్తా జేపీ లాంటివారి కృషి వల్ల 14వ ఆర్థిక సంఘం కాలం నుంచి. రాష్ట్రం నుంచి స్థానిక స్థాయికి నిధులు బదిలీ చాలాచోట్ల దాదాపు శూన్యం. కేరళ కొంత మినహాయింపుగానీ, అక్కడా పలు సంస్కరణలు అవ సరం.

కాబట్టి భారత్ కి ప్రజాస్వామ్యం బలమే తప్ప బలహీనత కాదు. చైనా ఎప్పుడు నియంతృత్వ ధోరణితో నిర్ణయాలు తీసుకున్నా నష్టపోయింది. ప్రజాస్వామికంగా వ్యవహరించి నప్పుడల్లా లాభపడింది.

**భారత్ కార్యాచరణ**

ఇప్పుడు తన రాజ్యాంగ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం

**చైనాలో జాతీయస్థాయిలో రాజకీయ నియంతృత్వం ఉన్నా, స్థానిక ప్రభుత్వాలకు అసాధారణ సాధకారత కల్పించడంతో ఆర్థికాభివృద్ధికి మౌలిక ప్రజాస్వామిక బలం సమకూరింది. స్థానిక ప్రభుత్వాల సాధికారతలో భారత్ కి– చైనాకు ఎంత తేడా అంటే.. అక్కడి ప్రభుత్వ నిధుల్లో 50–60 శాతం స్థానిక ప్రభుత్వాలలోనే ఖర్చవుతుంటాయి. ఏ దేశం నుంచి ఏ ప్రముఖుడు చైనాలోని ఏ నగరానికి వెళ్ళినా ముందు ఆ నగర్ మేయర్ తోనే సమావేశం అవుతారు. చాలామేర వాణిజ్య ఒప్పందాల్నీ వారితోనే కుదుర్చుకుంటారు.**



చేసుకుంటూ, చైనా నుండి అధికాభివృద్ధి, స్థానిక ప్రభుత్వాల సాధికారత, సాంకేతిక పరిశోధల్ని అనుసరించటం భారత్ ముందున్న మార్గం. కమ్యూనిస్టు, పెట్టుబడిదారీ వ్యవస్థలు రెంటిలోని మంచిని తీసుకొని నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, పెట్టుబడులను ప్రోత్సాహం, స్థానిక స్థాయి నుంచీ సంఘటిత రంగంలో ఉద్యోగాలు లభించేందుకు ఎంపిక చేసిన గ్రామాల కస్టర్లలో పట్టణ సదుపాయాలు, తయారీ రంగాన్ని ప్రోత్సహించటం, వ్యవసాయోత్పత్తుల నిలకడైన ఎగుమతులు, నిల్వ ప్రాసెసింగ్, రిటైల్ చెయిన్లు ద్వారా రైతులకు ఆదాయాన్ని పెంచటం, చట్టబద్ధ పాలన, దామాషా ఎన్నికల సంస్కరణలకు పటిష్ట చర్యలు తీసుకోవాలి.

జాతీయోద్యమ నేతల, రాజ్యాంగ నిర్మాతల తప్పిదాలు, పొరపాట్లు కన్నా మనం అనాలోచితంగా, జుగాడిజంతో ఈ దేశానికి చేసిన నష్టం ఎన్నోరెట్లు ఎక్కువ. ఆనాటి మూలాల నుంచి సమీక్ష చేసుకొని, ప్రపంచ దేశాలు అనుభవాల నుంచీ నేర్చుకుని, పైన పేర్కొన్న ఎజెండాతో చైనాలా పాతికేళ్ల పాటు వరుసగా 8 శాతం దాకా అభివృద్ధితో సంపన్న దేశాల స్థాయికి చేరటానికి సమ్మిళిత ఆర్థికాభివృద్ధి అవకాశాన్ని అందుకోవడమే 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ భారత్ కి సరైన కార్యాచరణ. ❖

# 75 ఏళ్ల భారత ఎన్నికల సంఘం మరింత పారదర్శకత అవసరం

భారత ప్రజాస్వామ్యంపై ఉన్న అనేక సందేహాల్ని పటాపంచలు చేసి నిలదొక్కుకుని, బలోపేతం చేసిన రాజ్యాంగ వ్యవస్థ ఎన్నికల సంఘం. ఎలక్షన్ కమిషన్ రాజ్యాంగ సంస్థే అయినప్పటికీ రాజ్యాంగం అమల్లోకి రావటానికి ఒకరోజు ముందే, జనవరి 25, 1950న అమల్లోకి వచ్చింది. రాష్ట్రపతి తన ప్రత్యేక అధికారాలతో రాజ్యాంగంలోని కొన్ని భాగాల్ని రిపబ్లిక్ డేకి ముందే అమల్లోకి తెచ్చారు. అలా ఏర్పడిన ఈసీ ఈ ఏడాది 75వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది.

1952లో దేశ తొలి సార్వత్రిక ఎన్నికల్ని నిర్వహించిన ఎన్నికల కమిషనర్ సుకుమార్ సేన్ సజావుగా ఎన్నికల్ని నిర్వహించి, ప్రభుత్వం ఏర్పడేలా చేయటం ఒక అద్భుతం. మన ప్రజాస్వామ్యంలో ఎన్ని లోపాలు, అవరోధాలున్నా ఎన్నికలు నిష్పాక్షింగా జరగటం, ఓటర్లు పోలింగ్ బూత్ లోపల స్వేచ్ఛగా ఓటు వేయటం, ఫలితాల్ని స్థూలంగా అందరూ ఆమోదించటం, శాంతియుతంగా అధికార మార్పిడి జరగటం అనే మౌలికాంశం విషయంలో మనం విజయవంతంగా మన సామర్థ్యాన్ని నిరూపించుకుంటున్నాం. మనతో పాటు స్వాతంత్ర్యం వచ్చిన అనేక దేశాల్ని చూస్తే, ఆధునిక ప్రజాస్వామ్యానికి మాతృకగా చెప్పే అమెరికా లాంటి సంపన్న దేశంలో డొనాల్డ్ ట్రంప్ లాంటి వారి విన్యాసాల్ని చూస్తే మన ఎన్నికల ప్రక్రియ విజయం ఎంత విలువైనదో అర్థమవుతుంది.

మన ఎన్నికల వ్యవస్థలో ఓటింగ్‌కి 1980ల వరకు బ్యాలెట్ పత్రాల్ని ఉపయోగించేవారు. ఇప్పటికీ స్థానిక ఎన్నికల్లో ఉపయోగిస్తున్నారుగానీ, 1983లో షాద్‌నగర్ అసెంబ్లీ నియోజక వర్గంలో ప్రయోగాత్మకంగా ఉపయోగించిన తర్వాత 1999 నుంచి ఈవీఎంలను (ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల) క్రమంగా అన్ని అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వాడుతున్నారు. ఎన్నికల్లో ఓడిపోయినవారు వీటిపై ఆరోపణలు చేయటం, ఆ తర్వాత గెలిచాక మౌనం వహించటం కొన్ని ఎన్నికల్లో చూశాం. జయలలిత, చంద్రబాబు నాయుడు, కెప్టెన్ అమరీందర్ సింగ్ వంటివారు ఇందుకు ప్రముఖ ఉదాహరణ. అయితే ఇటీవలి కాంగ్రెస్ అగ్రనాయకత్వం ఈవీఎంల పనితీరు, ఎన్నికల సంఘం నిష్పాక్షితపై తీవ్ర ఆరోపణలు చేస్తోంది. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల అనంతరం ఈసీ పనితీరు, ఎన్నికల నిర్వహణపై అనేక అనుమానాలను కాంగ్రెస్ వ్యక్త పరిచింది. దీనిపై వెంటనే ఈసీ స్పందించలేదుగానీ, విమర్శలు కొనసాగుతుండటంతో మళ్లీ వివరణ ఇస్తూ పార్టీల్ని చర్చలకు ఆహ్వానించింది. ప్రతి సందేహానికీ సమాధానం ఇస్తామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, మెషీన్ రీడబుల్ పద్ధతిలో గతేడాది నవంబర్ నుంచి తమకు మహారాష్ట్ర ఓటరు జాబితాలు కావాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేస్తూ రాహుల్ పత్రికలకు ఒక వ్యాసం ఇటీవల విడుదల చేశారు.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రాహుల్ ఇండియా కూటమిలోని (ఆ రాష్ట్రంలో మహాఘట్ బంధన్) ఎన్సీపీ (శరద్ పవార్), శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) తదితరుల అభ్యంతరాలు, ఒక గ్రామంలో రూ. 25లక్షలు సొంత డబ్బు ఖర్చుపెట్టి కేస్ స్టడీగా మాక్ పోలింగ్ పెట్టటానికి శరద్ పవార్ ప్రయత్నించటం తదితర అంశాలను 'జనబలం' పత్రికలో ఇప్పటికే చర్చించుకున్నాం.

ఓటరు జాబితాలో ప్రక్షాళనపై తొలిసారిగా గొంతువిప్పి, అందుకోసం పనిచేసింది ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్డీఆర్), లోక్ సత్తా సంస్థలు. 2000 సంవత్సరం నుండి. హైదరాబాద్ సనత్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇంటింటికి తిరిగి, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో, దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కొన్ని ఎంపిక చేసిన నియోజకవర్గాల్లో ర్యాండమ్ గా ఓటరు జాబితాల్ని లోక్ సత్తా అధ్యయనం చేసి పట్టణ, గ్రామిణ నియోజకవర్గాల జాబితాల్లోని లొసుగుల్ని ఎన్నికల సంఘం దృష్టికి తెచ్చింది. చాలా సుదీర్ఘ సమయం పట్టే చాకిరీ అది. కానీ లోక్ సత్తా కృషివల్లే చివరికి దేశవ్యాప్తంగా ఎన్నికల జాబితాల ప్రక్షాళనను ఈసీ 2003 నుండి చేపట్టింది. ప్రపంచంలో బహుశా మరే దేశంలోనూ లేని రీతిలో ఫోటోతో సహా ఓటరు జాబితాలు అందుబాటులోకి వచ్చాయి. ఓటరు జాబితాల్లో అవకతవకలు చాలామేర తగ్గి సింగిల్ డిజిట్ శాతానికి చేరుకున్నాయి. ఎవరికి ఓటు ఉందో ముఖ పరిచయంతో స్పష్టంగా చెప్పగలిగే గ్రామీణ ప్రాంతాల్లో కంటే పట్టణ ప్రాంతాల్లో ఓటరు జాబితాల్లో లోపాలు కాస్త అధికంగా ఉన్నా అవి మరీ ఎక్కువేమీ కాదు. మరణించినవారి పేర్లు తొలగించకపోవటం, వేరే ప్రాంతాలకు వెళ్లినా పాత నియోజకవర్గంలో, అదే బూత్ లో కూడా పేరు కొనసాగుతూ రెండుచోట్లా ఓట్లు ఉండటం వంటి సాంకేతిక సమస్యలున్నాయి.

అదేవిధంగా, ఎఫ్డీఆర్ లోని ఒక ఇంటెర్న్ ఈవీఎంలపై ఆరోపణలపై వాస్తవాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఓ ఎన్నికల్లో ఏజెంట్ గా పనిచేశారు. ఆ యంత్రాల్ని అమర్చటం, ప్రజలు తేలిగ్గా ఓటు వేసేలా తగినచోట ఏర్పాటు చేయటం, వికలాంగులు, ఓటు వేయటానికి ఇతరుల సహాయం కోరేవారు వస్తే ఏం చేయాలో నిబంధనల్ని ముందుగానే చదవకుండా, అప్పటికప్పుడు హడావుడిగా చదువుతూ పోలింగ్ క్యూ లైన్లు పెరిగేలా చేయటం వంటివి తప్ప ప్రత్యేకించి యంత్రాల్ని ట్యాంపర్ చేసే ప్రయత్నం, అందుకు అవకాశం కూడా లేదని సదరు యువ పరిశోధకుడు వివరించారు.

🔊 మనిషి సృష్టించిన ఏ యంత్రాన్నయినా ట్యాంపర్ చేయవచ్చు. కానీ అందుకు అవకాశం లేని పరిస్థితులు, ప్రక్రియా ఉన్నాయా, అందులో మనకీ పాత్ర కల్పిస్తున్నారా అన్నది ప్రజలకు, పార్టీలకు ముఖ్యం. తాము ఒక పార్టీకి ఓటు వేస్తే, వీవీ ప్యాట్ రసీదులో మరోపార్టీ గుర్తు వచ్చిందని ప్రజలు, తమకు ఓటరు జాబితాల వివరాలు ఇవ్వలేదు, తమ పరిశీలన లేకుండానే ఈవీఎంలను అమర్చటం, సీల్ వేయటం చేశారు అని రాజకీయ పార్టీల అభ్యర్థుల ఏజెంట్లు ఫిర్యాదులు చేసిన సందర్భాలు అరుదు. కొన్ని సాంకేతిక అవకతవకలు అక్కడక్కడా జరిగుండొచ్చు. కానీ స్వేచ్ఛగా ఓటు హక్కుని వినియోగించుకోవటానికి ఆటంకం లేదు. పోలింగ్ బూత్ లోపల అవకతవకలు జరిగాయనటానికి ఆధారాలు లేవు. అదేవిధంగా, ఈవీఎంల ట్యాంపరింగ్ చేయవచ్చని సాధికారికంగా నిరూపించిన దాఖలాలూ లేవు.

🔊 ప్రక్రియలో లోపాలుంటే, వాటిని నిరూపించకుండా ఊహాజనితంగా కొన్ని గణాంకాల ప్రాతిపదికన విమర్శిస్తూ మొత్తం వ్యవస్థ విశ్వసనీయత మీదే దాడి చేయటం సరికాదు. ఎన్నికల నిర్వహణలో లోపాలను ఎత్తి చూపినప్పుడు నిష్పాక్షికంగా ఆ సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఈసీపై కూడా ఉంది.

🔊 ఎన్నికల సంఘంలో కమిషనర్ల నియామక ప్రక్రియను కూడా కాంగ్రెస్ కొన్ని ఇతర ఇండియా కూటమి పార్టీలు తప్పుపడుతున్నాయి. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ను ఎంపిక కమిటీలో సభ్యునిగా చేయలేదన్న విమర్శ చేస్తున్నాయి. భారతదేశానికి స్వతంత్రం వచ్చిననాటి నుంచి ఎంపిక కమిటీ లేకున్నా, ఎన్నికలు సవ్యంగానే జరుగుతున్నాయి. కావాలనుకుంటే కమిటీ కూర్పు మీద పార్లమెంట్ లో చర్చించి మెరుగైన పరిష్కారం సూచించవచ్చుగానీ, సీజెఐ తప్పనిసరిగా ఉండాలనటం అర్థరహితం. ఈసీ అంటే ఎన్నికల చీఫ్ కమిషన్, కమిషనర్లు మాత్రమేకాదు, ఈ దేశంలోని కోట్లాది ప్రభుత్వోద్యోగులు కూడా. సర్కారీ ఉద్యోగులే ఎన్నికల సమయంలో ఈసీ ప్రతినిధులుగా పని చేస్తారు.

**భారత్ ఎన్నికల సంఘం వ్యవహార శైలి**

అయితే, ఈవీఎంలపై ఆరోపణలు చేస్తున్నవారు బ్యాలెట్ పేపర్ల కాలంలో అవకతవకల్ని విస్మరిస్తున్నారు. రిగ్గింగ్, బ్యాలెట్ పత్రాలపై సిరా పోయటం, బాక్సులను ఎత్తుకెళ్లి బావిలో పడే యటం వంటివి జరిగేవి. ఈ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిం చలేక రీపోలింగ్ జరపటం ఆనవాయితీగా ఉండేది. బ్యాలెట్ తో పోలిస్తే ఈవీఎంలతో అలాంటి సమస్యలు అరుదు. ప్రపంచ దేశాలు ఉన్నకొద్దీ సాంకేతికత వైపు మొగ్గు చూపుతున్నాయిగానీ, వెనక్కి మళ్లటం లేదు. మొబైల్ యాప్ ద్వారా 'ఈ-ఓటింగ్' వంటివి స్థానిక ఎన్నికల్లో పరిమితంగానే అయినా విజయ వంతంగా అమలవుతున్నాయి.

అయితే ఈసీ వ్యవహారశైలి కొన్ని సందర్భాల్లో అనుమానాలకు దారితీస్తోంది. ఉదాహరణకు, పోలింగ్ పూర్తయిన సాయంత్రం 5:00 గంటల సమయానికి ఉన్నవారు ఓట్లు వేసినా, ఓటర్ శాతంలో పెరుగుదల మహారాష్ట్రలో 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 1.08%, 2019లో 0.59% మాత్రమేకాగా, 2024లో అది ఏకంగా 7.83% మేర ఉంది. దీనికి సంతృప్తికరమైన వివరణ ఈసీ ఇంకా ఇవ్వలేదు. ఈసీ చెప్పిన వివరణ ప్రకారం, రెండు గంటల వ్యవధిలో రాష్ట్రంలోని పోలింగ్ బూత్ లలో 116 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. దీనికి సంబంధించిన సీసీటీవీ, ఎలక్ట్రానిక్ పరికరాల సాక్ష్యాలను ఒక పరిధి దాటి ఇవ్వటం సాధ్యం కాదని, అందుకోసం యూనియన్ ప్రభుత్వంతో సంప్రదించి 1961 నాటి ఎన్నికల నిర్వహణ చట్టంలో 93 (2) (ఎ) సవరణ చేసింది. మనదేశంలో ఎన్నికల వివాదాలు, ఫలానా పార్టీకి ఓటు వేయటాలు అమెరికాలోలా బహిరంగంగా చెప్పడానికి భయపడే మాట వాస్తవం. ఓటు వేసినవారి ఫుటేజీని ఆ రకంగా దుర్వినియోగం చేసే అవకాశాన్ని బూచిగా చూపి పారదర్శకత లేకుండా ఈసీ వ్యవహరించటం వల్ల అనుమానాలు పెరుగుతూ ఇంకా పెద్ద సమస్య తలెత్తుతోంది.

అదేవిధంగా బీహార్ లో 'సర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ. ఓటరు జాబితాల సమగ్రతను కాపాడాలన్న రాజ్యాంగ ఆదేశాన్ని నిర్వహించటం కోసం పూర్తిస్థాయి సమీక్ష కింద ప్రత్యేక కార్యక్రమంగా 'సర్' నిర్వహిస్తున్నట్టు ఈసీ తెలిపింది. ఇంతకు ముందు కూడా ప్రత్యేక సమీక్ష ద్వారా ఓటరు జాబితాల సవరణ జరిగిందిగానీ, స్పెషల్ జోడించి సర్ పదప్రయోగం ఇదే మొదటిసారి. బీహార్ తో మొదలుపెట్టి త్వరలో ఎన్నికలు జరగనున్న అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ లో కూడా సర్ అమలు చేస్తామని తెలిపింది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా అమలు చేస్తామని, భారత పౌరులు కానివారు ఓటు వేయకుండా నిరోధించడానికి నిర్దిష్ట సంవత్సరం తర్వాత ఓటరు నమోదు ప్రక్రియ మొత్తాన్నీ ఇందులో తనిఖీ చేస్తారు.

ఆధార్, రేషన్ కార్డు, ఓటరు ఐడీ మినహా తగిన ప్రభుత్వ అధికృత ధ్రువపత్రాలను తమ బీహార్ నివాసిగా పౌరులు సాక్ష్యంగా చూపాలని ఒక జాబితాను ఇచ్చారు. బీహార్ లో దాదాపు 7.94 కోట్లమంది ఓటర్లు ఉన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 7,72,59,579మంది ఓటు వేశారు. వీరిలో 2003 నాటికి ఓటరు జాబితాల్లో ఉన్నవారు 4.96 కోట్లని, వీరుకాక మిగిలిన 2.77 కోట్లమంది మాత్రమే ధ్రువీకరణ పత్రాలు చూపితే చాలని ఎన్నికల సంఘం చెబుతుంది. ఇందుకోసం 77,895 మంది బూత్ స్థాయి అధికారులను తొలుత, ఆ తర్వాత అదనంగా మరో 21,000మందిని నియమించారు. పార్టీల ఏజెంట్లు వీటిని ప్రతి దశలో తనిఖీ చేసుకోవచ్చంటున్నారు. బీజేపీ (53,338), ఆర్జేడీ (47,506), జేడీయూ (36,550), కాంగ్రెస్ (17,549)మంది ఏజంట్లను నియమించుకున్నాయి. అయితే 2003లో సుమారు రెండేళ్లపాటు 700 రోజులదాకా జరిగిన ఓటరు జాబితాల స్పెషల్ రివిజన్ ను ఇప్పుడు ఎన్నికలు జరగనున్న కొన్ని నెలల వ్యవధిలో పూర్తి చేయటం అసాధ్యమని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఒక జాతీయ ఆంగ్ల దినపత్రిక సీనియర్ జర్నలిస్ట్ అంటున్నారు. 2003లో ఖరారైన 4.96 కోట్ల ఓటర్లు ఇప్పుడు లేరని, వివిధ కారణాలరీత్యా కేవలం 3.16 కోట్లమందే ఉన్నారని చెబుతున్నారు. ఇక మిగిలినవారిని ఇంటింటికీ మూడుసార్లు వెళ్లి

తనిఖీ చేయాలంటే, ఒక్క బీఎల్ఓ 2,513 సార్లు తిరగాల్సి ఉంటుందని, ఇది ఎంతవరకు ఆచరణసాధ్యమని ప్రశ్నిస్తున్నారు. బీజేపీ మినహా మిగతా రాజకీయ పార్టీలు దీనికి అభ్యంతరం చెబుతున్నాయి. అర్హులైన ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా చేయటం, రాజకీయ పార్టీలు తమ భావజాలంతో, అజెండాతో సాధ్యమైనంత విస్తృతంగా ప్రజల్లోకి సమీకరించుకునే వెసులుబాటు కల్పించటం ఈసీ బాధ్యత. ప్రోటోకాల్స్ అంచనాకు ఉపయోగపడాలి. అవి ఈసీ బాధ్యతలకు అవరోధం కాకూడదు. అయితే తలసరి ఆదాయం తక్కువగా ఉన్న బీహార్ నుంచి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లినవారికి ధ్రువీకరణ, ఓటు వేయటంకోసం పలుసార్లు తిరిగే ఆర్థిక వెసులుబాటు ఉండదని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14,19 (1), (ఏ), 21 మొదలైనవి ఉల్లంఘించటమేనని, ఆర్జేడీ, టీఎంసీ నేతలు ఏడీఆర్, పీయూసీఎల్ వంటి సంస్థలు, ఇంకొన్ని రాజకీయ పార్టీలు కోర్టుకెక్కాయి. ఈ నేపథ్యంలో, సెప్టెంబర్ 30న తుది జాబితా వెలువరించేలోగా ఓటరు ధ్రువీకరణకు కొంత వెసులుబాటు ఇస్తున్నట్లు (ఈ తేదీని వాయిదా వేయచ్చంటున్నారు) ఈసీ తెలిపింది. సర్ లోని నిబంధనలను సరిగా చదివితే అపోహలకు ఆస్కారం ఉండదని తెలిపింది. ఓటర్ల అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిష్కరించాకే తుది జాబితాకు ప్రచురిస్తామని సుప్రీంకోర్టు కు హామీ ఇచ్చింది. ఇప్పటికే ప్రక్రియ పూర్తయిందని తెలిపింది.

ఈసీ చర్య రాజ్యాంగబద్ధమైనదని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసింది. అయితే ఇంత తక్కువ వ్యవధిలో సర్ నిర్వహణ పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. రాజ్యాంగబద్ధమైనది అనైతికం కాక పోవచ్చుగానీ ఇప్పటికే ఆరునెలలపాటు సమ్మరీ రివిజన్ పూర్తిచేసి జనవరిలో కొత్త ఓటరు జాబితాల్ని ప్రకటించి ఉండటం, ఎన్నికలు త్వరలో జరగాల్సిన వలసలు, వానలు, వరదల రాష్ట్రంలో హడావుడిగా సమగ్ర ప్రత్యేక ఓటరు సవరణ చేప ట్టటం, ఆధార్, ఓటరు ఐడీ, రేషన్ కార్డు చెల్లవనటం విమర్శలకు తావిస్తోంది.

ఒక జాతీయ ఆంగ్ల ఛానల్ నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్ లో, బీహార్–నేపాల్ మధ్య రాకపోకలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. బంగ్లాదేశీయుల్ని అక్రమ వలసలపై గట్టిగా ప్రశ్నిస్తే భౌతిక దాడులకు దిగే ప్రమాదం ఉందని ఒక బీఎల్ఓ బహిరంగంగానే చెప్పారు. అందువల్ల కొందరిని చూసీచూడనట్లు వదిలేస్తున్నట్లు తెలిపారు. నేపాల్, బంగ్లాదేశ్ నుంచి బీహార్ గుండా వలసలు ఎన్నోతరాలుగా జరుగుతున్నాయని కొందరు బీహారీలు కూడా వలసదారులకి అండగా నిలుస్తుండటంతో, పత్రాల విషయంలో కొంత వెసులుబాటు ఇస్తున్నారు. మరోవంక, ఆ బెంగాలీలు బంగ్లాదేశీలు కాదని, పశ్చిమ బంగ వారని, తామూ భారత్ లో భాగమేనని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శిస్తున్నారు. నష్ బందీ, నోట్ బందీలాగా సర్ కార్యక్రమం ఓట్ బందీ అని కొందరు విమర్శిస్తున్నా బీహార్ లో సుమారు 20 శాతం అక్రమ వలసదార్ల ఓట్లున్నాయని విశ్లేషకుల అభిప్రాయం. సీఈసీ కూడా ఈ మాట చెప్పారు. కానీ ఈసీ ఆలస్యంగా మేలుకొంది. మొదట్నుంచీ కట్టడి చేసినట్లయితే, పరిస్థితి ఇంత దూరమొచ్చేదికాదు. హడావుడిగా, కొన్నిచోట్ల మొక్కుబడిగా జరుగుతున్న ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ పూర్తిస్థాయిలో జరగటం సాధ్యం కాదన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తోంది. అయితే ఈ ప్రయత్నం అవసరమనటంలో భేదాభిప్రాయాలు లేవు. సమయాభావం, కొందరు అధికారుల అలసత్వం, క్షేత్ర స్థాయి పరిస్థితుల ప్రభావం కారణంగా, తుది జాబితా నాటికి ఏం జరుగుతుందో, ఏరకంగా వెలువడుతుందో వేచి చూడాల్సిందే.


అసెంబ్లీ స్థాయి నుంచి గత నాలుగు నెలలుగా రాజకీయ పార్టీలతో 5 వేలసార్లు సమావేశమయ్యామని, వీటిల్లో రాజకీయ నాయకులు సహా 28,000 మంది పాల్గొన్నారని జులై మొదటివారంలో సీఈసీ తెలిపారు. ప్రతి ప్రాంతీయ, జాతీయ పార్టీతో సమావేశమవుతూ సందేహాలు నివృత్తి చేస్తూ సూచనల్ని ఆహ్వానిస్తున్నామన్నారు. పోలింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు వెల్లడించే ఆధునిక సాంకేతికతను బహుశా బీహార్ ఎన్నికల నుంచే ప్రవేశపెట్టొచ్చంటున్నారు. పోలింగ్ బూత్ లోపల, ఎన్నికల నిర్వహణలో పెద్ద సమస్యలు లేకపోయినా ు ఓటరు జాబితాలు, ఓటింగ్ శాతం నమోదు, ఈవీఎంల పనితీరు, ఇతర సాంకేతికతల వినియోగంపై కాంగ్రెస్, కొన్ని ప్రతిపక్షాల ఆరో పణలకు కూడా ఈసీ అవకాశం ఇవ్వకూడదు. బీహార్ లో 2003లో నిర్వహించిన ఓటరు జాబితాల ప్రత్యేక సవరణకు సంబంధించిన ఉత్తర్వుల కాగితం కనిపించలేదని చెప్పటం ఈసీలాంటి రాజ్యాంగ సంస్థ స్థాయికి తగదు.

**పోస్టాఫీసుల ప్రతిపాదన అమలు చేసుంటే సమస్యలు తలెత్తేవి కావు**

2003లో ఓటరు జాబితాల ప్రక్షాళనపై ఈసీకి ఒక నమూనాను అందించటంతో పాటు, పోస్టాఫీస్ నోడల్ ఏజెన్సీగా సంవత్సరంలో 365 రోజులూ ఓటరు జాబితాల్లో పౌరులు మార్పులు, చేర్పులు గావించుకునేందుకు వీలుగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్డీఆర్), లోక్ సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఈసీకి సూచించారు. కానీ ఓటరు జాబితాల సవరణను అప్పుడప్పుడూ కాకుండా నిరంతర ప్రక్రియగా మార్చటంపై ఈసీ శ్రద్ధ చూపలేదు. దానివల్లే ఇప్పుడు సర్ పై విమర్శలు రావటం లాంటి పరిస్థితి. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు రాజ్యాంగ విరుద్ధంగా టీవీలు, బంగారు గొలుసులు వంటి హామీలు ఇవ్వకుండా నిరోధించాలని 2008లో, ఆ తర్వాత జేపీ లేఖ రాసినా ఈసీ ధైర్యం చేయలేదు. ఇప్పుడు కొన్ని రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోయే స్థాయికి తాత్కాలిక తాయిలాలు విస్తరించాయి. పరిస్థితి ఈసీ చేయి దాటిపోయింది.

పోలింగ్ బూత్ పరిధిలో ఈసీ మరింత పారదర్శకంగా, సమర్థంగా, అనుమానాలకు ఆస్కారం ఇవ్వకుండా వ్యవహ రించడంతో పాటు పోలింగ్ బూత్ బయట కోట్లాది రూపాయల అక్రమ ధనం ఎన్నికల్లో ఖర్చుకాకుండా ప్రస్తుత ఎన్నికల వ్యవస్థను మార్చి దామాషా పద్ధతి తేవటం, స్థానిక ప్రభుత్వాల సాధికారత, పార్టీల అగ్రనేతలు కాకుండా సభ్యులు అభ్యర్థులను నిర్ణయించే ప్రజాస్వామీకరణ మొదలైన రాజకీయ సంస్కరణలకు పార్టీలు చొరవ చూపాలి. ప్రజాస్వామ్యానికి కీలకమైన ఈసీ 75వ వార్షికోత్సవ సంవత్సరంలోనైనా నిజమైన ఎన్నికల సంస్కరణల మీద భారత రాజకీయ వ్యవస్థ దృష్టి సారించటం అవసరం. ❖

# ఒక్క నిమిష ప్రియ కేసుకే కదిలిపోతున్నాం..
# భారత్‌లో ఎన్నో విషాదాల సంగతేంటి?



అరాచక యెమెన్‌లో మరణ శిక్ష పడిన కేరళ నర్స్ నిమిష ప్రియ కేసు చాలామంది భారతీయుల హృదయాల్ని కదిలించింది. మెరుగైన అవకాశాల కోసం చట్టబద్ధపాలన సక్రమంగాలేని అలాంటి దేశాల్లో కూడా లక్షల మంది భారతీయులు నివశిస్తున్నారు.

ఆదాయాల కోసం యెమెన్ తరహా దేశాలకు వెళ్లాలనుకునేవారికి భారత ప్రభుత్వం తగిన సమాచారం, సలహా సూచనల్ని అధికారికంగా అందించాలి. ఇందుకోసం ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

ప్రవాస భారతీయులు మన దేశానికి అపార తోడ్పాటును అందిస్తున్నారు. భారీ మొత్తాల్ని పంపుతున్నారు (2024-25లో 135 బిలియన్ డాలర్లు). వారు స్థానిక పరిస్థితులకు, అరాచకత్వానికి బాధితులు కాకుండా నిరోధించేందుకు ముందుగానే కౌన్సిలింగ్ ఇవ్వాలి. నిమిష ప్రియ కేసులో లాగా ఒక భయంకర విషాదం తర్వాత స్పందించటం వల్ల పెద్ద ప్రయోజనం ఉండదు.

చివరిగా, మన దేశంలో చట్టబద్ధపాలన దుస్థితి మాటేమిటి? మన కోర్టుల్లో 5.2 కోట్ల కేసులు పెండింగ్ లో ఉన్నాయి. థర్డ్ డిగ్రీ పద్ధతుల్లో నేరాల్ని ఒప్పిస్తున్నారు. జైళ్లలో మగ్గుతున్న లక్షలాది మందిలో 70% విచారణలో ఉన్న ఖైదీలే. కోర్టు బయట అనధికార సెటిల్ మెంట్లు సాధారణమైపోయాయి. ఉన్నకొద్దీ, బడితె ఉన్నవాడిదే బర్రె అవుతోంది. మన సామాజిక స్థిరత్వం, ఆర్థికాభివృద్ధి కోసం సైతం చట్టబద్ధపాలన వ్యవస్థల్ని సంస్కరించటం తప్పనిసరి.

మన భావోద్వేగాలను తాకే ఒక కేసుపై స్పందించటం తేలిక. నిమిష ప్రియ ఉదంతంలోలా. కానీ ప్రతి పెండింగ్ కేసు, న్యాయ వైఫల్యం వెనకా కోట్లాది మంది కన్నీరు, బాధామయ గాథలు దాగి ఉంటాయి. పోలీస్, ఫోరెన్సిక్, ప్రాసిక్యూషన్, కేసు విచారణా పద్ధతులు, ట్రయల్ కోర్టులు, రాజ్యాంగ కోర్టులను సంస్కరించటం భారత్‌కు అత్యవసరం.

**– డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,**
**ప్రజాస్వామ్య పీఠం(FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు**

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th August, 2025 Posting Date 15 &16th of every month
Posted at BPC-IV Patrika Channel, Nampally, HYDERABAD-500 001




కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపరుల ఆస్తులు జప్తు చేయటమెలా?
తెలంగాణ ప్రజల పన్నుల డబ్బు రికవర్ చేయడమెలా?
ఈ అంశంపై ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఏం చెబుతున్నారు..

Watch @
https://www.youtube.com/@JPLoksattaOfficial

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.
Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.